www.andhrajyothy.com పేజీలు: 14 వెల (Price): Rs. 6.50 గుంటూరు సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 327

సోమవారం | 2-2-2026

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా.1:52 తదుపరి విదియ; నక్షత్రం: ఆశ్లేష రా.10:48 తదుపరి మఖ; వర్జ్యం: మ.12:08-1:40; దుర్ముహూర్తం: మ.12:51-1:36, మ.3:06-3:51; అమృతఘడియలు: రా.9:16-10:48; రాహుకాలం: ఉ.7.30-9:00; సూర్యోదయం: 6:50; సూర్యాస్తమయం: 6:07

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చంద్రబాబుకు ఈడీ క్లీన్‌చిట్!

స్కిల్ కేసులో ఆయన ప్రమేయంపై ఆధారాల్లేవు



- విశాఖ పీఎంఎల్‌ఏ కోర్టులో అనుబంధ చార్జిషీటు
- ఆయన పాత్ర లేదు.. నిందితుడిగా చేర్చలేం: ఈడీ
- చార్జిషీటును పరిగణనలోకి తీసుకున్న కోర్టు
- ఈ కేసులో గత నెలలోనే ఆయనకు సీఐడీ క్లీన్‌చిట్
- నాడు నానా గగ్గోలు పెట్టిన జగన్ అండ్ కో
- నేడు ఈడీ తేల్చేయడంతో మూతబడిన నోళ్లు

అమరావతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో కొందరు నిందితులు ప్రభుత్వ నిధులు మళ్లించినట్లు గుర్తించామని.. కానీ చంద్రబాబు పాత్ర మాత్రం లేదని పేర్కొంది. అందువల్ల ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చలేమని తెలిపింది. గత నెల 28న విశాఖపట్నంలోని ప్రత్యేక పీఎంఎల్‌ఏ (మనీలాండరింగ్ నిరోధక చట్టం) కోర్టులో తాను దాఖలు చేసిన అనుబంధ చార్జిషీటును న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుందని ఈడీ ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి.. తప్పుడు కేసులో చంద్రబాబును అరెస్టుచేయడంతో

మిగతా 2వ పేజీలో...



3

సింఘాల్‌పై బదిలీ వేటు

- వెంటాడిన ఆరేళ్ల నాటి 'మౌనం'
- కల్తీ నెయ్యి వ్యవహారంలో చర్యలు
- అవినీతి ఆరోపణలు లేకున్నా.. అసమర్థత ఫలితంగా 'ఔట్'.. ఆయనపై సిట్ నివేదిక
- ముద్దాడ రవిచంద్రకు అదనపు బాధ్యతలు
- ఈలోగా వెంకయ్యకు తాత్కాలిక బాధ్యతలు

రోత మాటలపై రగిలిన అగ్గి!

బాబు, లోకేశ్‌పై జోగి దుర్భాషలు

- భగ్గుమన్న టీడీపీ శ్రేణులు
- రమేశ్ ఇంటిపై రాళ్లతో దాడి
- పెట్రోలు సీసా విసిరి నిప్పు
- పగిలిన మొదటి అంతస్తు అద్దాలు
- మాజీ మంత్రిపై కేసు నమోదు
- అయినా తీరు మార్చుకోని జోగి
- ఈసారి సీఎంపై 'ఫేక్' వ్యాఖ్యలు

2





పెట్రోలు సీసా విసరడంతో జోగి ఇంట్లో రేగిన మంటలు

నేతలు ఆ భాష మాట్లాడకూడదు

హుందాగా ఉండాలి

అంబటి సతీమణి పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు

జైలుకు అంబటి

- సీఎంపై బూతుల కేసులో రిమాండ్
- రాజమండ్రి జైలుకు తరలింపు

అరాచకమే వైసీపీ కల్చర్!

ప్రతిపక్షంలో ఉన్నా అంతే: సీఎం

సుంకాలకు జంకం..

బడ్జెట్ సమగ్ర కథనాలు
9, 10, 11, 12, 13, 14లో

ఆత్మనిర్భర శంఖం

ట్రంప్ దెబ్బతో కుదేలైన రంగాలకు చేయూత

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ సహా ఐదు రాష్ట్రాలకు ఈ ఏడాదే ఎన్నికలు జరగనున్నాయి! మామూలుగా అయితే బడ్జెట్లో వాటికి తాయిలాలు ప్రకటిస్తారు! పథకాలు, నిధులు పారిస్తారు! కానీ, ఎన్నికల్లో గెలుపునకు 'వేరే వ్యూహాలు' ఉండడంతో ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ఈసారి రాజకీయ లబ్ధికి చోటివ్వలేదు!

గత ఏడాదే వ్యక్తిగత ఆదాయ పన్నును భారీగా సరళీకరించారు. ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించారు. ఆర్బీఐ ఇటీవల వడ్డీ రేట్లను కూడా తగ్గించింది. వీటితో ట్రంప్ సుంకాలను దీటుగా ఎదుర్కొన్నా.. రాబడి భారీగా పడిపోయింది. ఏకంగా రెండు లక్షల కోట్ల వరకూ పన్ను వసూళ్లు పడిపోయాయి. దాంతో, ఉన్న పథకాలకే కోతలు పెట్టాల్సి వచ్చింది. అందుకే.. ఈసారి 'పంపిణీ పథకాల' ఊసెత్తలేదు!

మాట మాట్లాడితే ట్రంపు సుంకాలంటున్నాడు! ఇప్పటికే 50 శాతం సుంకాలతో ఫార్మా, టెక్స్‌టైల్స్, సముద్ర ఉత్పత్తులు తదితర పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దాంతో, కిం కర్తవ్యమన్న ప్రశ్నకు తక్షణ కర్తవ్యాన్ని ఆర్థిక మంత్రి నిర్దేశించారు. ఎగుమతులను మరింత ప్రోత్సహించేలా ఆయా రంగాలకు చేయూతనిచ్చారు. మూడంచెల్లో దిగుమతులను తగ్గించాలని సంకల్పించారు.

- 'కస్టమ్స్' తగ్గింపు.. ఎగుమతులు పెంచే వ్యూహాలు
- దేశంలో మరిన్ని మెగా టెక్స్‌టైల్ పార్కులు
- రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్లు.. ఏపీకి ఒకటి
- 2047 వరకూ డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే
- మూలధన వ్యయం లక్ష కోట్లు పెంపు
- నిర్మాణ, తయారీ రంగాలకు మరింత ప్రోత్సాహం
- సెమీ కండక్టర్ పరిశ్రమకు 40 వేల కోట్లు
- 2 లక్షల కోట్ల మేర తగ్గిన పన్ను వసూళ్లు
- పలు పథకాలకు కేటాయింపుల్లో కోతలు
- 9వసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మల
- ఎస్టీటీ దెబ్బ.. సెన్సెక్స్ 1,546 పాయింట్లు పతనం

జాతీయ, అంతర్జాతీయ సవాళ్లకు దీటుగా బడ్జెట్‌లో 'స్వదేశీ మంత్రం' పఠించారు! సుంకాలకు జంకేది లేదంటూ ఆత్మ నిర్భర అస్త్రానికి పదును పెట్టారు! ట్రంప్ సుంకాలతో దెబ్బతిన్న రంగాలకు 'కస్టమ్స్' తగ్గించారు! నిర్మాణ, తయారీ రంగాలకు మరింత 'బూస్ట్' ఇచ్చారు! గ్లోబల్ మార్కెట్లతో కలిసిమెలిసి సాగాలని.. ఎగుమతులను మరింతగా విస్తరించాలని సంకల్పించారు! జెన్‌జీకి జైకొట్టారు! ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు సంకల్పం చెప్పుకొన్నారు! వ్యక్తిగత ఆదాయ పన్ను విషయంలో మాత్రం ఎటువంటి మార్పులూ చేయలేదు. ఉద్యోగులకు ఎటువంటి ఊరటా కల్పించలేదు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.53.47 లక్షల కోట్ల

మిగతా 10వ పేజీలో...



బడ్జెట్ సమర్పణకు ముందు పార్లమెంటు భవనం వద్ద నిర్మలా సీతారామన్

ఆర్థిక వృద్ధికి మూడు కర్తవ్యాలు

ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో భారత ఆర్థిక వృద్ధిని ముందుకు తీసుకెళ్లడంతోపాటు పేదలు, నిస్సహాయులకు అండగా నిలవడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం మూడు కర్తవ్యాలను నిర్దేశించుకున్నాం. అవి.. ఉత్పాదకత ద్వారా దేశ ఆర్థిక వృద్ధిని పెంచడం; సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చడం; వనరులను, అవకాశాలను అన్ని కుటుంబాలు, వర్గాలు, రంగాలకు అందుబాటులో ఉండేలా చూడడం.. తద్వారా సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్ సాధించడం. - నిర్మల



సంస్కరణలకు కొత్త శక్తి

కేంద్ర బడ్జెట్ చరిత్రాత్మకం. 140 కోట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోంది. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు మార్గదర్శనం చేస్తుంది. నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం ఓ రికార్డు. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు బడ్జెట్ ఊతమిస్తుంది. సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌కు ఇది కొత్త శక్తిని ఇస్తుంది.


- ప్రధాని నరేంద్ర మోదీ



సంక్షోభాలపై పట్టింపేది?

దేశ వాస్తవ సంక్షోభాలను కేంద్ర బడ్జెట్ పట్టించుకోలేదు. యువతకు ఉద్యోగాల్లేవు. తయారీ రంగం పతనమైపోతోంది. రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నా పట్టించుకోలేదు. పెట్టుబడిదారులు తమ పెట్టుబడులు ఉపసంహరించుకుంటున్నారు. కుటుంబాల గృహ పొదుపు తగ్గిపోయింది. ప్రపంచ దేశాల నుంచి ఎదురుదెబ్బలు తగులుతున్నా పట్టించుకోలేదు.

- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



ఉద్యోగాలపై ఏఐ ప్రభావం ఎంత?

- అంచనాకు స్టాండింగ్ కమిటీ
- సేవల రంగంలో ఎమర్జింగ్ టెక్నాలజీల ప్రభావంపై అధ్యయనం
- ఉపాధి పెంచే సాంకేతికతల అభివృద్ధికి గ్రిడ్
- సేవల మార్కెట్‌లో 10 శాతం వాటా లక్ష్యం



ఐటీ స్లాబుల్లో మార్పులు లేవు

- ఏప్రిల్ 1 నుంచి కొత్త చట్టం
- రిటర్నుల దాఖలు మరింత సులభం
- చిన్న చెల్లింపుదారులకు ఆటో ప్రాసెసింగ్
- విదేశాల్లోని ఆస్తుల వెల్లడికి ప్రత్యేక స్కీమ్
- సదరు ఆదాయం/ఆస్తులపై 30% పన్ను
- మరో 30 శాతం జరిమానా



రాష్ట్రాలకు 'గ్రాంట్లు' బంద్

- రెవెన్యూ లోటు గ్రాంట్లు, ప్రత్యేక గ్రాంట్లు అవసరం లేదు
- ఖర్చులకు తగ్గట్టు సంపాదించుకునే శక్తి రాష్ట్రాలకు ఉంది
- జీఎస్‌డీపీలో ద్రవ్య లోటు 3% దాటకూడదు
- కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 41 శాతం వాటా
- ఆర్థిక సంఘం నివేదిక.. సర్కారు ఆమోదం



సిందూర్ ఎఫెక్ట్

- రక్షణకు అధిక నిధులు
- రూ.7.85 లక్షల కోట్లు కేటాయించిన నిర్మలమ్మ
- గత ఏడాది కంటే 15 శాతం ఎక్కువ
- మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో 14.67%
- అన్ని శాఖల కన్నా అత్యధికం ఆ శాఖకే
- ఆయుధాల కొనుగోళ్లు, రక్షణ వ్యవస్థల ఆధునికీకరణకు రూ.2.19 లక్షల కోట్లు

(రూ. కోట్లలో)



పెరిగేవి, తగ్గేవి ఇవే..

పెరిగేవి.. ఖరీదైన వాచీలు, ఆల్కహాల్; కాఫీ మెషిన్లు, వీడియో గేమ్స్ విడిభాగాలు; అమ్మోనియం/నైట్రో ఫాస్ఫేట్ ఫెర్టిలైజర్స్, నాఫ్తా

తగ్గేవి.. 17 రకాల క్యాన్సర్ ఔషధాలు, ఏడు అరుదైన వ్యాధుల ఔషధాలు, ఆహారం; విదేశీ పర్యాటక ప్యాకేజీలు, విదేశీ విద్య; మైక్రోవేవ్ ఓవెన్స్ విడిభాగాలు; లెదర్ ఉత్పత్తులు, క్రీడా పరికరాలు; సోలార్ గ్లాస్ తయారీలో వాడే ముడిసరుకు, టీవీ ఎక్విప్‌మెంట్

ఏపీకి ఏమిచ్చారంటే..!

- రేర్ ఎర్త్ కారిడార్.. 'పూర్వోదయ'లో ఈస్ట్ కోస్ట్ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి
- పోలవరం ప్రాజెక్టుకు రూ.3,320 కోట్లు.. అమరావతి అభివృద్ధికి రూ.1,128 కోట్లు
- రోడ్లు, తాగునీరు, ప్రకృతి సాగుకూ నిధులు.. గూగుల్ డేటా సెంటర్‌కు పన్ను రాయితీ
- రాష్ట్రం మీదుగా 3 హైస్పీడ్ రైల్వే కారిడార్లు.. అరకు, పులికాట్ పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక నిధులు
- నగరపాలక సంస్థలకు బాండ్ల ద్వారా నిధులు.. పారిశ్రామిక కారిడార్లలో వర్సిటీ టౌన్‌షిప్



రాష్ట్రాభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో వరాలు.. 3సార్లు ఏపీ పేరు ప్రస్తావించిన నిర్మల

ముందుచూపు బడ్జెట్: చంద్రబాబు

- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఊతం.. ఇక దూకుడుగా రాష్ట్రాభివృద్ధి
- మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల పరిధిలోకి రాష్ట్రంలోని పలు ప్రాంతాలు
- డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్‌తో క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి వీలు: సీఎం
- ఏపీ అభివృద్ధికి ఊతమిచ్చే వికసిత బడ్జెట్ ఇది: డిప్యూటీ సీఎం పవన్
- అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేలా బడ్జెట్: మంత్రి లోకేశ్

చంద్రబాబుకు ఈడీ క్లీన్‌చిట్!



(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపునకు కారణమైన స్కిల్ కేసు కథ దాదాపు ముగిసినట్లేనని న్యాయనిపుణులు అంటున్నారు. చంద్రబాబుకు ఎలాంటి సంబంధం లేని ఈ కేసులో ఆయన్ను ఇరికించి, అక్రమంగా అరెస్టుచేసి 53 రోజులు రాజమండ్రి సెంట్రల్ జైలులో పెట్టి.. సరైన సౌకర్యాలు కల్పించకుండా నరకయాతన పెట్టిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయన అవినీతికి పాల్పడ్డారనడానికి ఎలాంటి ఆధారాలూ లేవని, కేసును మూసివేయాలని దర్యాప్తు సంస్థ సీఐడీ కోరడంతో గత నెల 12న ఏసీబీ కోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో జగన్, వైసీపీ నాయకులు ఎంతో గగ్గోలు పెట్టారు. ఇప్పుడు ఈడీ కూడా చంద్రబాబు ప్రమేయం లేదని చెప్పడంతో వారి నోళ్లు మూతబడ్డాయి.

ఏమిటీ స్కిల్ కేసు..

స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని 2014-19 నడుమ అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు రాష్ట్ర యువతలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి ఉద్దేశించినది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.3,300 కోట్లుగా అంచనా వేశారు. ఈ స్కిల్ ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని.. రాష్ట్ర ఖజానాకు రూ.300 కోట్లు నష్టం వాటిల్లిందని ఆరోపిస్తూ వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 సెప్టెంబరు 9వ తేదీ రాత్రి చంద్రబాబుని సీఐడీ అరెస్టు చేసింది. ఈ కేసులో ఆయన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో 53 రోజులు గడిపారు. 2023 అక్టోబరు 31న హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు.. ఈ కేసులో ఈడీ అంతకుముందే విచారణ మొదలుపెట్టింది. రాష్ట్రప్రభుత్వాన్ని మోసం చేసి.. సీమెన్స్ ప్రాజెక్టుకు కేటాయించిన నిధులను ఇతర ప్రయోజనాలకు మళ్లించి దుర్వినియోగం చేశారని సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తులో డీటీఎస్ పీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ వికాస్ ఖన్వేల్కర్, సీమెన్స్ ఇండస్ట్రీ సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఎండీ సౌమ్యాద్రి శేఖర్ బోస్ అలియాస్ సుమన్ బోస్, వారి అనుచరులు ముకుల్ చంద్ర అగర్వాల్, సురేశ్ గోయల్.. షెల్ కంపెనీలను సృష్టించి తప్పుడు ఇన్వాయిస్‌ల ఆధారంగా ప్రభుత్వ నిధులను మళ్లించినట్లు ఈడీ గుర్తించింది. ఇందుకు ఎంట్రీ ప్రొవైడర్ల సేవలు తీసుకుని కమీషన్లు చెల్లించినట్లు వెల్లడైంది. ఈ కేసులో వికాస్, సుమన్ బోస్, అగర్వాల్, సురేశ్ గోయల్‌ను ఈడీ 2023 మార్చి 4న అరెస్టు చేసింది. 2023 ఏప్రిల్‌లో డిజైన్‌టెక్ సిస్టమ్స్ పేరిట ఉన్న రూ.31.20 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను జప్తు చేసింది. అనంతరం విశాఖలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా.. అదే ఏడాది మే నెలలో కోర్టు దానిని పరిగణనలోకి తీసుకుంది. తదుపరి దర్యాప్తులో ఎంట్రీ ప్రొవైడర్లకు సంబంధించిన బ్యాంకు బ్యాలెన్సులు, షేర్లను.. ఢిల్లీ, ముంబై, పుణే ప్రాంతాల్లోని స్థిరాస్తులను కలిపి రూ.23.54 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. దీంతో ఈ కేసులో మొత్తం జప్తుచేసిన ఆస్తుల విలువ రూ.54.74 కోట్లకు చేరింది. గత నెల 28న దాఖలుచేసిన అనుబంధ చార్జిషీటులో డిజైన్‌టెక్ సిస్టమ్స్, వికాస్, సుమన్ బోస్, ముకుల్ చంద్ర అగర్వాల్, సురేశ్ గోయల్ తదితరులను నిందితులుగా ఈడీ పేర్కొంది. ఇందులో ఎక్కడా చంద్రబాబు ప్రస్తావన లేదు. ఆయన ప్రమేయం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలూ లేకపోవడంతో ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చూపలేమని స్పష్టం చేసింది. తదుపరి దర్యాప్తులో కొత్త అంశాలు వెలుగులోకి వస్తే తప్ప.. ఈ అనుబంధ చార్జిషీటే ఈ కేసులో చిట్టచివరిదని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి.

బాబు కడిగిన ముత్యం: మంత్రి అనగాని

సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా జగన్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా చివరకు సత్యమే గెలిచిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఆ కేసు నుంచి కడిగిన ముత్యంలా చంద్రబాబు బయటపడ్డారన్నారు.

ఈడీ క్లీన్‌చిట్ చంద్రబాబు నిజాయితీకి నిదర్శనం: అచ్చెన్న

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఎం చంద్రబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ క్లీన్‌చిట్ ఇవ్వడం ఆయన నిజాయితీకి నిదర్శనమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం అచ్చెన్న ఓ ప్రకటన చేశారు. 'సత్యం, న్యాయం మీద నిలబడే నాయకుడు సీఎం చంద్రబాబు. ఆయనకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సంబంధం లేదని ఈడీ చార్జ్‌షీట్‌లో స్పష్టం చేయడం ఆయన స్వచ్ఛమైన రాజకీయాలకు గుర్తింపు. కక్ష రాజకీయాలకు భయపడని, చట్టానికి గౌరవం ఇచ్చే ధైర్యవంతమైన నాయకత్వం చంద్రబాబుది. యువత భవిష్యత్ కోసం పెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ చంద్రబాబు దూరదృష్టికి, పాలనాదక్షతకు తార్కాణం. ఏపీ సీఐడీ, ఈడీ రెండూ చంద్రబాబు పాత్ర లేవని తేల్చడం ఆయన నిజాయితీకి నిదర్శనం. విలువలతో కూడిన రాజకీయాలు చేయవచ్చని నిరూపించిన అరుదైన నాయకుడు చంద్రబాబు. కక్ష సాధింపు రాజకీయాలు చేసినా, చివరకు గెలిచేది సత్యమే. అదే చంద్రబాబు మార్గం. వ్యక్తిగత దూషణలకు లొంగకుండా ముందుకు నడిచే నేత చంద్రబాబు. ఆయన నాయకత్వంపై ప్రజల నమ్మకాన్ని ఈడీ క్లీన్‌చిట్ మరింత బలపర్చిందని' అని మంత్రి అచ్చెన్న స్పష్టం చేశారు.



ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి నివాసం వద్ద టీడీపీ కార్యకర్తలు



జోగి నివాసంలో మంటలు

రోత మాటలపై రగిలిన అగ్గి!

బాబు, లోకేశ్‌పై జోగి దుర్భాషలు

భగ్గుమన్న టీడీపీ శ్రేణులు.. రమేశ్ ఇంటిపై రాళ్లతో దాడి

పెట్రోలు సీసాను విసిరి నిప్పు.. పగిలిన మొదటి అంతస్తు అద్దాలు

మాజీ మంత్రిపై కేసు నమోదు.. అయినా తీరు మార్చుకోని జోగి

ఈసారి సీఎంపై 'ఫేక్' అంటూ వ్యాఖ్యలు

విజయవాడ/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్.. శనివారం మంత్రి లోకేశ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. "లోకేశ్‌కు ఒళ్లు తగ్గింది కాబట్టి కొవ్వు తగ్గించుకున్నాడనుకున్నా. వాడికి చిప్ దొబ్బింది. సన్నాసి వెధవల్లారా... ఏందిరా ఇది" అంటూ దుర్భాషలాడారు. ఈ వ్యాఖ్యలపై టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో ఉన్న ఆయన ఇంటిపై ఆదివారం సాయంత్రం మూకుమ్మడిగా దాడి చేశారు. నిమిషాల వ్యవధిలో ఇబ్రహీంపట్నం, మైలవరం, జి.కొండూరు, విజయవాడ ప్రాంతాలకు చెందిన టీడీపీ శ్రేణులు సమావేశమై ఇబ్రహీంపట్నంలోని ఫెర్రీ ఘాట్ వీధిలో ఉన్న జోగి ఇంటిని చుట్టుముట్టారు. కర్రలు, రాళ్లతో దాడి చేశారు. రాళ్ల దాడిలో మొదటి అంతస్తు కారిడార్ అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంటి బయట ఉన్న 'జోగి శకుంతల నిలయం' అని రాసి ఉన్న అక్షరాలను పీకి పడేశారు. పెట్రోలు ఉన్న సీసాకు నిప్పంటించి మొదటి అంతస్తు బాల్కనీలోకి విసరడంతో మంటలు చెలరేగాయి. రెండు ఫైబర్ కుర్చీలు తగలబడ్డాయి. దిగువ ఫ్లోర్‌లో ఉన్న వైసీపీ కార్యకర్తలు, పోలీసులు మంటలను ఆర్పారు. జోగి కార్యాలయంపై దాడి జరిగిన ఘటన తెలియటంతో వైసీపీ శ్రేణులు కూడా భారీగా తరలి వచ్చారు. అప్పటికే పోలీసులు టీడీపీ శ్రేణులను చెల్లాచెదురు చేశారు. ఆ సమయంలో టీడీపీ శ్రేణులు లేకపోవటంతో ఘర్షణ తప్పింది. దాడి జరిగిన సమయంలో జోగి రమేశ్ కుటుంబ సభ్యులు ఇంట్లో లేరు. ములకలచెరువు కేసులో తంబళ్లపల్లె కోర్టులో సోమవారం వాయిదాకు హాజరయ్యేందుకు జోగి అక్కడికి వెళ్లారు. ఆయన సతీమణి శకుంతల, కుమారుడు రాజీవ్ బయటకు వెళ్లారు. దాడి జరిగాక తల్లి, కుమారుడు ఇంటికి చేరుకున్నారు. ఘటన గురించి సమాచారం తెలియగానే పోలీసులు జోగి రమేశ్ ఇంటికి చేరుకున్నారు. ఆందోళనకారులను అక్కడి నుంచి చెదరగొట్టారు. ఘటనాస్థలాన్ని డీసీపీ కేజీవీ సరిత, ఏడీసీపీ రామకృష్ణ పరిశీలించారు. జోగి కుటుంబ సభ్యులను వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు తదితరులు పరామర్శించారు. ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు తదితరులు జోగి రమేశ్ ఇంటికి వెళ్తుండగా పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద పోలీసులు వారిని అడ్డుకుని భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జోగి రమేశ్‌పై కేసు నమోదు

మాజీ మంత్రి జోగి రమేశ్‌పై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే ఇంత రాద్ధాంతం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. దీనిపై సుమోటో కేసు నమోదు చేశారు. అదే సమయంలో రమేశ్‌పై ఇంటి దాడి చేసిన ఆందోళనకారులపైనా కేసులు నమోదు చేయనున్నట్లు తెలిసింది. ఈ దాడుల్లో పాల్గొన్న వారిని గుర్తించేందుకు ఇబ్రహీంపట్నం రింగ్ నుంచి ఫెర్రీ వరకు ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

పదేపదే అదే తీరు...

నకిలీ మద్యం తయారీ కేసులో జోగి రమేశ్, ఆయన సోదరుడు రాము గత నెల 23న విజయవాడ జిల్లా జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ సమయంలో జైలు ముందే రమేశ్ మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై నోరుపారేసుకున్నారు. శనివారం టీటీడీకి సరఫరా అయిన నెయ్యిలో కల్తీ లేదంటూ.. వైసీపీ ఇచ్చిన నిరసన పిలుపులో భాగంగా ఇబ్రహీంపట్నంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం బయటకు వచ్చి మళ్లీ లోకేశ్‌ను తిట్టిపోశారు. తాను జైలు విడుదలైన తర్వాత పరామర్శించేందుకు ఇబ్రహీంపట్నం వచ్చిన నేతలందరితోనూ... చంద్రబాబు, లోకేశ్‌తోపాటు కూటమి ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేయించారు. కొన్ని రోజులుగా జోగి తీరును పరిశీలిస్తున్న తెలుగు తమ్ముళ్లు ఆగ్రహంతో ఊగిపోతున్నారు.



మాజీ మంత్రి జోగి నివాసం వద్ద ఫ్లెక్సీలను తొలగిస్తున్న కార్యకర్తలను అదుపు చేస్తున్న పోలీసులు

లోకేశ్‌ను పిచ్చికుక్కను కొట్టినట్టు కొట్టిస్తా

మళ్లీ నోరు పారేసుకున్న జోగి

తిరుపతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "చంద్రబాబు ఫేక్ ముఖ్యమంత్రి. చేతగాని ముఖ్యమంత్రి ఎందుకు?. రాజీనామా చేసి దొబ్బేయచ్చు కదా?. పాలన చేతకాకుంటే నోరుమూసుకుని కూర్చోవాలి" అంటూ మాజీ మంత్రి జోగి రమేశ్ నోరు పారేసుకున్నారు. ఆదివారం సాయంత్రం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసంలో మీడియాతో మాట్లాడారు. తన నివాసంపై దాడి పట్ల ఆగ్రహంతో ఊగిపోయారు. మంత్రి లోకేశ్ పిచ్చిపిచ్చి చేష్టలు మానుకోకుంటే పిచ్చికుక్కను కొట్టినట్టు కొట్టిస్తా.. అంటూ చెలరేగిపోయారు. చంద్రబాబు, లోకేశ్‌ల రాక్షసానందం కోసమే ఇబ్రహీంపట్నంలోని తన నివాసంపై దాడి చేయించారంటూ ఆరోపించారు. "ఫేక్ కేసులో నన్ను, నా తమ్ముడిని, నా కుమారుడిని అన్యాయంగా ఇరికించి జైల్లో పెట్టి రాక్షసానందం పొందారు. అది చాలక పెట్రోలు బాంబులు వేసి నాకుటుంబాన్ని హతమార్చాలని చూస్తారా?." అని ప్రశ్నించారు. అంతేకాదు, "లోకేశ్‌కు చెబుతున్నా.. నా ఇంటికి నీ ఇల్లు ఎంత దూరమో.. నీ ఇంటికి నా ఇల్లు కూడా అంతే దూరం. ఇవాళ సంబరపడుతున్నావేమో. మీరు చేసిన దుర్మార్గానికి భయపడతానని అనుకుంటున్నారేమో.. చూస్తా." అంటూ హెచ్చరించారు. చంద్రబాబు రాజకీయ జీవితమే ఫేక్ అని పదే పదే అనుచిత వ్యాఖ్యలు చేశారు.



ఉషశ్రీ ఫ్లెక్సీ వద్ద రప్పా.. రప్పా.. నరుకుతామంటూ కర్ర పట్టుకుని బెదిరిస్తున్న వైసీపీ కార్యకర్త సురేశ్

'ఉషక్క' రప్పా.. రప్పా.. నరకమంది!

» వైసీపీ కార్యకర్త పోస్ట్

హిందూపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'మనకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా రప్పా.. రప్పా.. నరికేయమని ఉషక్క చెప్పిందం'టూ శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం కోనాపురం గ్రామంలో వైసీపీ కార్యకర్త సురేశ్ కర్ర పట్టుకున్నట్లు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ ఆదివారం కోనాపురానికి వెళ్లారు. ఆమె కార్యక్రమం ముగించుకుని వెళ్లాక అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త సురేశ్.. ఉషశ్రీ ఫ్లెక్సీ వద్ద నిలబడి, కర్ర పట్టుకుని బెదిరించాడు. 'కోనాపురం గ్రామ ప్రజలకు నమస్కారం. నేను వైసీపీ కార్యకర్త సురేశ్‌ను. నాకు ఓటరు ఐడీ కార్డు కూడా ఉంది. ఉషక్క ఈరోజు ఊరికి వచ్చింది. మనకు ఆపోజిట్‌గా ఎవరు మాట్లాడినా రప్పా.. రప్పా.. నరికేయండని అక్క చెప్పింది. ఎవడొచ్చినా రప్పా.. రప్పా.. నరకడం పక్కా..' అని రికార్డు చేసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

ప్రజల దృష్టి మరల్చే కుట్రలు: ఆనం

నెల్లూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో వైసీపీ పాలకులు చేసిన పాపాలపై ప్రజల్లో చర్చ జరగకుండా ఆ పార్టీ నేతలు కుట్రలు చేస్తున్నారు' అని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. వైసీపీ నేతలకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ మంత్రి ఆనం, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేశ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆదివారం నెల్లూరులోని రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి ఆనం విలేకరులతో మాట్లాడారు. తిరుమల లడ్డూల్లో కలిపింది అసలు నెయ్యే కాదని సిట్ తేల్చినా, వైసీపీ నేతలు ఇంకా అబద్ధాలతో జనాన్ని ఏమార్చాలని చూస్తున్నారని ఆనం అన్నారు.

జైలుకు అంబటి



గుంటూరు ప్రభుత్వాస్పత్రికి వైద్య పరీక్షల కోసం అంబటిని తరలిస్తున్న పోలీసులు

సీఎంపై బూతులు మాట్లాడిన కేసులో

14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బూతుల రాంబాబును జైలుకు తరలించారు. ముఖ్యమంత్రిపై అత్యంత అసభ్యకరంగా నోరు పారేసుకుని, ఇదేంటి అని ప్రశ్నించిన తెలుగు మహిళలపై రెచ్చిపోయిన వ్యవహారంలో అరెస్టు అయిన అంబటి రాంబాబుకు గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ స్రవంతి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం ఆయనను ఎస్కార్ట్ పోలీసుల రక్షణలో రాజమండ్రి జైలుకు తరలించారు. అంతకుముందు గుంటూరులోని నల్లపాడు పోలీసు స్టేషన్‌లో అంబటి 21 గంటలపాటు లాకప్‌లో ఉన్నారు. తెలుగు తమ్ముళ్ల ఆగ్రహావేశాల నుంచి అంబటిని అతికష్టం మీద కాపాడి శనివారం రాత్రి 10.40గంటల సమయంలో అరెస్టుచేసి, స్టేషన్‌కు పోలీసులు తెచ్చారు. తెలుగు తమ్ముళ్ల ప్రతిఘటనతో బిత్తరపోయిన అంబటి వాహనం ఆగగానే పోలీస్‌స్టేషన్‌లోకి పరుగుతీశారు. ఆయన చేతికి ఉన్న ఉంగరాలు, ఒంటిపై ఉన్న బెల్టును పోలీసులు తీయించారు. తనపై నమోదైన కేసులో ఏ ఏ సెక్షన్లు పెట్టారో ఆయన ఆరా తీశారు. అనంతరం అంబటిని లాకప్‌లో ఉంచారు. లాకప్‌లో నేలపై ఆయన నిద్రించారు. రాత్రి 11:30 గంటలకు పోలీసులు తెప్పించిన ఇడ్లీ, దోశ తీసుకున్నారు. అర్ధరాత్రి 2:30కు టాబ్లెట్లు వేసుకున్నారు. ఆదివారం ఉదయం పోలీసులు తెప్పించిన టిఫిన్ అంబటి నిరాకరించారు. మధ్యాహ్నం 12 గంటలకు మూడు ఇడ్లీలు తీసుకున్న ఆయన, 3గంటల సమయంలో పెరుగన్నం తిన్నారు. అంబటిని లాకప్‌లో న్యాయవాది పోలు వెంకటరెడ్డి, వైసీపీ లీగల్ సెల్ నాయకురాలు రోళ్ల మాధవి కలిశారు. బెయిల్ పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. తనను పోలీస్ స్టేషన్‌లో శారీరక వేధింపులకు గురిచేశారని మేజిస్ట్రేట్‌కు అంబటి ఫిర్యాదు చేశారు. ఇద్దరు సీఐలు తనను పంగ చీల్చి ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. అంబటి స్టేట్‌మెంట్‌ను మేజిస్ట్రేట్ రికార్డు చేశారు. జీజీహెచ్‌లో వైద్య పరీక్షల సమయంలో ఆయన వేధింపుల విషయం చెప్పలేదు. అంబటిపై 20 కేసులు ఉన్నాయని, చట్టంపై సంపూర్ణ అవగాహన ఉన్న ఆయన తరచూ వివాదాస్పద తీరుతో నేరాలకు పాల్పడుతున్నారని, పోలీసులపై ఏడుసార్లు దౌర్జన్యం చేశారని ప్రాసిక్యూషన్ న్యాయవాదులు వాదించారు.

విజయనగరంలో అంబటిపై మరో ఫిర్యాదు

విజయనగరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును ఉద్దేశించి తీవ్ర అసభ్య వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు.

అరాచకమే వైసీపీ కల్చర్!


» అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా అంతే

» రాష్ట్రంలో తాజా పరిణామాలపై చంద్రబాబు ట్వీట్

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పునర్నిర్మాణాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్ తీరు, తాజా ఉద్రిక్తతలపై ఆదివారం రాత్రి ఆయన 'ఎక్స్'లో స్పందించారు. "అరాచక పాలనకు నిలువెత్తు నిదర్శనంగా గత వైసీపీ పాలన నిలిచిపోతుంది. నేరపూరిత రాజకీయాలే వైసీపీ ప్రధాన సంస్కృతి. ప్రజా సేవ, ప్రజల సాధికారతే మా సంస్కృతి. అధికారంలో ఉన్నప్పుడే కాకుండా ప్రతిపక్షంలో ఉన్నా వైసీపీ తన వికృతపోకడలను వీడటం లేదు. అధికారంలో ఉన్నప్పుడు వారు చేసిన అరాచకాలు బయటపడుతుండటంతో నిరాశ నిస్పృహతో వారు బూతులతో తెగబడుతున్నారు. వారు నాశనం చేసిన వ్యవస్థలను పునర్నిర్మిస్తుండటాన్ని సహించలేకపోతున్నారు. ప్రజాస్వామ్యంలో చట్టమే అత్యున్నతం. ప్రతి ఒక్కరూ దానికి బద్ధులమై ఉండాలి. చట్టాన్ని ఎవరు ఉల్లంఘించాలని చూసినా అనుమతించే ప్రసక్తే లేదు" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

నేతలు ఆ భాష మాట్లాడకూడదు హుందాగా ఉండాలి

» అంబటి సతీమణి పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు



అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "ప్రజాజీవితంలో ఉండే రాజకీయ నాయకులు అలాంటి భాష మాట్లాడకూడదు. వారు వాడే భాష ఎవరినీ నొప్పించకుండా, వివాదాలకు తావులేకుండా హుందాగా ఉండాలి" అని హైకోర్టు వ్యాఖ్యానించింది. శాంతి భద్రతలు కాపాడడం ఒక్కటే పోలీసుల విధి కాదని, సమాజంలో శాంతి,సామరస్యాలను పరిరక్షించాల్సిన బాధ్యత కూడా వారిపై ఉందని పేర్కొంది. తమ ఇంటికి భద్రత కల్పించాలంటూ వైసీపీ నేత అంబటి రాంబాబు సతీమణి దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. రాంబాబు సతీమణి వేసిన పిటిషన్‌ను కోర్టు హౌస్ మోషన్‌గా విచారణకు స్వీకరించింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)ఎస్.ప్రణతి, హోంశాఖ ప్రభుత్వ న్యాయవాది జయంతి, సహాయ ప్రభుత్వ న్యాయవాది అజయ్ వాదనలు వినిపించారు. "ప్రస్తుతం అంబటి రాంబాబు నివాసం వద్ద పరిస్థితి అదుపులో ఉంది. గుంపులుగా ఎవరూ రావడం లేదు. వైసీపీ నేతలు రాంబాబు కుటుంబసభ్యులను పరామర్శించి వస్తున్నారు. సీఎం చంద్రబాబును ఉద్దేశించి జనవరి 31న రాంబాబు అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, రెచ్చగొట్టేలా మాట్లాడడం వల్లే పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆయనను అరెస్టు చేసిన తరువాత పరిస్థితి అదుపులోకి వచ్చింది" అని వివరించారు. న్యాయస్థానం జోక్యం చేసుకుంటూ.... ప్రజా జీవితంలో ఉండేవారు హుందాగా వ్యవహరించాల్సి అవసరం ఉందని తెలిపింది. రాత్రి వేళ మళ్లీ దాడులు జరగవచ్చని పిటిషనర్ ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, నివాసం వద్ద కొందరు పోలీసులను మోహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. "ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం అక్కడ పోలీసులు ఎవరైనా ఉన్నారా? గుంటూరు ఎస్పీ నుంచి వివరాలు తెప్పించుకొని కోర్టు ముందు ఉంచండి" అంటూ ఆదేశించింది. కొద్దిసేపటి అనంతరం విచారణ తిరిగి ప్రారంభమైన వెంటనే...ప్రభుత్వ న్యాయవాది బదులిస్తూ, 15మంది పోలీసులతో పిటిషనర్ నివాసం వద్ద పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం అక్కడ గుంపులుగా ఎవరూ లేరని తెలిపారు. పిటిషన్‌పై విచారణను మూసివేయాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వై. లక్ష్మణరావు వ్యాజ్యాన్ని పరిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. భద్రత కల్పించే విషయంలో ఎస్పీకి తగిన సూచనలు చేయాలంటూ ప్రభుత్వ న్యాయవాదికి మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. సీఎం చంద్రబాబును ఉద్దేశించి అంబటి రాంబాబు తీవ్ర అసభ్య పదజాలంతో దూషించిన నేపథ్యంలో, గుంటూరులోని అంబటి నివాసం, కార్యాలయంపై పలువురు దాడికి పాల్పడ్డారు. తమ ఇంటి వద్ద భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ రాంబాబు సతీమణి విజయలక్ష్మి ఆదివారం అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. విజయలక్ష్మి తరఫు న్యాయవాది రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపించారు. "అంబటి రాంబాబు నివాసంపై దాడులకు పాల్పడినవారిపై పోలీసులు ఎలాంటి కేసులు నమోదు చేయలేదు. ప్రతి గంటకూ గుంపులుగా జనం వస్తున్నారు. ఇంటి వద్ద పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించండి" అని ఆయన వాదించారు.

మీ జంగిల్ రాజ్ భూస్థాపితం కాకతప్పదు



» అంబటి, జోగి ఇళ్లకు నిప్పు పెట్టి భయాన్ని కలిగించానని అనుకోవడం మీ భ్రమే

» ఆ వేడి మీ సర్కారును దహించక మానదు

» సీఎం చంద్రబాబుకు జగన్ శాపనార్థాలు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "ప్రజాస్వామ్యంలో హింసాజ్వాలలను రేపే చేయి కాలక తప్పదు. అరాచక, ఆటవిక పాలన అంతం కాకతప్పదు. మీరు సృష్టించిన 'జంగిల్ రాజ్' భూస్థాపితం కాకతప్పదు. చరిత్ర చెప్పే సత్యం ఇది' అని సీఎం చంద్రబాబును ఉద్దేశించి వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ జగన్ శాపనార్థాలు పెట్టారు. మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై టీడీపీ శ్రేణుల దాడి, ఇంటిని దహనం చేసిన నేపథ్యంలో జగన్ ఆదివారం ఆయన్ను ఫోన్‌లో పరామర్శించారు. అనంతరం సీఎంను ఉద్దేశించి ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'ప్రజాస్వామ్యంలో మీరు చేసిన తప్పుడు ఆరోపణలు తప్పని ఏకంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన ల్యాబ్‌లు ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ నిర్ధారణ చేసిన తర్వాత, ఆ తప్పులకు మిమ్మల్ని ప్రశ్నిస్తే జీర్ణించుకోలేక అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లకు నిప్పు పెట్టడం, ఆ దుశ్చర్యలతో భయాన్ని కలిగించానని అనుకోవడం మీ భ్రమే. ఆ నిప్పు మీ ప్రభుత్వానికి మీరు పెట్టుకున్నారని గుర్తుంచుకోవాలి.' అని ఆ పోస్టులో జగన్ హెచ్చరించారు. కాగా, వైసీపీ సీనియర్ నేతలపై వరుసగా దాడులు జరుగుతున్న నేపథ్యంలో గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని మరో పోస్టులో జగన్ కోరారు. 'సీఎం చంద్రబాబు ఆదేశాలతోనే మా పార్టీ నాయకుడు అంబటి రాంబాబు ఇంటిపైకి తెలుగుదేశం పార్టీ గూండాలు వెళ్లారు. రాంబాబుపై టీడీపీ కార్యకర్తలు గూండాల్లా హత్యాయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మీ దుర్మార్గాలను ప్రశ్నిస్తే దాడులు, హత్యాయత్నం చేస్తారా? మా పార్టీ సీనియర్ నాయకులపై వరుసగా దాడులు జరుగుతున్న నేపథ్యంలో గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతున్నా. డీజీపీ, గుంటూరు డీఐజీ, ఎస్పీతో సహా బాధ్యత వహించాల్సిన అధికారులు అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా' అని జగన్ పేర్కొన్నారు.

మేం గెలిచాక ఎవర్నీ వదలం!

» అధికారులందరిపై ప్రైవేటు కేసులు వేస్తాం: సజ్జల బెదిరింపు

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "ఇవన్నీ గుర్తుపెట్టుకుంటాం. మేం అధికారంలోకి వచ్చాక ఎవర్నీ వదలి పెట్టం. ఎక్కడున్నా తీసుకొస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం" అంటూ ప్రభుత్వ మాజీ సలహాదారు, వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి బెదిరింపులకు దిగారు. గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసంపై దాడి జరిగిన నేపథ్యంలో ఆదివారం అంబటి నివాసాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సజ్జల మీడియాతో మాట్లాడారు. టీడీపీ నాయకులు పథకం ప్రకారమే అంబటిపై హత్యాయత్నానికి తెగబడ్డారని ఆరోపించారు. టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి దగ్గరుండి దాడులు చేయిస్తున్నా పోలీసులు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. డీజీపీకి, ఐజీకి తమ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. ఎన్‌హెచ్ఆర్సీ, కేంద్ర హోంమంత్రి, గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పక్షపాతంగా వ్యవహరించిన అధికారులందరిపైనా ప్రైవేటు కేసులు వేస్తామని సజ్జల హెచ్చరించారు.

అంబటి నోరు జారారు... వాస్తవమే

» క్షమాపణలు చెప్పి, తప్పు ఒప్పుకొన్నారు: వైసీపీ ఎంపీ పిల్లి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి అంబటి రాంబాబు నోరు జారిన మాట వాస్తవమే' అని వైసీపీ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోశ్ స్పష్టతనిచ్చారు. 'నోరు జారారు కాబట్టే అంబటి క్షమాపణలు చెప్పారు. తప్పు చేశానని విచారం వ్యక్తం చేశారు. టీడీపీ శ్రేణులు ప్రణాళిక ప్రకారమే అంబటిపై దాడి చేశాయి. బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగింది' అని అన్నారు. మరో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏపీలో పరిస్థితులపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వివరిస్తామన్నారు.

అంబటి వంటి వారిని బహిష్కరించాలి

▸ చంద్రబాబుపై వ్యాఖ్యలను ఖండించిన గల్ఫ్ టీడీపీ విభాగం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సీఎం చంద్రబాబుపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ గల్ఫ్ విభాగం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు అధ్యక్షుడు రావి రాధాకృష్ణ, సౌదీ అరేబియాలోని పార్టీ నేతలు జానీ బాషా, చెన్నుపాటి రాజశేఖర్ ప్రకటనలు విడుదల చేశారు. 'విమర్శలు ఎప్పటికీ విధానాలపై ఉండాలి కానీ వ్యక్తిగతంగా ఉండకూడదు. బూతు పురాణాలను నమ్ముకున్న నాయకులకు చట్టబద్ధంగా తగిన శాస్తి జరగాలి' అని పేర్కొన్నారు. ఒమన్‌లోని పార్టీ నేత గారపాటి సత్యశ్రీధర్ ఓ ప్రకటనలో... అంబటిపై చట్టపరమైన చర్యలను సమర్థించారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత దూషణలకు స్థానం లేదన్నారు. ఖతర్ టీడీపీ నేత మద్దిపోటి నరేశ్ మాట్లాడుతూ, 'వైసీపీ నాయకులు ఇంకా ఆటవిక రాజ్యాన్ని నమ్ముకొని అదే భ్రమల్లో విహరిస్తున్నారు. రాంబాబుపై కఠిన చర్యలు తీసుకొని, రాజకీయాల్లో ఉన్నత విలువలు నెలకొల్పడానికి ఉపక్రమించాలి' అని విజ్ఞప్తి చేశారు. కువైత్‌లోని పార్టీ నేత కుదురవల్లి సుధాకర్ రావు... 'బూతులు మాట్లాడడం వైసీపీ డీఎన్ఏలోనే ఉంది. ఆ పార్టీ నీచ సంస్కృతి, విధానాలను ప్రజలు తిరస్కరించి ఇంటికి పంపించినా జగన్ బృందం గుణపాఠం నేర్చుకోలేదు' అని మండిపడ్డారు. దుబాయిలోని పార్టీ నాయకుడు డాక్టర్ ముక్కు తులసి కుమార్... సభ్యత, సంస్కారం కలిగిన ప్రతి ఒక్కరు అంబటి లాంటి ఆంబోతులను సమాజం నుంచి బహిష్కరించాలి అని పిలుపునిచ్చారు. బహ్రెయిన్‌లోని పార్టీ విభాగమూ తీవ్రంగా ఖండించింది.

వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలపై దాడి

▸ బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే: టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై తెలుగుదేశం ఎంపీలు భగ్గుమన్నారు. అంబటి వ్యాఖ్యలు రాజకీయ విమర్శలు కాదని, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడి అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విద్వేష రాజకీయాలను ఆంధ్ర ప్రజలు సహించరని పేర్కొన్నారు. ఆదివారం ఏపీ భవన్‌లో ఎంపీలు మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ ఎంపీ సానా సతీశ్ మాట్లాడుతూ... 'తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయింది. ఆ పాపం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే వైసీపీ నేతలు ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారు. గతంలో వైఎస్ జగన్ భార్యపై టీడీపీ కార్యకర్త ఒకరు అనుచిత వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నారు. అదీ మా సంస్కారం' అని అన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, 'వైసీపీ నేతలు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, అలజడి సృష్టించాలని చూస్తున్నారు. గతంలో చంద్రబాబు కుటుంబ సభ్యులను కూడా ఇలాగే అసభ్యంగా దూషించారు. అంబటి వ్యాఖ్యలు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉన్నాయి. ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. 'అంబటి రాంబాబు ఒక సీనియర్ నాయకుడిగా, లాయర్‌గా పూర్తిగా విఫలమయ్యారు. కేవలం అరిస్తేనో, బూతులు తిడితేనో నాయకులు అయిపోరు. ఆయన ప్రవర్తన చూసి సమాజం అసహ్యించుకుంటోంది' అని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు.

అనుచిత వ్యాఖ్యలను సభ్యసమాజం సహించదు: మంత్రి గొట్టిపాటి

పంగులూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను సభ్యసమాజం ఏమాత్రం సహించదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా పంగులూరు మండలంలోని ముప్పవరం క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'పవిత్ర తిరుమల క్షేత్రాన్ని, స్వామివారి ప్రసాదాన్ని అపవిత్రం చేశారు. రసాయినాలతో కూడిన కల్తీ నెయ్యిని లడ్డూ ప్రసాదాలలో వాడారు. ఆ విషయాన్ని అధికార యంత్రాంగం విచారణలో నిగ్గుతేల్చినా వైసీపీ నేతలు అడ్డగోలుగా బుకాయించడం విడ్డూరంగా ఉంది. చంద్రబాబుపై అంబటి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆపార్టీ నేతలు సమర్థిస్తారా? వైసీపీ నేతలు ఇదే పంథాలో వ్యవహరిస్తే ఆపార్టీకి ప్రజాక్షేత్రంలో మనుగడ లేకుండా పోతుంది' అని మంత్రి హెచ్చరించారు.

నోరు అదుపులో పెట్టుకోకపోతే జగన్ ఇంటినీ ముట్టడిస్తాం

▸ తప్పులను సమర్థించడమే నేటి దుస్థితికి కారణం: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు, యువ నేత లోకేశ్ గురించి మాట్లాడేటపుడు నోరు అదుపులో పెట్టుకోవాలి. అవాకులు, చవాకులు పేలితే జగన్‌రెడ్డి ఇంటినీ ముట్టడిస్తాం. సీఎం చంద్రబాబు గురించి తప్పుడు మాటలు మాట్లాడిన అంబటి రాంబాబుకు టీడీపీ శ్రేణులు ఏ విధంగా బుద్ధి చెప్పాయో ఇప్పటికైనా గ్రహించాలి. తీరు మార్చుకోకపోతే జగన్‌రెడ్డికీ ఇదే గతి పడుతుంది' అని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హెచ్చరించారు. అనంతపురంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబును, అంబటి రాంబాబు నీచంగా మాట్లాడితే సమర్థించడం ఏ మేరకు సమంజసమో జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు చెప్పాలి. తప్పు చేసింది అంబటి అయితే కాపు కులానికి ఏం సంబంధమో ఆ పార్టీ మాజీ మంత్రి అమర్‌నాథ్ చెప్పాలి. కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నది ఎవరో ప్రజలు గమనిస్తున్నారు. తప్పుచేసిన అంబటిని వైసీపీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదు?' అని ఎమ్మెల్యే రాజు ప్రశ్నించారు.

వైసీపీ గుర్తింపును రద్దు చేయాలి: కన్నా

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'రప్పా రప్పా నరుకుతాం అంటూ బూతులు తిట్టే వైసీపీ వంటి రాజకీయ పార్టీల గుర్తింపును ఎన్నికల కమిషన్ రద్దు చేయాలి' అని మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గుంటూరులో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు దిగజారుడు భాష మాట్లాడటం దారుణం. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని పక్కదోవ పట్టించేందుకే వైసీపీ ఇలా ప్రవర్తిస్తోంది. వంగవీటి రంగాతో అంబటిని పోల్చటం సిగ్గుచేటు. రంగా ప్రజా నాయకుడు. అంబటి చిల్లర నాయకుడు. అంబటి బూతు మాటలకు కాపు కులానికి సంబంధం ఏమిటి?' అని కన్నా ప్రశ్నించారు.

నోరు అదుపులో పెట్టుకోకుంటే చెప్పుతో సమాధానం : ఎమ్మెల్యే మురళీమోహన్



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబుపై అవాకులు చవాకులు పేలిన వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి. లేదంటే చెప్పుతో సమాధానం చెబుతాం' అని చెప్పు చూపిస్తూ చిత్తూరు జిల్లా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ హెచ్చరించారు. కాణిపాకం ఆర్చి వద్ద ఆదివారం అంబటి దిష్టిబొమ్మను దహనం చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ విషయాన్ని ప్రజలు మరిచి పోవాలని ఇలాంటి మాటలను అంబటి మాట్లాడారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారు. వైసీపీ వాళ్లు ఎన్ని ప్రయత్నాలు చేసిన లడ్డూ కల్తీ విషయాన్ని పక్కదోవ పట్టించలేరు' అని మురళీ మోహన్ అన్నారు.

అనంతలో అంబటి దిష్టి బొమ్మ దహనం

▸ శవయాత్ర చేసిన టీడీపీ నేతలు.. దివ్యాంగుల ర్యాలీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత అంబటి రాంబాబు దిష్టి బొమ్మకు టీడీపీ నాయకులు అనంతపురంలో ఆదివారం అంతిమయాత్ర నిర్వహించారు. క్లాక్ టవర్ నుంచీ సప్తగిరి సర్కిల్ వరకూ అంబటి దిష్టిబొమ్మను మోస్తూ శవయాత్ర చేశారు. తర్వాత సప్తగిరి సర్కిల్‌లో ఆయన దిష్టిబొమ్మను పెట్రోల్ పోసి, నిప్పు పెట్టి దహనం చేశారు. టీడీపీ నగరాధ్యక్షుడు సుధాకరయాదవ్, రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి మాట్లాడుతూ.. అంబటి వంటి ఆంబోతును ఇలాగే సమాజంలోకి వదిలితే ప్రమాదం అన్నారు. దివ్యాంగులు, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ గుడిపూటి నారాయణస్వామి ఆధ్వర్యంలో దివ్యాంగులు.. అంబటి దిష్టిబొమ్మను ఈడ్చుకుంటూ ర్యాలీగా వెళ్లి క్లాక్‌టవర్ వద్ద దహనం చేశారు.



అనంతపురంలో అంబటి దిష్టిబొమ్మను ఈడ్చుకుంటూ ర్యాలీ చేస్తున్న వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ గుడిపూటి నారాయణస్వామి, దివ్యాంగులు



అనంతపురంలో బళ్లారి బైపాస్ సర్కిల్‌లోని ఎంజీ పెట్రోల్ బంకు వద్ద హెల్మెట్‌తో వచ్చిన ద్విచక్రవాహనదారుడికి శాలువా కప్పి సన్మానిస్తున్న పోలీసులు

ఒక్కసారి హెల్మెట్ ఇస్తారా.. పెట్రోల్ పోయించుకుని ఇచ్చేస్తా..!

▸ అనంతలో 'నో హెల్మెట్.. నో పెట్రోల్'కు స్పందన అంతంతే

▸ బంకుల వద్ద మార్చుకుంటున్న వైనం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'నో హెల్మెట్.. నో పెట్రోల్..' అంటూ అనంతపురం పోలీసు శాఖ తీసుకొచ్చిన కార్యక్రమం ఆదివారం నుంచే అమలులోకి వచ్చింది. అయితే తొలిరోజు ఇది అంతంత మాత్రంగానే అమలైంది. అనంతపురంలో 15 శాతం మంది మాత్రమే హెల్మెట్ ధరించి వచ్చి పెట్రోల్ పోయించుకున్నారు. హెల్మెట్ లేకపోతే వెనక్కు పంపిస్తుండడంతో.. కొందరు హెల్మెట్ ఉన్నవారి వద్దకు వెళ్లి.. 'మీ హెల్మెట్ రెండు నిమిషాలు ఇవ్వండి.. పెట్రోల్ పోయించుకుని తిరిగిచ్చేస్తా..' అంటూ బతిమాలుకున్నారు. అనంతపురంలోని కోర్టు రోడ్డులో పోలీసు శాఖ బంకు సిబ్బంది 'నో హెల్మెట్...నో పెట్రోల్' కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయడంతో చాలామంది నిరాశగా వెనుదిరిగారు. నగరంలోని బళ్లారి బైపాస్ సర్కిల్‌లో ఉన్న ఎంజీ పెట్రోల్ బంకుకు హెల్మెట్‌తో వచ్చిన వారిని పోలీసులు సత్కరించారు. అయితే.. జిల్లాలో చాలా చోట్ల పెట్రోల్ బంకుల్లో 'నో హెల్మెట్... నో పెట్రోల్' కార్యక్రమాన్ని పట్టించుకోలేదు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఎస్పీ జగదీష్ ప్రకటించినప్పటికీ..చాలా మండలాల్లో ఎస్ఐలు, సీఐలు కూడా పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సింఘాల్‌పై బదిలీ వేటు


కల్తీ నెయ్యి వ్యవహారంలో చర్యలు

▸ ముద్దాడ రవిచంద్రకు అదనపు బాధ్యతలు

అమరావతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌పై బదిలీ వేటు పడింది. ఆయన స్థానంలో సీఎం కార్యాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా రెండోసారి ఈవో పదవి దక్కించుకున్న సింఘాల్‌ను పాత పాపం వెంటాడింది. ఆరేళ్ల క్రితం అంటే.. 2020 ఫిబ్రవరిలో తీసుకున్న ఒక తప్పుడు నిర్ణయం ఇప్పుడు ఆయనను స్వామి వారి సేవకు దూరం చేసింది. రాజకీయ నాయకులు తప్పులు చేస్తుంటే దాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ఐఏఎస్ అధికారులపై ఉంటుంది. తప్పును తప్పు అని చెప్పకపోవడం కూడా తప్పే. సింఘాల్ విషయంలో అదే జరిగింది. అప్పటి టీటీడీ పాలక మండలి నెయ్యి సేకరణ పాలసీని అడ్డగోలుగా మార్చినప్పుడు 'ఇది తప్పు' అని చెప్పడానికి ఆయన సాహసించలేదు. అదే విషయాన్ని సీబీఐ సిట్ ప్రభుత్వానికి నివేదించింది. సింఘాల్ అసమర్థతను స్పష్టంగా ఎత్తి చూపడంతో ప్రభుత్వం ఆయనపై బదిలీ వేటు వేసింది. 2020 ఫిబ్రవరి 29వ తేదీన తీర్మానం 371 ద్వారా నెయ్యి సేకరణ నిబంధనలను పూర్తిగా మార్చేసి, టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కావడానికి బీజం వేశారు. ఈ వ్యవహారంలో అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పాత్ర గురించి కూటమి పక్షం ఎత్తి చూపుతూ వస్తోంది. చైర్మన్‌తో పాటు ఈ తీర్మానం ఆమోదం పొందడానికి కారణమైన ఈవోకు కూడా సమాన బాధ్యత ఉంటుంది. ప్రభుత్వం అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాత సింఘాల్‌పై బదిలీ వేటు వేసింది.

నాలుగు నెలలకే...

వాస్తవానికి టీటీడీ చరిత్రలో ఎవరికి దక్కని గౌరవం సింఘాల్‌కు దక్కింది. ఈవో పోస్టులో పని చేసేందుకు చాలా మంది సీనియర్ ఐఏఎస్ అధికారులు ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ కొంత మందికే అవకాశం దక్కుతుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన సింఘాల్ గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టీటీడీ ఈవోగా నియమితులయ్యారు. ఏపీలో ఉన్న ఐఏఎస్‌లను కాదని కేంద్ర సర్వీస్‌లో ఉన్న సింఘాల్‌ను ప్రత్యేకంగా పిలిపించి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ కూడా ఆయనను ఈవోగా కొనసాగించారు. 2020 మార్చి వరకూ ఆయన ఈవోగా కొనసాగారు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లిన ఆయనను ప్రభుత్వం వెనక్కి పిలిచి మరీ రెండోసారి ఈవోగా నియమించింది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆయనకు కర్తవ్యబోధ చేస్తూనే వచ్చింది. కానీ ఇప్పుడు కూడా రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగిపోయారు. టీటీడీ నిబంధనలు అనుకూలించకపోయినా యనమల రామకృష్ణుడికి చెందిన గుడిని టీటీడీ పరిధిలోకి తీసుకోవడం, జంగా కృష్ణమూర్తికి కొండ మీద స్థలం కేటాయించడంతో పాటు అలిపిరి దగ్గర టౌన్‌షిప్ వ్యవహారంలోనూ పాలక మండలి ఏది చెబితే దానికి తలూపారు. ఇంతలో పాత కేసు మళ్లీ తెరపైకి రావడంతో సింఘాల్ మెడకు చుట్టుకుంది. తొలిసారి టీటీడీ ఈవోగా ఐదు సంవత్సరాలా నాలుగు నెలల పాటు పని చేసి రికార్డు సృష్టించి ఆయన రెండోసారి మాత్రం కేవలం నాలుగు నెలలకే టీటీడీ నుంచి బయటకు రావాల్సి వచ్చింది.



అనిల్‌కుమార్ సింఘాల్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

ఇన్‌చార్జి ఈవోగా వెంకయ్య బాధ్యతలు

▸ అనిల్‌కుమార్ సింఘాల్‌కు వీడ్కోలు

తిరుమల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఇన్‌చార్జి ఈవోగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం సాయంత్రం ఆలయంలో వెంకయ్య చౌదరికి అనిల్‌కుమార్ సింఘాల్ బాధ్యతలు అప్పగించారు. అనంతరం శ్రీవారిని దర్శించుకుని రంగనాయక మండపానికి సింఘాల్ చేరుకోగా వేద పండితులు ఆశీర్వచనం చేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది, అర్చకులు అనిల్‌కుమార్ సింఘాల్‌కు వీడ్కోలు పలికారు.



డాక్టర్ పిన్నమనేని లెనిన్‌ను సత్కరిస్తున్న కమ్మ జన సేవా సమితి సభ్యులు

కేజేఎస్ఎస్ నూతన భవనానికి రూ కోటి విరాళం

▸ ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదన్న డాక్టర్ పిన్నమనేని లెనిన్

▸ గుడి కంటే బడికే సాయం చేస్తానని వెల్లడి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో చాలా మంది ప్రవాసాంధ్రులు, ఇతర దాతలు తమ సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి పంచుతున్నారని ప్రవాసాంధ్రుడు, డాక్టర్ పిన్నమనేని లెనిన్ అన్నారు. గుంటూరు జేకేసీ రోడ్డులో కమ్మ జన సేవా సమితి నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయాన్ని సమితి సభ్యులతో కలిసి ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ నా సంపాదనలో ఎక్కువ శాతం బడికే ఇస్తానని, అంతేగాని దేవాలయాలకు విరాళం ఇవ్వనని స్పష్టం చేశారు. అందుకే గ్రామీణ బాలికల విద్యను ప్రోత్సహిస్తున్న కేజేఎస్ఎస్‌కు రూ.కోటి విరాళాన్ని ఇస్తున్నట్టు చెప్పారు. సమితి సేవలపై తన సహచర మిత్రులతో చర్చించి మరిన్ని విరాళాలను సేకరిస్తానని హామీ ఇచ్చారు. కష్టపడే విధానంపై వారి ప్రతిభ ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. సమితి అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ గుంటూరు జీజీహెచ్‌లో జింఖానా శిశు, మాత కేంద్రం నిర్మాణంలో డాక్టర్ లెనిన్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. కేజేఎస్ఎస్ ఆధ్వర్యంలో 2 వేల మంది బాలికలను వసతి కల్పించేందుకు రూ.50 కోట్లతో నిర్మిస్తున్న భవనానికి రూ. కోటి విరాళాన్ని ఇవ్వడం ఆయన దాతృత్వానికి నిదర్శమని చెప్పారు. అనంతరం డాక్టర్ లెనిన్‌ను సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు.

శ్రీవారితో పెట్టుకుంటే ఈ జన్మలోనే అనుభవిస్తారు



కల్తీ నెయ్యిపై ఎన్‌డీడీబీ నివేదిక వచ్చాకే మాట్లాడా: సీఎం

▸ జంతు కొవ్వులు ఉన్నాయని చెప్పాను

▸ నానా యాగీ చేసి సుప్రీంకు వెళ్లారు

▸ సుప్రీంకోర్టు సిట్ వేస్తే.. నేను క్షమాపణలు చెప్పాలట!

▸ తిరుమలలో మహాపాపం చేసి.. కప్పిపుచ్చుకోవడానికి నాపైనే తిరిగి దాడి

▸ వేంకటేశ్వరుడు మా ఇంటి దైవం

▸ నేనెప్పుడూ సామాన్య భక్తుడినే

▸ ఏనాడూ మహాద్వారం గుండా వెళ్లలేదు

▸ కుప్పంలో మీడియాతో చంద్రబాబు

కుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామితో పెట్టుకుంటే ఈ జన్మలోనే అనుభవిస్తారని సీఎం చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో మూడ్రోజుల పర్యటన ముగించుకున్న ఆయన.. చివరి రోజు ఆదివారం కుప్పంలో మీడియాతో మాట్లాడారు. 'తిరుమల పవిత్రతను కాపాడి, ప్రక్షాళన చేసేందుకు శ్యామలరావును ఈవోగా పంపాం. అప్పుడే ఆయన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) నివేదిక అడిగారు. కల్తీ నెయ్యిపై దాని నివేదిక వచ్చాకే మాట్లాడాను. జంతు కొవ్వులు ఉన్నాయని, కల్తీ చేశారని అప్పుడే చెప్పాను. నేను మాట్లాడాక నానా యాగీ చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లారు. కల్తీ నెయ్యి ఘటనలో దర్యాప్తు కోసం సిట్ వేస్తే.. నేను క్షమాపణలు చెప్పాలంటున్నారు. వాళ్లను ఏమనాలి? వైసీపీ నేతల ప్రవర్తనకు ఇదొక ఉదాహరణ. తిరుమలలో అపచారం, మహాపాపం చేసి.. దానిని కప్పిపుచ్చుకోవడానికి నాపైనే తిరిగి దాడి చేస్తున్నారు. వాళ్ల చర్యలు స్వామిని బజారుకీడ్చేలా ఉన్నాయి. శ్రీవారు మా ఇంటి దైవం. నేను నమ్మి ఆరాధించే దైవం. ఆ స్వామి దగ్గర నేను సామాన్య భక్తుడినే. మహాద్వారం గుండా వెళ్లి శ్రీవారిని ఎప్పుడూ దర్శించుకోలేదు. ఆయనతో పెట్టుకుంటే ఈ జన్మలోనే అనుభవిస్తారు' అని స్పష్టం చేశారు.

టెక్నాలజీని సమర్థంగా వాడాలి..

టీడీపీ శ్రేణులకు, తనకు దూరం చెరగాలంటే టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకోవాలని చంద్రబాబు సూచించారు. ఆదివారం తుమ్మిశి వద్ద నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కనీసం ఐటీడీపీ యాప్‌ను కూడా చాలామంది డౌన్‌లోడ్ చేసుకోవడం లేదు. అదేమంటే సాకులు చెబుతున్నారు' అని అసహనం వ్యక్తం చేశారు. వాట్సాప్ గవర్నెన్స్ తెస్తే అదెంతమంది ఉపయోగించుకుంటున్నారో చేతులు ఎత్తాలని అడిగారు. స్పందన చూసిన తర్వాత.. చాలా తక్కువ మందే టెక్నాలజీ వినియోగిస్తున్నారని ఆయన ఆక్షేపించారు. టెక్నాలజీని మీరే సరిగా వినియోగించుకోలేకపోతే, ఇక పార్టీ శ్రేణులకు ఏం చెబుతారని వేదికపై కూర్చున్న నాయకులను నిలదీశారు. టెక్నాలజీ, కమ్యూనికేషన్ స్కిల్స్ గురించి 19-20 సార్లు శిక్షణ ఇస్తే ఎంతమంది వచ్చారని ప్రశ్నించారు. ఫోన్‌ను సమర్థంగా వినియోగిస్తే కమ్యూనికేషన్ గ్యాప్ ఉండదన్నారు. '2028 నాటికి నా రాజకీయ జీవితం 50 ఏళ్లకు చేరుకుంటుంది. అభివృద్ధికి పునాదులు వేసింది, వేసేది టీడీపీనే. ప్రజల భవిష్యత్ కోసం, సంక్షేమం కోసమే నా ఆలోచనలు' అని భావోద్వేగంతో ప్రకటించారు. పార్టీని బలోపేతం చేసిన వాళ్లను వెతుక్కొచ్చి దండ వేసి గౌరవిస్తానని ఆయన అన్నారు. నిర్మొహమాటంగా మాట్లాడతానని.. వాస్తవాలు చెబుతానని.. తప్పులు సరిచేసుకోమని సూచిస్తానని.. అప్పటికీ మారకుంటే నమస్కారం పెడతానని చెప్పారు. లోకేశ్ కుప్పంనుంచి యువగళం ప్రారంభించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా తయారు చేసిన పాట సీడీని సీఎం ఆవిష్కరించారు. తుమ్మిశిలో గుండెపోటుతో మృతి చెందిన ఓ వ్యక్తి కుటుంబానికి సీఎం సహాయనిధి నుంచి రూ.3 లక్షల సాయం ప్రకటించారు.

వీడబ్ల్యూడీసీ సెంటర్లతో కోర్టుల్లో స్నేహపూర్వక వాతావరణం


▸ చైర్‌పర్సన్ జస్టిస్ గీతా మిట్టల్



అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులు, వృద్ధులు, లైంగిక దాడి బాధితులు మానసిక వేదనకు గురికాకుండా వారి వాంగ్మూలాల నమోదుకు సురక్షిత, స్నేహపూర్వక వాతావరణం ఉండేలా కోర్టుల్లో వల్నరబుల్ విట్నెస్ డిపాజిషన్ సెంటర్(వీడబ్ల్యూడీసీ)లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు నియమించిన వీడబ్ల్యూడీసీ చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్ అన్నారు. ఏపీ హైకోర్టు వల్నరబుల్ విట్నెస్ సెంటర్ల కమిటీ సహకారంతో ఆదివారం గుంటూరు కలెక్టరేట్‌లో వీడబ్ల్యూడీసీలపై న్యాయాధికారులకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథి గీతామిట్టల్ మాట్లాడుతూ.. 'కోర్టుల్లో వాంగ్మూలమిచ్చే సమయంలో సాక్షులు నిందితులను నేరుగా ఎదుర్కోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. సాక్షులు వేచి ఉండేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయడంతోపాటు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించాలి. ప్రధాన కోర్టుకు దూరంగా.. పిల్లలకు అనుకూలంగా ఉండేలా ఆట వస్తువులు, పుస్తకాలతో పాటు అన్ని వయస్సులవారికీ అనుకూలంగా ఉండేలా ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలి. సాక్షుల పాఠశాల, పేరు, చిరునామా వంటి వివరాలు బయట పెట్టకుండా నిషేధించాలి' అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు వీడబ్ల్యూడీసీ కమిటీ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్, న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ వి.సుజాత, జస్టిస్ వి.గోపాలకృష్ణ, జస్టిస్ సుభేందు శమంత, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ కిరణ్మయి, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా కొండలా పేరుకున్న బకాయిలు

▸ ఏపీ ఎన్జీవోలో యువ ఉద్యోగులకు ప్రాధాన్యం: విద్యాసాగర్



సమావేశంలో మాట్లాడుతూన్న విద్యాసాగర్

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ శాఖల్లో 12.50 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారని వారి ప్రతి డిమాండ్ పరిష్కారం ఓ ప్రసవ వేదనతో సమానమని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. ఆదివారం గుంటూరులో ది స్కూల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యాసాగర్ మాట్లాడుతూ, గత ఆరేళ్లుగా ఉద్యోగులకు సంబంధించిన వివిధ రకాల బకాయిలు ప్రభుత్వం వద్ద కొండలా పెరిగిపోయాయని తెలిపారు. ప్రభుత్వంతో ఘర్షణ వాతావరణం లేకుండా సానుకూల దృక్పథంతో సమస్యలు పరిష్కరించుకునేందుకు కృషి చేస్తామని, కుదరని పక్షంలో పోరాటానికి సన్నద్ధమవుతామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పీఆర్సీ వేయలేదని, మరి కొద్ది రోజులు ఎదురుచూసి కార్యాచరణ సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌లో యువతకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 మందికి పైగా యువతను ఆఫీస్ బేరర్లుగా నియమించామని వెల్లడించారు. స్కూల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అమరావతి ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని విద్యాసాగర్ తెలిపారు.



కడప జిల్లా కొండాపురంలో పవర్ ప్రాజెక్టు వద్ద నిర్మిస్తున్న సొరంగం వద్ద కంపెనీ సిబ్బందితో గౌతమ్ అదానీ, ఎంపీ సీఎం రమేశ్


'అదానీ పవర్' పనులు పరిశీలించిన గౌతమ్

▸ సత్యసాయి, కడప జిల్లాల్లో పర్యటన

కొండాపురం/లింగాల/తాడిమర్రి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ దిగ్గజ పారిశ్రామికవేత్త, అదానీ సంస్థల చైర్మన్ గౌతమ్ అదానీ ఆదివారం రాయలసీమలో పర్యటించారు. అహ్మదాబాద్ నుంచి కడపకు విమానంలో వచ్చిన ఆయన అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) వద్దకు ఉదయం 9.30 గంటలకు చేరుకున్నారు. ఇక్కడి నుంచి రోడ్డుమార్గం ద్వారా సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం దాడితోట గ్రామం వద్ద 407 ఎకరాల్లో రూ. 2 వేల కోట్లతో నిర్మితమవుతున్న హైడ్రో పవర్ ప్లాంట్ వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాక్‌ఫిల్ డ్యాం పనుల వద్ద 20 నిమిషాల పాటు ఉండి నాణ్యత గురించి ఆరాతీశారు. విద్యుదుత్పత్తి తరువాత తిరిగి నీరు డ్యాంలో కలిసే టన్నెల్‌లోకి వెళ్లి సంబంధిత అధికారులతో వివరాలు అడిగితెలుసుకున్నారు. ప్రాజెక్టు పైభాగంలో నిర్మిస్తున్న ట్యాంకు ఇతర పనులను పరిశీలించారు. కడప జిల్లా, కొండాపురం మండలం కె.బొమ్మేపల్లె దొంతికోన వద్ద గండికోట ప్రాజెక్టు సమీపంలో అదానీ సంస్థ నిర్మిస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు వద్దకు మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు సాగిన ఆయన పర్యటనలో సుమారు రూ. 10 వేల కోట్లతో 1,800 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న పవర్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. పవర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న సొరంగం పనులను కూడా చూశారు. అనంతరం ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను కంపెనీ ఇంజనీర్లు ఆయనకు మ్యాప్ ద్వారా వివరించారు. అదానీతో పాటు ఆయన కుమారుడు, సంస్థ సీఈవో జీత్ అదానీ కూడా వచ్చారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీఎం సురేశ్‌నాయుడు, అదానీ సంస్థల ఎండీలు వినీత్‌జైన్, అనిల్‌షర్దానా, టీటీఓ నరేశ్, ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మండల్, మేనేజర్ రాంశంకర్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్‌గా రవీంద్రరాజు

విజయవాడ (గాంధీనగర్), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయీస్ జేఏసీ ఏర్పాటైంది. విజయవాడ ఫిల్మ్ చాంబర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బీహెచ్ రవీంద్రరాజు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బి.మధుబాబు సెక్రటరీ జనరల్‌గా, బి.సుగుణ కన్వీనర్‌గా, ఎన్.పెద్దయ్య కో-చైర్మన్‌గా, చంద్రమౌళి కోశాధికారిగా, ఎస్.రాజశేఖర్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా.. మొత్తం 26 మందితో జేఏసీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ వీఆర్ఏ నుంచి తహసీల్దార్ల సమస్యల పరిష్కారమే అజెండాగా జేఏసీ పనిచేస్తుందన్నారు. అప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వర్క్ టు రూల్ నిర్ణయాన్ని అమలు చేయాలని జేఏసీ తీర్మానించిందన్నారు. ఏపీఆర్ఎస్ఏ (ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్) అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు రాష్ట్రంలోని రెవెన్యూ సమస్యలు పట్టించుకోకుండా, కేవలం తన వ్యక్తిగత లాభం కోసం రెవెన్యూ స్పోర్ట్స్ పేరుతో అనధికారంగా కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.



నీకు ఎవరూ లేరు, ఇక భయం లేదు!

విరామ చిహ్నాలను తన్నిపారేసి, అవునూ కాదని నానుస్తూ, దీర్ఘంగా అర్థరాహిత్యాన్ని మోస్తూ పాకుతున్న వెయ్యి కాళ్ళ కీటకాల్లా కనపడతాయి కాఫ్కా వాక్యాలు (కానీ ఏ ఒక్క అక్షరమూ నిరర్థకం కాదు). పదం పక్కన పదాన్ని దీక్షగా కూర్చోపెట్టి, పాఠకుడి చుట్టూతానే వాడి ఆజన్మాంత కారాగార వాసాన్ని కడుతూ, వాణ్ణి ముట్టడించేందుకు పటిష్టంగా నిర్మాణమవుతున్న కోటలు అనిపిస్తాయి కాఫ్కా కథలు.

తన అస్తిత్వం బందీ కాబడిందని గ్రహించటం మానేసిన మనిషి ఇష్టంగా ఇరుక్కుపోయి, సంతోషంగా ఇబ్బందిని అనుభవిస్తూ వస్తున్న శిక్షాగృహాల నమూనాలు కూడా ఆ కథలు. ఆ శిక్షాగృహాల గోడలను పగులగొట్టుకోవటానికి ఉపయోగపడే పదునైన గొడ్డళ్ళు కూడా ఆ కథలే.

కాఫ్కా రచనలు పాఠకులను ఈ భూమ్మీంచి కాస్త ఎత్తులో ఉపరిభ్రమణం చేయిస్తూ మానవ జీవిత అస్తిత్వాన్ని, దాని నుండి విడివడి, కొంచెం పైనుండి గమనించేట్టు చేస్తాయి. "అదిగో! అది నీ బందీఖానా. నీవు అక్కడ బ్రతకవలసిందే, పై అప్పీలు చేసుకునే వీలు కూడా నీకు లేదనే తీర్పు ఇచ్చేశారు" అనే హెచ్చరికా చేస్తాయి. అయితే ఆ శిక్షను మోసుకుని ఇక్కడకు వచ్చిపడ్డ మనిషి ఏం చెయ్యాలి? మామూలుగా ఏం



చేస్తుంటాడుట? తనకు విధించిన తీర్పును ఎదిరించే ప్రయత్నంలో రకరకాల వాదనలు చేస్తూ (ఏ "వాదమ్మై"నా వీగిపోయేదే), తన వాదమే తన అస్తిత్వం అని చెప్పుకుంటుంటాడు.

'మెటమార్ఫసిస్' కథలో గ్రెగర్ సంసా యాంత్రిక జీవితంతో విసిగి, మానవుడిగా తన ఉనికి అర్థరహితం కాకూడదనుకున్న మెలకువ తెచ్చుకున్న కీటకంగా మేలుకుంటాడు. 'ద జడ్జిమెంట్' అనే కథలో జార్జ్ తన 'alienation వేదన'కు మందుగా పని చేసేది వివాహమా, రచనా వ్యాసంగమా అనే సందిగ్ధతలో తలమునకలవుతుంటే, తండ్రి "ఏట్లో దూకిచావు" అనే తీర్పు ఇస్తాడు. 'ద ట్రయల్' నవలలో జోసెఫ్ కె. సాదాసీదా బ్యాంకు ఉద్యోగిగా గానుగ ఎద్దులా తలవంచి బతికేస్తుంటే చెయ్యని పాపానికి ఒకరోజు పొద్దున్నే కోర్టు మనుషులొచ్చి "నిన్ను అరెస్ట్ చేస్తున్నాం" అంటారు. 'ద కాసల్' నవలలో K. మానవసంచారం, ఎటువంటి ఆఫీస్, ఏ పై అధికారీ లేని ఊరుకు లాండ్ సర్వేయరుగా బదిలీ చేయబడతాడు. ఇలా కాఫ్కా పాత్రలకు శిక్షలు పడుతుంటాయి, కానీ వారి నేరం ఏమిటన్నది వారికి ఎవరూ చెప్పరు. న్యాయం కోరుతూ ఎటు పోవాలో ఎవర్ని కలవాలో తెలియదు. అసలు న్యాయస్థానం ఎక్కడుందో దానికి ప్రవేశం ఎలానో తెలీక గిజగిజలాడతారు.

కాఫ్కా సున్నితమైన మనసు మీద ప్రతి ప్రభావమూ అత్యంత గాఢంగా పడేది. తీవ్ర మనస్తత్త్వ చింతన చేసేవాడు కాబట్టి తనను తాను ఏ పక్షపాతం లేకుండా విశ్లేషణ చేసుకునేవాడు. ఈ కారణంతోనే నిజజీవితంలోని సంఘటనలను, వ్యక్తులను కాఫ్కా ఉన్నదానికంటే చాలా తీక్షణంగా కథల్లో చిత్రించాడు.

పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను అని కాఫ్కా చెప్పినపుడు, "ఆ పిల్ల కుచ్చుల జాకెట్ ఏదో వేసుకొని ఉంటుంది, ఆ యూదు ఆడవాళ్ళ వేషాలివన్నీ. నీవు వెంటనే పడిపోయి ఆ పిల్లతో పెళ్లి అనేస్తున్నావు" అన్న తండ్రి మాట, 'ద జడ్జిమెంట్' కథలో "ఏట్లో మునిగి చావు" అయింది. కఠినుడైన కథలోని తండ్రి నిజానికి కాఫ్కా స్వంత అంతరంగమే. వాస్తవ జీవితంలోని ప్రేరకాలను "ఇవి అసంబద్ధం" అనిపించే తీవ్రతతో రచనలోకి తేవడమే కాఫ్కా క్రాఫ్ట్. ఆ ప్రేరకాల ప్రభావాన్ని పెను బూతద్దంలో చూపిస్తూ భయోపేతంగా నిలబెడుతూనే, మరోవైపు ఇది కేవలం పీడకల అని రద్దు చేయడం కాఫ్కా కళ. అతని కథల్లోని వివిధ పాత్రలన్నీ తన అంతఃచేతనలోంచి వచ్చినవే. నేరభావన, తిరగబడాలనే తత్త్వం – మనిషి అంతఃకరణ అనే నాణానికి ఇరు ముఖాలుగా చూపిస్తాడు. "నేను ఏ పాపం ఎరుగను అని ఎప్పుడూ అనుకోకు", "దేవుడి చికాకుకు రూపాలం మనం, మనకు నిష్కృతి లేదు", ఈ రెండూ కాఫ్కా వాక్యాలే.

సగటు మనిషికి న్యాయం ఎంత అలభ్యమో 'బిఫోర్ ద లా' అనే కాఫ్కా స్కెచ్‌లో ఉంది. న్యాయగృహం ఎదుట ఒక కాపలా వాడు నిల్చునుంటాడు. ఒక మనిషి అక్కడకు వచ్చి నన్ను లోపలికి వెళ్ళనివ్వు అంటాడు. ద్వారపాలకుడు "ఇప్పుడు కాదు" అంటాడు.

"తర్వాత పోవచ్చా నేను?"

"బహుశా!"

అలా ఏళ్ళతరబడి పదే పదే ద్వారపాలకుడిని "నేను లోపలకు పోవచ్చా? పోవచ్చా?" అని అడుగుతునే ఆ పాత్రకు వార్ధక్యం, అంతిమ ఘడియలు వచ్చేస్తాయి. చివరకు చుట్టూ చీకటి పడిపోయింది అని మూసి ఉన్న ఆ ద్వారపు సందులోంచి ఇవతలకి కనపడుతున్న వెలుగు వల్ల తెలుస్తుంది. వంగిపోయి క్షీణించిన ఆ మనిషి కాపలావాడిని అడుగుతాడు, "ఇక్కడ లోపలికి అనుమతి అడుగుతూ నేను తప్ప ఇంకెవరూ ఎందుకు రాలేదు?" అని.

పైకి మాత్రం నేను ఏ తప్పూ చేయలేదనే వాదనలు చేస్తూనే తనకు పడవలసి ఉన్న శిక్షను వెతుక్కుంటూ తిరుగుతుంటాడు మనిషి. చివరకు, జీవితాన్ని తన మీద జరుగుతున్న ఒక నేర విచారణలాగ చూడటానికి అలవాటు పడతాడు. అందుకే ఉన్నట్లుండి తను కీటకంగా మారినా, మరో కథలో పొద్దున్నే కాఫీ బదులు వాకిట్లోకి అరెస్ట్ వారెంట్ వచ్చినా పెద్దగా ఆశ్చర్యపడడు. మానవ జీవితాన్ని తను చూసే ఈ విధానం, తన కళకు ఎంచుకున్న కాన్వాస్ ఒకటే మెటీరియల్ కాఫ్కాకు.

ఈ ముసలోడు మరో అరక్షణంలో ఎలాగూ చనిపోతాడని దయతలచి ఆ కాపలావాడు, "ఈ ద్వారం ఉన్నది కేవలం నీకోసం మాత్రమే, మరెవరూ ఇక్కడకు వచ్చే అవకాశం లేదు, కానీ నీవు ఈ తలుపులు దాటే వీలు లేదు, నిన్ను అనుమతించే అధికారం నాకూ లేదు," అని ఆ ముసలి చెవిటి చెవిలో గట్టిగా అరిచి చెప్తాడు.

ఆ కనపడే ద్వారం దాటగలిగితే తమకు న్యాయమూ, పరమ స్వేచ్ఛారూపమైన అస్తిత్వమూ దొరుకుతాయని కాఫ్కా పాత్రల నమ్మకం. కానీ లోపలకు పోయే అనుమతి వాళ్ళకు ఎప్పటికీ దొరకదనీ తెలిసిన నిస్సహాయులు వారు.

షోపెన్‌హోవర్ ద్వారా కాఫ్కా పైన ఉపనిషత్తుల ప్రభావం ఉండే అవకాశం లేకపోలేదు. అతని డైరీలు ఉత్తరాల్లో అందుకు ఆధారముంది. జిజ్ఞాసువుగా ఎంత దూరం వెళ్ళగలడో వెళ్ళాడు. క్రిస్టియానిటీ అయినా జుడెయిసమ్ అయినా ఉపనిషత్తులైనా ఏం చెబుతున్నాయో విన్నాడు, అంతవరకే. అవి ఉన్నది అని చెప్పిన ఆ పరమసత్యాన్ని చూచానని ఎక్కడా అబద్ధం చెప్పలేదు. 'ఈ జీవితం ఏమిటి?' అనే సత్యాన్వేషణ చేయవలసిందే మనిషి, కానీ కడపటికి ఒక ఆవలి ఒడ్డో, ఒక సత్యమో, ఒక వెలుగో మనిషిని తన ఒడిలోకి ప్రేమగా తీసుకుంటుంది అని రూఢీగా చెప్పలేరెవరూ, ఇంతవరకూ చెప్పలేదు ఎవరూ, నాకూ తెలియలేదు చివరివరకూ అని ఒప్పుకున్న నిజాయితీ ఉన్న తాత్త్వికుడు కాఫ్కా. "అవతలకు మార్గం ఉంది, కానీ అక్కడ గమ్యం లేదు" – కాఫ్కా వాక్యం.

పోనీ, ఇక్కడ చుట్టూ చూస్తే కనపడినమేరా ఒక నిరంకుశ, వివేకరహిత, హాస్యాస్పద, నిరర్థక వ్యవస్థ నడుస్తుంటుంది అన్ని రంగాలలో (రాజకీయ, న్యాయ, సాంఘిక, కౌటుంబిక, మత, ఆధ్యాత్మిక). అన్ని తలాలలో ఒక నిరంకుశ ప్రభువు పాలన జరుగుతుంటుంది. ఆ ప్రభువు నాన్న కావచ్చు, పై అధికారి కావచ్చు, సహోద్యోగి, ఇరుగు పొరుగు, ఇంటి ఓనరు, సంపాదనలేని ఆర్టిస్ట్, కింది కోర్టులో తపాలా బంట్రోతు, అంతిమంగా పరలోకపు తండ్రి... ఎవరైనా కావచ్చు.

ఇదంతా అన్యాయం అని అరవాలని ఉంటుంది. నా నేరం ఏదో ఉండే ఉంటుందనీ అనిపిస్తుంటుంది. పైకి మాత్రం నేను ఏ తప్పూ చేయలేదనే వాదనలు చేస్తూనే తనకు పడవలసిన శిక్షను వెతుక్కుంటూ తిరుగుతుంటాడు మనిషి. చివరకు, జీవితాన్ని తన మీద జరుగుతున్న ఒక నేర విచారణ లాగ చూడటానికి అలవాటు పడతాడు. అందుకే ఉన్నట్లుండి తను కీటకంగా మారినా, మరో కథలో పొద్దున్నే కాఫీ బదులు వాకిట్లోకి అరెస్ట్ వారెంట్ వచ్చినా పెద్దగా ఆశ్చర్యపడడు. మానవ జీవితాన్ని తను చూసే ఈ విధానం, తన కళకు ఎంచుకున్న కాన్వాస్ ఒకటే మెటీరియల్ కాఫ్కాకు.

పూర్తి మెలకువలోను, గాఢ నిద్రలోను ఉండే చైతన్యాలకు లేని ఒక అతీంద్రియ శక్తి, నిద్రామెలకువ కాని స్థితిలో పనిచేసే చైతన్యానికి ఉంటుంది. కనిపించే లోకానికి, దానికి అవతలున్న లోకానికి మధ్య ఉండే త్రాటి మీద నడుస్తూ ప్రస్తుత భౌతిక లోకాన్ని కొంచెం ఎత్తు నుండి చూసే సామర్థ్యం ఉంది దానికి. కాఫ్కా కథలు ఆ కొంచెం ఎత్తును అనువుగా ఉపయోగించుకుని సమస్తాన్ని చూస్తుంటాయి. ఆ ప్రత్యేకావస్థలో లభ్యమయ్యే చైతన్యపు యవనిక మీద అతని రచనలు ప్రొజెక్ట్ అవుతాయి. కాఫ్కా పాత్రలు అటు మరీ అమూర్త, అస్పష్ట రూపాలూ కాదు; ఇటు నూరు శాతం నేల మీదే నడిచే వాస్తవ రూపాలూ కాదు. ఎంత నిజమో అంత భ్రమ కాఫ్కాకు ఈ జీవితమూ, ప్రపంచమూ. జీవితం అంతా ఆ స్పష్టవిభ్రమ తాలూకు క్లారిటీతో జీవించాడు.

ఒకసారి తన ఇరవై ఏళ్ల వయసులో, ప్రాగ్ నగర సమీపాన పర్వతసానువుల్లో పడుకుని మెలాంకలిక్ క్షణాలలో తేలిపోతున్న తనను ఒక సత్యస్ఫురణ తాకిందనీ, ఆ క్షణంలో ఈ జన్మకు తను కోరుకోదగిన కోరిక ఒక్కటేనని తెలుసుకున్నాను అనీ అంటాడు: "జీవితం తన సహజమైన కఠినమైన ఒడిదుడుకులతో ఉంటూనే, అదంతా ఏమీ కాని ఒక విషయం లాగ, ఒక కల లాగ, నేలపైన కాలు ఆన్చకుండా తేలిపోతున్నదానిలాగా నాకు ప్రతిక్షణం స్పష్టంగా తెలియవస్తుండాలి. అలా చూడగలిగిన దృక్పథం నాకు పట్టుబడాలి, అదే నా బలమైన కోరిక" అని అని అతని 'Contemplations'లో అంటాడు.

ఉనికికీ శూన్యానికీ మధ్య మనిషి అస్తిత్వాన్నే వేలాడదీసిన తరువాత మనిషి చేసే ఏ పనికైనా ఇక ఏ మాత్రం ప్రాముఖ్యం ఇవ్వాలి, అసలు ఏ పనైనా చేసే అవసరం, ఆ పనిలో అర్థం ఉన్నాయా? దానికి జవాబు, తనకు ఇరవైఏళ్ళ వయసులో దొరికిన సాక్షాత్కారంలోనే ఉందంటాడు: "ఒక మేజాబల్లను చేసేవాడు ఎట్లా దాన్ని జాగ్రత్తగా కోసి, చెక్కి, చక్కగా చిత్రిక పట్టి ఆ పనే తనకు ప్రాణం అంత ప్రాముఖ్యం అనిపించేలాగ చేస్తున్నట్లు కనిపించాలో, వాడికి అసలు ఆ కార్పెంటరీ పని పెద్ద ప్రాముఖ్యం అయిన పనేకాదు అని అనిపించేట్టూ కనపడాలి." ఈ పరస్పరవిరుద్ధమైన లక్షణాలు, పనిలో అద్భుతమైన కళ చూపించే కార్పెంటర్ కాఫ్కా ఊహలో మనిషి. అతనే కాఫ్కాకు మార్గదర్శి కాబట్టే, జీవితంలో తిండి, ఆరోగ్యం, వివాహం, తత్త్వవిచారం, ఆఖరుకి ప్రియమైన సంగీతం అన్నీ త్యాగం చేసి, ("ఆ విషయాలలో నా శక్తులు, ఆసక్తులు నిశ్శేషంగా క్షీణించాయి") రాతను తపస్సు చేసుకుని సాహిత్యాన్ని సృష్టించాడు కాఫ్కా. తీవ్రమైన అస్తిత్వవేదన, దానిని చూడగల ఒక ఆధునిక దార్శనికత విడదీయలేని విధంగా పెనవేసుకుపోయిన వ్యక్తిత్వమూ, సాహిత్యసృష్టి కాఫ్కా మార్క్. తన రచనలకు విషయమూ శైలి కూడా ఆధునిక మానవుడి అర్థరాహిత్య అస్తిత్వం తనలో రేపిన గాయం నుండే తోడుకున్నాడు.

కాఫ్కాకు సాహిత్య రచన ఒక సాధనం. ప్రహేళిక వంటి తన నిగూఢ తత్త్వాన్ని తనకే విశద పరచే సాధనం.

అతని వాక్యం ఒకే విషయాన్ని అవునూ కాదూ రెండూ అంటుంటుంది. కాఫ్కా రచనలకు వస్తువూ, శైలి రెండూ ఈ అవును కాదుల సహజీవనమే.

■ పద్మజ సూరపరాజు
© 99403 44406

సోమవారం 2 ఫిబ్రవరి 2026

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'కృష్ణాతీరం – కవితాహారం': కవి సమ్మేళనం

ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సహకారంతో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఫిబ్రవరి 8న కృష్ణానదిలో బోధి సిరి పడవపై వినూత్నంగా 'కృష్ణాతీరం– కవితాహారం' కవి సమ్మేళనం నిర్వహిస్తోంది. నాటితరం కవులతో పాటు నేటితరం కవుల నుండి ఎంపిక చేసుకున్న 50 మంది కవులు ఈ కవి సమ్మేళనంలో తమ కవితల్ని వినిపిస్తారు. ఈ కార్యక్రమం ఉ.10 గంటలకు మొదలై సా.4 గంటలకు ముగుస్తుంది. ముఖ్య అతిథి జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ, రేగుళ్ళ మల్లికార్జునరావు తదితరులు హాజరవుతారు. ఫోన్: 92464 15150.

కలిమిశ్రీ

భూతం విమల స్మారక పురస్కారం

తెలంగాణ సాహితి – భూతం విమల స్మారక సాహితి సంస్థల ఆధ్వర్యంలో భూతం విమల స్మారక కథా సాహితీ పురస్కారాన్ని గోరటి వెంకన్న చేతుల మీదుగా 'నల్ల బంగారం' కథా సంపుటి రచయిత్రి స్వర్ణ కిలారి స్వీకరిస్తారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 8 ఉ.11గంటలకు యుటిఎఫ్ ఆఫీస్, నల్లగొండలో జరుగుతుంది. బన్న ఐలయ్య, జీవి రత్నాకర్, సిద్ధంకి యాదగిరి తదితరులు హాజరవుతారు.

భూతం ముత్యాలు

కథా గౌరవ సభ

మధునాపంతుల వెంకటేశ్వర్లు (మధుశ్రీ) కథా గౌరవ సభ ఫిబ్రవరి 8 ఉ.10.30 గంటలకు మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణం, పల్లిపాలెంలో జరుగుతుంది. కథా గౌరవ స్వీకర్తలు: వి. రాజారామమోహనరావు, కుప్పిలి పద్మ, రుబీనా పర్వీన్. సభలో చెన్నూరి రాంబాబు, సుంకర గోపాలయ్య, బందా శుభశ్రీ, కిరణ్ మధునాపంతుల, మధునాపంతుల సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 99490 02477.

యం.వి. చలపతి

మూర్తీభవించిన శ్రామిక శక్తి సయ్యదా

తొమ్మిదేళ్ళ అధ్యయనం, దాదాపు 900 మందిని కలిసిన అనుభవం, అనేక గంటల ఇంటర్వ్యూలు, సామూహిక చర్చలు, సరదాగా చెప్పుకొన్న కబుర్లు, వందల గంటల లైబ్రరీ అధ్యయనం ఫలితంగా వెలువడిన ఆంగ్ల పుస్తకం 'The story of unknown Indian' అనే ట్యాగ్‌లైన్‌తో నేహా దీక్షిత్ రాసిన 'The Many lives of Syeda X'. అదిప్పుడు మలుపు బుక్స్ ద్వారా 'సయ్యదా X, ఒక అపరిచిత భారతీయురాలి కథ' పేరుతో తెలుగులోకి వచ్చింది.




సయ్యదా ఒక మహిళ, ఒక ముస్లిం మహిళ, ఒక పేద ముస్లిం మహిళ. ఈ దేశంలో అత్యంత వల్నరబుల్ అస్తిత్వ మిశ్రమం ఇది. నేహా తన పుస్తకం ద్వారా సయ్యదా లాంటి లక్షలాది అథో జగత్ మనుషులను పరిచయం చేసారు.

హిందువుల పుణ్యక్షేత్రం బెనారస్ పట్టణంలో ముస్లిం యువతిగా సయ్యదా జన్మిస్తుంది. 1992లో బాబ్రీ మసీద్ కూల్చివేత నుండి 2020లో ఈశాన్య ఢిల్లీలో జరిగిన మారణకాండ వరకూ ఆమె పయనాన్ని మనకు చెబుతారు నేహా దీక్షిత్. ఈ 28ఏళ్లలో మారిన భారత ముఖచిత్రాన్ని ఆమె అర్థం చేసుకొన్న తీరూ, పాఠకులకు ప్రెజెంట్ చేసిన పద్ధతీ– ఈ పుస్తకానికి పాఠకుల అల్మారాల్లో గర్వంగా నిలబడే స్థానాన్ని ఇచ్చాయి.

1992–2020 మధ్య కార్యశీలకంగా ఉన్న వాళ్లకు భారతదేశం ఎలా మారుతూ వచ్చిందో తెలుసు. నేహా ప్రస్తావించిన ఘటనలన్నీ అప్పటివే. మనం బలవంతంగా స్మృతిపథంలో మరుగున పరిచిన ఆ స్మృతులను నేహా బయటకు లాగి– 'ఇదిగో ఈ కాలంలో, ఇక్కడ, ఇలా సయ్యదా ఉందని చెబుతారు. అక్కడ, అప్పుడు బాధితులుగా, సాక్షులుగా ఉన్నది సయ్యదాలు, జరీనాలు, జాకీయాలు, జహీరాలు, బిల్కిస్ బానోలే.

పట్టు, వెండిదారాలతో సొగసైన చీరలు నేసే బెంగాల్ ముస్లింల ఇళ్లు సయ్యదా పుట్టినిల్లు, మెట్టినిల్లు. మగ్గాన్ని కట్నంగా తీసుకొని సగర్వంగా అత్తారింటి అడుగు పెట్టి, బెనారస్ చీరలలో కూడా అరుదైన చీరలు నేసే అక్మల్ ప్రేమను పొందింది. ఆ కాలంలో నేత నైపుణ్యం ఉన్న ముస్లింల చేతిలో బెనారస్ చీరల తయారీ ఉండేది. కాశీ అన్నపూర్ణకు కట్టే చీరలు కూడా ముస్లిములే అనేక దశాబ్దాలుగా నేస్తూ వచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో బాబ్రీ మసీదు ధ్వంసం కలిగించిన ప్రకంపనాలు బెనారస్‌ను కూడా తాకాయి. జ్ఞానవాపి మసీదు అక్కడ ఉండటం, నేత పని ముస్లింల చేతిలో ఉండటం– ఈ రెండు విషయాలు బెనారస్ సరిహద్దుల్లో ఉన్న మదన్ పురా దాడులకు కారణం అయ్యాయి. ప్రతి మత కల్లోలం వెనక ఆర్థిక, రాజకీయ కారణాలు ఉంటాయని ఈ సందర్భంగా పట్టిచూపారు రచయిత్రి. బాబ్రీ మసీదు ధ్వంసంతో పాటు, బెనారస్ ముస్లింల మగ్గాలు కూడా ధ్వంసం అయ్యాక వాళ్ళకు బతకలేని పరిస్థితులు వచ్చాయి. నూతన ఆర్థిక విధానాల తరువాత పవర్ లూమ్స్ ఉనికిలోకి వచ్చాక ఆకలి, దుఃఖం వారికి అనుభవం అయినవే కానీ, బాబ్రీ మసీదు ధ్వంసం తరువాత మొదటిసారిగా ఆ కుటుంబాలకు భయోత్పాతం అనుభవం అయింది. పొట్ట చేతబట్టుకొని ముగ్గురు పిల్లలతో ఆ కుటుంబం కనబడిన రైలు ఎక్కి ఢిల్లీ చేరుతుంది.

ఇక్కడ నుండి కథన వైశాల్యం విస్తృతం అవుతుంది. బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్‌ల నుండి బతకలేకనో, లేక బతకనివ్వకపోవటంతోనో అనేక ముస్లిం కుటుంబాలు వలసలుగా ఢిల్లీ చేరాయి. పట్టు చీరలు అల్లిన



కళాకారుడు అక్మల్ రిక్షా కూలి అయ్యాడు. ఇల్లు దాటని సయ్యదా అవిశ్రాంత, అసంఘటిత కార్మికురాలు అయ్యింది. రోజుకు 16 గంటలు, ఒక్కోసారి నాలుగు ఉద్యోగాలు (అంటే పనులు) చేస్తూ కుటుంబాన్ని లాగింది. ఢిల్లీ నగరం పరిశుద్ధం కావాల్సిన ప్రతిసారీ వలస వచ్చిన వాళ్లు నగరం అంచులకు నెట్టబడ్డారు. అలా ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్ ఒక సరిహద్దుగా కల్మష యమునా నది ఒడ్డును ఒరుసుకొని ఈశాన్య ఢిల్లీ ఏర్పడింది. కనీస వసతులు లేని, పక్షి గూళ్ల లాంటి అపరిశుభ్ర నివాస గృహాలు అక్కడ మొలిచాయి. అవే సయ్యదా కుటుంబం లాంటి వేలాది కుటుంబాలకు ఆవాసం అయ్యాయి.

ఐదుగురు మనుషులకు కనీసం రెండుపూట్ల అయినా నాలుగువేళ్ల లోపలికి పోవాలంటే ఎంత కష్టపడాలి? జీన్స్ దారాలను కుట్టటం దగ్గర నుండి తినుబడరాలు తయారు చేయటం, బాదంకాయలను పగల కొట్టటం దగ్గర నుండి టీ ఫిల్టర్స్ తలుపు కొక్కేలు, కుక్కర్లు, ఫోటో ఫ్రేములు తయారు చేయటం– సయ్యదా చేయని పని లేదు. బొట్టు బిళ్లలు, సాఫ్ట్ టాయ్స్, వెడ్డింగ్ కార్డులు, ఎలక్ట్రానిక్ వస్తువులు– కారు



నేహా దీక్షిత్

చౌక శ్రమ ఎక్కడ అవసరం అవుతుందో అక్కడ సయ్యదా ఉంటుంది. కనీసవేతన చట్టాలు, కార్మిక రక్షిత చట్టాలు కాగితాలకే పరిమితమైన చోట– లక్షలాది సయ్యదాలు తమ చెమటనూ, ఆరోగ్యాన్ని ధారబోసి ఢిల్లీ నగరాన్ని, భారత దేశాన్ని భాగ్యవంతం చేశారు.

సామాన్య మానవుడికి అవసరమైన ఆహారం, చిరుతిళ్లు, సౌందర్యసాధనాలు, స్టేషనరీ, దుస్తులు, వాహనాల విడి భాగాలు, పుస్తకాలు, ప్రింట్లు,

సయ్యదా ఒక మహిళ, ఒక ముస్లిం మహిళ, ఒక పేద ముస్లిం మహిళ. ఈ దేశంలో అత్యంత వల్నరబుల్ అస్తిత్వ మిశ్రమం ఇది. నేహా దీక్షిత్ తన పుస్తకం ద్వారా సయ్యదా లాంటి లక్షలాది అథో జగత్ మనుషులను పరిచయం చేసారు.

స్పేర్ పార్టులు, అలంకరణ వస్తువులు, బొమ్మలు, వంటగది ఉపకరణాలు, హార్డ్‌వేర్, వడ్రంగి పరికరాలు, పైపుల సామాను, భవన నిర్మాణ సామగ్రి, భక్తి సంబంధిత సరంజామా, పండగ దినుసులు, వైద్య సంబంధిత వస్తువులు, ఎలక్ట్రిక్ మెటీరియల్స్ –మహిళలు వీటన్నిటిని ఇక్కడ విడివిడిగా తయారు చేస్తారు. అవన్నీ అంచెలంచెల కాంట్రాక్టర్ల ద్వారా కనబడని యజమానులకు చేరుతాయి. వాళ్లే బహుళజాతి కంపెనీ ఓనర్లు. భారత దేశపు పేదకార్మికురాల్ని కొల్లగొట్టి, మల్టీమిలియనీర్లు అయినవాళ్లు.

నేహా దీక్షిత్ మహిళల శ్రమ దోపిడీ గురించి క్షుణ్ణంగా, వ్యక్తులను నిలబెట్టి మరీ సోదాహరణంగా వివరిస్తుంది. ఇంటి దగ్గర చేసే పీస్ వైజ్ పని పనే కాదనీ, ఆడవాళ్లు ఒళ్లు విరుచుకొని అహర్నిశం పడే కష్టం వేడినీళ్లకు చన్నీళ్లనే లాంటి సిద్ధాంతాలను బయటవాళ్లు కాదు, ఆడవాళ్లే నమ్ముతారని వాళ్ల మాటల్లోనే చెబుతారామె. ఈ పుస్తకంలో నేహా వర్ణించిన లాంటి వందలాది శ్రమలతో తయారైన వస్తువులు ఏదో ఒక రూపంలో మన దగ్గరకు ఉంటాయి. మెత్తని దిండును తడిమి చూస్తే, దాని వెనుక సయ్యదా నల్లటి గట్టిపడిన వేళ్ల శ్రమ ఉంటుంది. పొద్దున్నే పూజకు వెలిగించే అగరబత్తి సువాసనతో సయ్యదా చెమట వాసన కలగలిసి ఉంటుంది. సయ్యదా అంటే ఒక వ్యక్తి కాదు. అనేక శ్రామికశక్తుల మూర్తిమత్వం.

బాదంపప్పు ఒలిచే కర్మాగారంలో జరిగిన సమ్మెలో పాల్గొన్న మహిళల గురించి రాసిన 'బాదంపప్పు' అనే అధ్యాయం ఈ పుస్తకానికి తలమానికం. సమ్మెలో పాల్గొనటానికి మొదట సంసిద్ధత లేని మహిళలు అంచెలంచెలుగా ఎలా ఎదుగుతారో వివరంగా రాశారామె. సమ్మె విజయవంతం అయిందా లేదా అనే ప్రశ్న కాదు. సమ్మె చేయాల్సిన పరిస్థితికి వాళ్ల ఎలా నెట్టబడతారు, సమ్మె తరువాత వాళ్ల ఎలా మారతారు అనే విషయాలను– వంద ఎకనామిక్, పొలిటికల్ సైన్స్ పుస్తకాలు వివరించలేనంత సరళంగా రచయిత్రి ఈ పుస్తకంలో వివరించారు. యాజమాన్యాన్ని ఎదుర్కోవటమే కాదు, సమ్మెకాలంలో ఇంట్లో పితృస్వామ్యాన్ని ఎలా ఎదుర్కొన్నారో, ఎదుర్కొనే బలం వారికి ఎక్కడ నుండి వస్తుందో కూడా చక్కగా అరటిపండు వలిచి చేతికిచ్చినట్లు చెప్పారు.

బతుకీడ్చటానికి నిరంతరం శ్రమిస్తూ, నాలుగ్గోడల మధ్య బతుకుతున్న సయ్యదా కుటుంబం– ఆ గోడలను బద్దలు కొడుతూ కమ్ముకుని, చొచ్చుకొని వచ్చే బయటి రాజకీయ, ఆర్థిక పెనుమార్పుల నుండి తప్పించుకోగలదా? మసీదులు కూలిపోతుంటే 'ప్రార్థనకు నాకు అనుమతి ఇవ్వని మసీదు కూలిపోతే ఏమిలే' అని సయ్యదా కూతురు రేష్మ అనుకోవచ్చు. కానీ అది మసీదు మీద ద్వేషం కాదు, మనుషులను విభజించే కుట్ర అని తెలుసుకోవటానికి ఎక్కువ కాలం కావాలా?

కూలిపోయిన శకలాల నుండి జీవితాన్ని పునర్నిర్మించుకోవటంలో నిష్ణాతురాలైన సయ్యదా– లవ్ జిహాద్‌ల నుండీ, డిమానిటైజేషన్ నుండీ, జిఎస్టీ విధింపు నుండీ, ఎన్ఆర్‌సీ ఉద్యమం అయ్యాక ఈశాన్య ఢిల్లీలో జరిగిన మారణకాండ నుండీ, కోవిడ్ 19 కాలంలో జరిగిన విస్థాపన నుండీ బతికి బట్టకట్టి, టిఫిన్ చేతబట్టి, ఢిల్లీ ట్రోనికా సిటీకి పని పోవటానికి బస్‌స్టాండ్‌కు బయలుదేరటంతో కథ ముగుస్తుంది. అప్పటికే మొదలైన ఇంకో కొత్త తరహా శ్రామికురాలు ఆమె కూతురు రేష్మ కథ – 'వెలిగిపోతున్న ఇండియా' రాజధానిలో మరో చోట ప్రారంభం అవుతుంది.

చదువరులకు జ్ఞానాన్ని ఇవ్వటమే కాదు, దృక్పథాన్ని మార్చే శక్తి ఉన్న విలువైన పుస్తకం ఇది.

■ రమాసుందరి



మిక్కిలి దుఃఖ భాజకం

ఇక్కడే ఆగిపోతే
నేను నదిని ఎట్లా అవుతాను
ఇక్కడే గలగల మాట్లాడకపోతే
నేను సెలయేరు ఎలా అవుతాను

కొన్ని లేత ఆకుపచ్చ కలలని
కూడా మోసుకు రాకుంటే
కొన్ని గులకరాళ్ళని
వెంట తీసుకురాకుంటే
నేను ప్రవాహాన్ని ఎట్లా అవుతాను

నా ఒడ్డు ఇరువైపులా
వెలసిన గ్రామాలు పట్టణాలు నగరాలు
నాలో దోసిలితో దాహాన్ని తీర్చుకుంటూ
గంగమ్మ గంగయ్యలై మురిసి పోతారు
నేను పాల నురగలా నవ్వులతో
దీవించి కదిలి పోకుంటే
రెండు చేతులెత్తి శనార్తి ఎలా పెడుతారు
పరిగెత్తి చేన్లను పండించకుంటే
నేను పంట కాలువను ఎలా అవుతాను
అన్నమై గంజి గట్కై ఆకలి తీర్చకుంటే
నేను కట్ట మైసమ్మను ఎలా అవుతాను

ఎల్లలను కాపాడకుంటే
నేను ఎల్లమ్మను ఎలా అవుతాను
ప్రజలను రక్షించకుంటే
నేను పోచమ్మను ఎలా అవుతాను

నడిచి నడిచి ఆగిపోతే
నా పేరు ప్రాజెక్టు అవుతుంది
పరిగెత్తి పరిగెత్తి అలసిపోతే
నా రూపం చెరువు అవుతుంది

లక్షలాది ఏళ్లుగా కూడబెట్టిన
ఇసుక ఐశ్వర్యాన్ని దోచుకున్నారు
గుట్టల్ని నమిలి వేసి అడవుల్ని కొట్టేసి
జీవధాతువును పగలే కాజేసారు

మిక్కిలి దుఃఖ భాజకమేమంటే
నది పేరు మారక పోవడం
నది చిరునామా ఏమారక పోవడం

■ జూకంటి జగన్నాథం


పసి పద్యం

చెలకలన్నీ కలెదిరిగి
పరిగె ఏరుకొచ్చి
చేతివేళ్ల చర్మం వొల్సుకపోతే
రాలిన మక్క ఇత్తులే
నా అక్షరాలు

నాయిన వలసబోతే
అమ్మ నాట్లేయవోతే
సాయంత్రం బడి యిడ్సినంక
బోరింగ్ కాన్నుంచి
నీళ్ల మోసుకొచ్చిన
గులాబీ పాదాలే
నా యీ కవితా పాదాలు

కట్టెల పొయ్యి మీద
వంట జేస్తున్న అమ్మకు
కట్టెలు ఎగనూకుతూ
నే దోసిలి వట్టిన
అమ్మ నొస్టి మీద రాలుతున్న
సెమట పలుకులే
నా సరళ అలంకార శిల్పం

ఎండాకాలం సెలవులల్లా
మట్టిల కంకరమాలు కల్పుతూ
ఎగశ్వాస దిగశ్వాస
దీసుకుంటున్నపుడు
నా ఎనిమిదో తరగతి గుండె కొట్టిన డప్పె



నా కవితకు అంతర్ లయ


పదిలా మండలంలా
సెకండొచ్చినా
ఏ భువనగిరికో, నాందేడుకో
పారకాడుగా పంపుతూ
బస్టాండ్‌లో నాయిన కార్చిన కన్నీళ్లే
నా కవిత్వంకు తడి

పుట్టిన రోజని
పించన్ పైసల్తో
కొత్త బట్టలు కొనుక్కోమనే

నాయిన లాంటి ఆరివారమున్నా
చుట్టూరా జీవితాలే
నా కవితా వస్తువులు

సల్ల సలికాలంలా
వోకిట్ల పయ్యంతా తూట్లు వడ్డ దుప్పటిలో
కాళ్లు ముడ్సుక పడుకున్న
పసితనమే నా కవిత్వం

■ అతినారపు హరిశంకర్
© 88863 63249







కృష్ణానదిలో మంగళాద్రి లక్ష్మీ నృసింహుని తెప్పోత్సవం

వైభవంగా నృసింహుని తెప్పోత్సవం



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ తదితరులు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి తెప్పోత్సవం ఆదివారం కృష్ణా నదిలో వైభవంగా జరిగింది. మంగళగిరి నుంచి స్వామివార్లను తాడేపల్లిలోని శ్రీమద్విరాంజనేయస్వామి ఆలయానికి తీసుకురాగా అర్చకులు వైకానస ఆగమా నుసారం విశేష అభిషేకాలు నిర్వహిం చారు.మధ్యాహ్నం దేవస్థానం నుంచి స్వామివారు ఊరేగింపుగా కృష్ణానది వరకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన ఫంట్‌పై స్వామివార్లను అధిష్టింప జేసి పుష్పాలతో శోభాయమానంగా అలంకరిం చారు. బంగారు గరుడ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతుడైన నృసింహుడిని భక్తులు దర్శించుకుని తరించారు. ఉండవల్లి కరకట్ట నుంచి ప్రారంభమైన తెప్పోత్సవం విజయవాడ దుర్గా ఘాట్ వరకు సాగింది. అక్కడ విజయవాడ ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకు రాలు కనకదుర్గమ్మ తరపున ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ధర్మకర్తల మండలి సభ్యులు, ఈవో శీనానాయక్ స్వామివారికి స్వాగతం పలికారు. ఆలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివార్లు ప్రత్యేక వాహనంలో మంగళగిరి ఆలయానికి చేరుకున్నారు. దేవస్థానం ఈవో కోగంటి సునీల్, కైంకర్యపరులు పర్యవేక్షించారు.

27న ఏపీ ఎన్జీవో సంఘం ఎన్నికలు

- 8న నామినేషన్ల స్వీకరణ
- ఎన్నికల అధికారి రామారాయుడు

విజయవాడ (గాంధీనగర్), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో రాష్ట్ర కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 27న ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారి ఆచంట రామారాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష, సహాధ్యక్ష, 12 మంది ఉపాధ్యక్షులు, ఉపాధ్యక్షురాలు, ప్రధాన కార్యదర్శి, కార్యనిర్వాహణ కార్యదర్శి, ప్రచార కార్యదర్శి, ఐదుగురు కార్యదర్శులు, మహిళా కార్యదర్శి పదవులకు ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. 2న ఏపీ ఎన్జీవో రాష్ట్ర సంఘ కార్యాలయంలో ఓటర్ల తుది జాబితా ప్రదర్శిస్తామని, 8వ తేదీ ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని, పరిశీలన అనంతరం 3 గంటలకు అర్హత కలిగిన అభ్యర్థులను ప్రకటిస్తామని వెల్లడించారు. 9వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట లోపు నామినేషన్ల ఉపసంహరణ గడువు అని, ఆ తర్వాత తుది జాబితా ప్రకటిస్తామని ఆయన వివరించారు. ఒక పోస్టుకు ఒకరి కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే 27న ఎన్నికలు నిర్వహించి, విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ ఫీజు వెయ్యి రూపాయలు చెల్లించాలని, ఆర్.ల్యాకు సహాయ ఎన్నికల అధికారిగా, సీహెచ్ పురుషోత్తమ నాయుడు ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

● హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్..

హైస్పీడులో అభివృద్ధి

- అమరావతి, గుంటూరు మీదగా ఎలైన్‌మెంట్
- బడ్జెట్‌లో చేర్చిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- అమరావతి అభివృద్ధికి రూ.1,129 కోట్లు

గుంటూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హైస్పీడ్ రైల్ కారిడార్‌లో హైదరాబాద్ - చెన్నై వయా అమరావతి, గుంటూరు సెక్షన్‌ని కేంద్ర ప్రభుత్వం చేర్చింది. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు ప్రతిపాదన దశలో ఉండగా ఆదివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ 2026-27 బడ్జెట్‌లో చేర్చడంతో ఇక ఈ ప్రాజెక్టు పట్టాలెక్కడమే తరువాయిగా మారింది. ఆర్థిక మంత్రి తన బడ్జెట్ సంక్షిప్త ప్రసంగంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. పర్యావరణ సుస్థిర ప్రయాణ వ్యవస్థల ఏర్పాటులో భాగంగా ఈ హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మిస్తామని ప్రకటించారు. దీంతో త్వరలోనే డీపీఆర్ రూపొందించి, ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్రం ప్రారంభిస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే ఇది ఎలివేటెడ్ హైస్పీడ్ రైల్ కారిడార్ కావడం వల్ల భారీ ఎత్తున భూసేకరణ చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు సంపూర్ణం కావడానికి పదేళ్లయినా పట్టొచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రాజెక్ట్ నిర్మాణం ఇలా..

హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్‌లో భాగంగా తొలుత హైదరాబాద్ - శంషాబాద్ మధ్యన 38.5 కిలోమీటర్ల పొడవునా ట్రాక్ నిర్మిస్తారు. మొత్తంగా ఇది 744.5 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. హైదరాబాద్ - శంషాబాద్ - నార్కెడ్‌పల్లి - సూర్యాపేట - ఖమ్మం/కోదాడ - అమరావతి- గుంటూరు - చీరాల - ఒంగోలు - నెల్లూరు - గూడూరు - సూళ్లూరుపేట - చెన్నై వరకు నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టులో రెండు వరుసల రైలు మార్గాలు, లూప్‌లైన్లు

(మిగతా 6లో)

అమరావతికి.. రూ.1,129 కోట్లు

రాజధాని అమరావతికి కేంద్ర బడ్జెట్లో రూ.1,128.91 నిధులను కేటాయించారు. వీటిని రాజధాని నిర్మాణం, అభివృద్ధి కోసం వినియోగించనున్నారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు ద్వారా నిధులు సమకూర్చనున్నారు. వీటిలో ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఐడీబీఆర్) కింద రూ.402.09 కోట్లు కేటాయించారు. ఈ నిధులను రాజధానిలో మౌలిక వసతుల కల్పనకు వినియోగించనున్నారు. కాగా, రాజధానిలో కొలువుదీరిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి కేంద్ర బడ్జెట్లో పరిశోధన నిధిని మంజూరు చేశారు. అణు ఇంధన శాఖ నుంచి ఈ నిధులు అందజేస్తారు. వీటిని అంతరిక్ష పరిశోధనకు వినియోగించనున్నారు.



రాజమండ్రి సెంట్రల్ జైలుకు

అంబటి

- సీఎంను దూషించిన కేసులో 14 రోజుల రిమాండ్
- ఎస్ఐపై దౌర్జన్యం కేసులో నోటీసులు
- కోర్టుకు హాజరు నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత



అంబటి రాంబాబును రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలిస్తున్న పోలీసులు



పోలీసుల భారీ బందోబస్తు

గుంటూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా మహిళలను, విధుల్లో ఉన్న పోలీసులను బెదిరించిన కేసులో అరెస్టయిన మాజీ మంత్రి అంబటి రాంబాబుకి 14 రోజుల రిమాండ్ విధిస్తూ మేజిస్ట్రేట్ ఆదేశాలిచ్చారు. గుంటూరులోని స్పెషల్ మొబైల్ కోర్టులో రాత్రి 8:37 గంటలకు ఆయనను హాజరు పరచగా.. రాత్రి 10:30 గంటలకు వాదనలు ముగిశాయి. ప్రాసిక్యూషన్ తరపున విజయలక్ష్మి, అంబటి తరపున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న మేజిస్ట్రేట్ స్రవంతి రాత్రి 11:30 గంటలకు అంబటికి రిమాండ్ విధిస్తూ ఆదేశాలిచ్చారు. అయితే శాంతిభద్రతల నేపథ్యంలో గుంటూరు జిల్లా జైలుకు కాకుండా.. రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని అంబటి కోరడంతో..ఈ మేరకు మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. నల్లపాడు ఎస్ఐ రామకృష్ణపై దౌర్జన్యం కేసులో అంబటికి నోటీసులు ఇవ్వగా.. సీఎం చంద్రబాబును దూషించిన కేసు(క్రైమ్ నంబరు 76/26)లో రిమాండ్ విధించారు. అంబటి రాంబాబుపై మొత్తం 20 కేసులున్నాయని అందులో పోలీసులపై దౌర్జన్యం కేసులు 7 ఉన్నాయని, చట్టం తెలిసిన వ్యక్తిగా ఆయన ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నారని ప్రాసిక్యూషన్ తరపున న్యాయవాదులు వాదించారు. అయితే అంబటి రాంబాబు మాజీ మంత్రి, ఎమ్మెల్యే అని, 70 ఏళ్ల వయస్సు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయనకు 41ఏ నోటీసులు ఇవ్వాలని ఆయన తరపున న్యాయవాదులు మేజిస్ట్రేట్‌ను అభ్యర్థించారు. అయితే సీఎంను అంబటి దూషించిన వీడియోలను సాక్షాధారాలతో సహా మేజిస్ట్రేట్ ముందు ఉంచడంతో.. రిమాండ్ తప్పలేదు. ఈ నేపథ్యంలో నల్లపాడు, పట్టాభిపురం సీఐలు తనను శారీరకంగా వేధించారని అంబటి రాంబాబు మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన స్టేట్‌మెంట్‌ను మేజిస్ట్రేట్ నమోదు చేసుకున్నారు. ఈ విషయాన్ని జీజీహెచ్‌లో వైద్య పరీక్ష సమయంలో అంబటి వెల్లడించలేదు. కోర్టు ఉత్తర్వులతో వైసీపీ తరపు న్యాయవాదులు కోర్టు బయట హల్‌చల్ చేశారు. శాంత్రిభద్రతల నేపథ్యంలో పోలీసులు కోర్టు పరిసరాల్లో వ్యక్తులను బయటకు పంపారు. కోర్టు నుంచి అంబటిని నేరుగా పోలీసులు జిల్లా పోలీస్ కార్యాలయానికి తరలించారు. అక్కడి నుంచి ప్రత్యేక బందోబస్తుతో ఆయనను రాజమండ్రికి తరలించారు.

పటిష్ట భద్రత

టీడీపీ శ్రేణుల తిరుగుబాటు నేపథ్యంలో శనివారం అరెస్టయిన అంబటి రాంబాబుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిసరాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లతో సెంట్రీ ఉంచారు. అనుమతి లేకుండా ఎవరినీ పోలీస్ స్టేషన్‌లోకి అనుమతించ లేదు. స్టేషన్ మార్గంలో మూడు చోట్ల చెక్ పోస్టులు పెట్టారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ నుంచి అంబటి రాంబాబును ఆదివారం సాయంత్రం కోర్టుకు హాజరు పరిచేందుకు పటిష్ట భద్రత కల్పించారు. వైద్య పరీక్షల నిమిత్తం తొలుత జీజీహెచ్‌కు తరలించారు. అంబటి రాంబాబును తరలిస్తున్న వాహనానికి ముందు, వెనుక పెట్రోలింగ్ వాహనాలు ఏర్పాటు చేశారు. అంబటి వాహనంలో పదిమంది స్టోన్‌గార్డ్స్ ఉన్నారు. ఆసుపత్రి, కోర్టు వద్ద అంబటిని వాహనం నుంచి దించినప్పుడు గార్డ్స్ వలయంగా ఏర్పడి లోనికి తీసుకువెళ్లారు.

కోర్టుకు మాజీ మంత్రి రజిని, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

గుంటూరులోని స్పెషల్ మొబైల్ కోర్టు పరిసర ప్రాంతాల్లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి విడదల రజిని కోర్టు హాల్లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వైసీపీకి సంబంధించిన న్యాయవాదులు వారిపై తిరగ బడ్డారు. ఈ సందర్భంగా పోలీసులకు, న్యాయ వాదులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన వెస్ట్ డీఎస్పీ అరవింద్.. రజినీని మాత్రమే అనుమతించారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అక్కడికి వచ్చారు. పది నిమిషాలకు రజిని వెళ్లిపోయారు. అలాగే కోర్టు వద్దకు అంబటి రాంబాబు భార్య, ఇద్దరు కుమార్తెలు వచ్చారు. కోర్టులో వాదనలు జరిగి జడ్జిమెంట్ ఇచ్చేంత వరకు వారు అక్కడే ఉన్నారు.





గుంటూరు కలెక్టరేట్‌లో న్యాయాధికారుల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గీత మిట్టల్

అన్ని కోర్టుల్లో వీడబ్ల్యూడీ కేంద్రాలను నెలకొల్పాలి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గీత మిట్టల్

6



జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ప్రసంగిస్తున్న ఏఐకేఎస్ ఫైనాన్స్ సెక్రటరి కృష్ణప్రసాదు, వేదికపై రైతు సంఘాల నాయకులు తదితరులు

కార్పొరేట్ల నుంచి వ్యవసాయాన్ని కాపాడదాం

- ఏఐకేఎస్ ఫైనాన్స్ సెక్రటరి కృష్ణప్రసాదు
- ఘనంగా ముగిసిన అఖిలభారత కిసాన్ సభలు

నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా సాయికుమార్

- ఏకగ్రీవంగా న్యాయశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

- విజ్ఞాన్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొ. కృష్ణకిషోర్
- సందడిగా విజ్ఞాన్ బాల మహోత్సవ్

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

లారీ ఢీకొని మహిళా కూలీ మృతి

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ ప్రయోగ పరీక్షలు

6



శ్రీనివాసుడు- పద్మావతి కల్యాణం చేస్తున్న వేద పండితులు

వేడుకగా శ్రీనివాస కల్యాణం

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం ఆదివారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వివాహ వేదికపై వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి, పద్మావతి అమ్మవార్లకు వెంకటేశ్వర భక్త బృందం ఘనంగా వివాహ వేడుకలు నిర్వహించింది. గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కుటుంబ సమేతంగా స్వామివారి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నగరంలోని భక్తులు వేలాదిగా పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించి, తరించారు.



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ కోవెలమూడి దంపతులు

సీనియర్స్ విభాగంలో కడప జిల్లా ఎడ్లు ప్రథమం

● జూనియర్స్ విభాగంలో వేటపాలెం ఎడ్లకు మొదటిస్థానం ● మాచవరంలో ముగిసిన ఎడ్ల పోటీలు



బండలాగుతున్న మొదటి స్థానం సాధించిన కడప ఎడ్లు

మాచవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మాచవరం మండలం మోర్జంపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి 70వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ఆదివారం ముగిశాయి. ఆదివారం నిర్వహించిన సీనియర్స్ విభాగంలో వైఎస్ఆర్ కడప జిల్లా పొద్దుటూరు మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన మార్తాల చంద్ర ఓబులరెడ్డి ఎడ్లు 3042.9 అడుగుల దూరాన్ని బండను లాగి మొదటి స్థానంలో నిలిచాయి. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన సుంకు సురేంద్రరెడ్డి ఎడ్లు 3013.7 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో, నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బొర్రెడ్డి కేశవరెడ్డి ఎడ్లు 3002.9 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో, ఎన్‌టీఆర్ జిల్లా గన్నవరం గ్రామానికి చెందిన కాసరనేని రాజ, వల్లభనేని మోహనరావు ఎడ్లు 2864 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో, ప్రకాశం జిల్లా టంగుటూరు గ్రామానికి చెందిన మక్కెన కోటేశ్వరరావు, కృష్ణా జిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన మేక కృష్ణమోహన్ కంబైన్డ్ జత 2803.8 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో, వైఎస్ఆర్ కడప జిల్లా పొద్దుటూరు మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన మార్తాల చంద్ర ఓబులరెడ్డి ఎడ్లు 2727.3 అడుగుల దూరాన్ని లాగి ఆరో స్థానంలో, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు 2292.10 అడుగుల దూరాన్ని బండను లాగి ఏడో స్థానంలో నిలిచాయి. వీరికి వరుసగా రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ బుల్లెట్ బండి, హెచ్‌ఎఫ్ డీలక్స్ హీరో కంపెనీ మోటారు సైకిల్, రూ 60వేలు, రూ 40వేలు, రూ 30వేలు, రూ 20వేలు, రూ 10వేలు నగదుతో పాటు షీల్డ్ బహూకరించారు.

● జూనియర్స్ విభాగంలో వేటపాలెం ఎడ్లు

జూనియర్స్ విభాగంలో బాపట్ల జిల్లాకు చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు 3210 అడుగుల దూరం బండను లాగి మొదటి స్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లాకు చెందిన విప్పర్ల చిన వెంకటేశ్వర్లు ఎడ్లు 2780 అడుగుల దూరం లాగి రెండో స్థానంలో, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు గ్రామానికి చెందిన పోతిన దీక్షిత్ చౌదరి ఎడ్లు 2,400 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో, గుంటూరు పట్టణానికి చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్లు 2337.6 అడుగుల దూరాన్ని లాగి నాలుగో స్థానంలో, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండవారిపాలెం గ్రామానికి చెందిన పెద్ది మురళీకృష్ణ ఎడ్లు 2305.6 అడుగుల దూరాన్ని లాగి ఐదో స్థానంలో, పల్నాడు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన నీలం స్రవంతి, త్రివేణి నాయుడు ఎడ్లు 2010.6 అడుగుల దూరాన్ని బండను లాగి ఆరో స్థానంలో నిలిచాయి. వీరికి వరుసగా రూ.55వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు నగదు బహుమతితో పాటు షీల్డ్ బహూకరించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా దుర్గి గ్రామానికి చెందిన గూడా శ్రీనివాసరావు వ్యవహరించారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

● విజ్ఞాన్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొ. కృష్ణకిషోర్
● సందడిగా విజ్ఞాన్ బాల మహోత్సవ్



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడా, సాంస్కతిక కళారంగాలకు సమ ప్రాధానమివ్వాలని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ (వీసీ) ఆచార్య కేవీ కృష్ణకిషోర్ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు నిర్వహిస్తున్న బాలమహోత్సవ్‌లో భాగంగా రెండోరోజు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించాలని సూచించారు. శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువుపై దృష్టి పెట్టినప్పుడే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా ఉత్సాహంగా ఉంటారని చెప్పారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు బాలోత్సవ్ వేడుకలో పాల్గొన్నారు. విద్యార్థులకు 50కిపైగా క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, చెస్, అథ్లెటిక్స్‌తో పాటు క్లాసికల్ డాన్స్, సోలో, వెస్ట్రన్, ఫోక్, గ్రూప్ డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, పాల్గొన్నారు. బాలోత్సవ్ వేడుకలు నేటితో ముగియనున్నాయని ఇన్‌చార్జి వీసీ ఆచార్య కేవీ కృష్ణకిషోర్ వెల్లడించారు.

అంబటి.. నీ డ్రామాలు ఆపు

● పొర్లు దండాలు పెట్టినా జగన్ సీఎం కాలేడు
● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అంబటి రాంబాబు ఇకనైనా డ్రామాలు ఆపాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆయన నోరు అదుపులో ఉంచుకోవాలని హితవు పలికారు. ఆదివారం మాచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, నోరు జారితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పొర్లు దండాలు పెట్టినా జగన్ మళ్లీ సీఎం కాలేడని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుంటే వైసీపీ నేతలు ఓర్వలేక కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగజేయాలని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచాలని శ్రమిస్తుంటే వైసీపీ నేతలు రాష్ట్రంలో విధ్వంసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతలు కులాలు, మతాలు మధ్య చిచ్చుపెట్టాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌రెడ్డి రాష్ట్రంలో వ్యవస్థలను నాశనం చేశారని, కల్తీ నెయ్యితో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజభోయిన మల్లీశ్వరి మధుసూదన్ యాదవ్, యాగంటి మల్లికార్జునరావు, యెనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, కళ్లం రామాంజిరెడ్డి, కూనిశెట్టి వెంకటేశ్వర్లు మద్దిగపు వెంకట్రామిరెడ్డి, వజ్రం నాయక్, ఓర్సు క్రాంతికుమార్ తదితరులున్నారు.

5,900 మిర్చి టిక్కీలు అమ్మకం

దాచేపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం 6,700 మిర్చి టిక్కీలు రాగా 5,900 మిరప టిక్కీలు అమ్మకం జరిగాయి. 334 రకం రూ. 10వేలు నుంచి రూ. 20వేలు, తేజా రకం రూ. 9వేలు నుంచి రూ. 19వేలు, తాలు కాయలు రూ. 3వేలు నుంచి రూ 9. వేలకు అమ్మకం జరిగాయి.

రెంటచింతలలో ఆసక్తిగా ఎడ్ల పోటీలు

● జూనియర్స్ విభాగంలో అనంతపురం ఎడ్లజత ప్రథమం

రెంటచింతల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కానుకమాత 176 తిరునాళ్లను పురస్కరించుకొని మండల కేంద్రమైన రెంటచింతలలో ఆదివారం జరిగిన జూనియర్స్ విభాగంలో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ఆసక్తిగా కొనసాగాయి. పోటీలో 11 ఎడ్లజతలు పాల్గొన్నాయి. అనంతపురం జిల్లా సింగనమల మండలం ఎద్దు రవీంద్రనాథ్ రెడ్డికి చెందిన ఎడ్లజత 2908.8 అడుగుల దూరం బండను లాగి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం బొర్రముక్క కౌసల్యరెడ్డి చెందిన ఎడ్లజత 2573.7 అడుగుల దూరం బండను లాగి రెండోస్థానం, బాపట్ల జిల్లా వేటపాలెం ఆర్కే బుల్స్ అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్లజత 2450 అడుగుల దూరం బండను లాగి మూడోస్థానం, పల్నాడు జిల్లా పమిడి మర్రు ఎర్రసాని సుబ్బయ్యకు చెందిన ఎడ్లజత 2428.11 అడుగుల దూరం లాగి నాలుగోస్థానం, గుంటూరు జిల్లా కాకుమాను మండలం పోతిన లక్షిత్‌చౌదరికి చెందిన ఎడ్లజత 2230.2 అడుగుల దూరం లాగి ఐదోస్థానం దక్కించుకున్నాయి. మొదటి బహుమతి రూ.లక్షను బోయపాటి రాయపరెడ్డి కుటుంబసభ్యులు అందించారు. ఆదివారం వరకు 108 ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ నెల 3వ తేదీన సీనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నాయి. కానుకమాత కోడెగిత్తల నిర్వాహకులైన వైఎల్ మర్రెడ్డి, ఏరువ జోజిరెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, ఎం శౌర్రెడ్డి, రాయపరెడ్డి, జోసఫ్‌రెడ్డి, వైఎఫ్ మర్రెడ్డి, రాజేష్‌రెడ్డి, కోటిరెడ్డి, ఇన్నారెడ్డి, రంజిత్‌రెడ్డి, గాదె కస్పారెడ్డి ఈ పోటీలను పర్యవేక్షిస్తున్నారు.



ప్రథమ బహుమతిని సాధించిన అనంతపురం ఎడ్లజత

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	158, 167, 178
చికెన్ విత్ స్కిన్(కిలో)	306.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	316.00

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ ప్రయోగ పరీక్షలు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 126 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు ఉదయం 4,754 మంది విద్యార్థులకు గాను 4,612 మంది హాజరయ్యారని, 142 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ బోర్డు ఆర్ఐవో జి.సునీత వెల్లడించారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు మొత్తం 3,610 మంది హాజరు కావాల్సి ఉండగా 3,528 మంది హాజరయ్యారని, 82 మంది గైర్హాజరయ్యారని ఆమె తెలిపారు.

దేశం అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగేలా బడ్జెట్

● ఎమ్మెల్యే ఆనందబాబు



ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారతదేశం ఎదిగేందుకు ప్రస్తుత కేంద్రం బడ్జెట్ ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అభిప్రాయపడ్డారు. ప్రజలు కోరుకునే గ్రోయింగ్ ఎకానమీని బడ్జెట్ ప్రతిబింబచేస్తుందన్నారు. రైతులు, మహిళలు, యువతకు ప్రాధాన్యముందని, మ్యానుఫ్యాక్చరింగ్ ఎంఎస్ఎంఈలకు అధిక ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. హైస్పీడ్ రైలు, ఎర్త్ మినరల్స్ కారిడార్‌లతో ఏపీకి పెద్ద ఊతమిచ్చారన్నారు. అమరావతి రాజధాని రూపకల్పనకు బడ్జెట్ ద్వారా మేలు చేకూరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రధాని మోదీకి, కూటమి ప్రభుత్వం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ బడ్జెట్ ద్వారా ఏపీకి గణనీయమైన ప్రయోజనాలు చేకూరుతాయన్న అభిప్రాయాన్ని ఆదివారం ఆంధ్రజ్యోతితో మాట్లాడూతూ వ్యక్తపరిచారు.

అన్ని కోర్టుల్లో వీడబ్ల్యూడీ కేంద్రాలుండాలి

● సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గీత మిట్టల్



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జస్టిస్ గీత మిట్టల్

గుంటూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): లైంగిక నేరాల బాధితుల కోసం అన్ని కోర్టుల్లో వీడబ్ల్యూడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు వల్నరబుల్ విట్నెస్ కమిటీ చైర్‌పర్సన్ జస్టిస్ గీత మిట్టల్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నియమించిన వల్నరబుల్ విట్నెస్ కమిటీ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వల్నరబుల్ విట్నెస్ సెంటర్ల కమిటీ సహకారంతో ఆదివారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో న్యాయాధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ గీతా మిట్టల్ మాట్లాడుతూ, వల్నరబుల్ సాక్షులకు అనుకూలమైన కోర్టు వాతావరణాన్ని కల్పించడమే కమిటీ లక్ష్యమని చెప్పారు. నిందితుడి హక్కులకు భంగం కలగకుండా న్యాయమైన వాంగ్మూలం అందేలా చూడాలని పేర్కొన్నారు. న్యాయ తీర్పులను పోలీసులు, వైద్యులు, న్యాయాధికారులు తప్పనిసరిగా పాటించాలని ఆమె తెలిపారు. గుంటూరుకు విచ్చేసిన జస్టిస్ గీత మిట్టల్‌కు జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.కల్యాణ చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వల్నరబుల్ విట్నెస్ డిపోజిషన్ సెంటర్ల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్ రఘునందన రావు, జస్టిస్ వి.సుజాత, జస్టిస్ ఎస్.సమత, జస్టిస్ వి.గోపాల కృష్ణ, జస్టిస్ కిరణ్మయి, జిల్లా ప్రధాన న్యాయాధికారి బీ కల్యాణచక్రవర్తి, ఇతర జిల్లాల ప్రధాన న్యాయాధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

హైస్పీడులో అభివృద్ధి

● (5వ పేజీ తరువాయి)

ఉంటాయి. ఈ ప్రాజెక్టు అంతా పూర్తయితే చెన్నై నుంచి అమరావతి మీదగా హైదరాబాద్‌కు వేగవంతంగా ప్రయాణం చేయొచ్చు. అలానే మార్గ మధ్యలోని రైల్వేస్టేషన్ల నుంచి రాజధాని నగరాలకు సులభతరంగా ప్రయాణించే అవకాశం ఉంటుంది. దేశంలో ప్రథమంగా ఇలాంటి హైస్పీడ్ రైల్ కారిడర్ అహ్మదాబాద్ - ముంబై మధ్యన ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఇందులో కొంత భాగం పూర్తి కాగా, అక్కడ హైస్పీడ్ రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ సన్నాహాలు చేస్తోంది.

● తగ్గనున్న ప్రయాణ సమయం..

అమరావతి రాజధాని నగరం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. పదేళ్లలో ఒక విశ్వనగరంగా అభివృద్ధి చేసి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవలే ప్రకటించారు. అవుటర్ రింగు రోడ్డు, ఇన్నర్ రింగురోడ్డు, స్ట్రయిట్ రోడ్లు, వయా డక్ట్‌లు వంటివి నిర్మిస్తున్నారు. ఇవన్నీ.. నిర్మాణం పూర్తి కావడానికి కొంత సమయం పడుతుంది. ఈ లోపు హైస్పీడ్ రైల్ కారిడార్ సిద్ధమవుతుంది. దాంతో అప్పుడు హైదరాబాద్ నుంచి గంటలోపే అమరావతికి చేరుకోవచ్చు. అలానే రెండు గంటల వ్యవధిలోనే చెన్నై నగరానికి చేరే అవకాశం ఉంటుంది.

నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా సాయికుమార్

● ఏకగ్రీవంగా న్యాయశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక



న్యాయ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ నాయకులు

గుంటూరు(లీగల్), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం కాకినాడలో ఏకగ్రీవంగా జరిగాయి. సంఘం అధ్యక్షుడిగా పల్లపోతు సాయికుమార్‌ను ఎన్నుకున్నారు. సంఘ ప్రస్తుత అధ్యక్షుడు రామరాజు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా దర్శి శ్రీకాంత్ (గుంటూరు), కోశాధికారిగా అత్తలూరి వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా గోవిందరాజులు నాయుడు, గౌరవ అధ్యక్షుడిగా పి.నాగేశ్వరావు, ప్రధాన సలహాదారుగా కె.మస్తాన్ వలి, ఉపాధ్యక్షుడిగా ఎం.మురళి, ఎన్.కృష్ణారావు, చందక శ్రీనివాసరావు, రావుల నవీన్ కుమార్, ఎస్ చైతన్య (ఏపీ హైకోర్టు), డి.శ్రీధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మల్లంపల్లి రాజేష్, సంయుక్త కార్యదర్శులుగా వై.రామ కృష్ణారావు, రెడ్డి సత్యనారాయణ, ఏ. గురు శివ, సీహెచ్ వి.సంజీవ కుమార్, ఏ. చిరంజీవి, కె.అభి వర్ధన్, అబద్ధం, కె.అక్కులప్పను ఏకగ్రివం గా ఎన్నుకున్నారు. జోనల్ కార్యదర్శులుగా సి.కిరణ్ కుమార్, గేరా నరేష్ , కేవీఎస్. ప్రసాద్, వి.సంతోష్, ఎల్.వంశీ మోహన్, జి.తులసి రామ్ ఎన్నికయ్యారు. ఈ జనరల్ బాడీ సమావేశానికి రాష్ట్రంలోని జిల్లాల నుంచి సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్పొరేట్ల నుంచి వ్యవసాయాన్ని కాపాడదాం

● ఏఐకెఎస్ ఫైనాన్స్ సెక్రటరీ కృష్ణ ప్రసాదు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం తొలగిపోవాలంటే, రైతులు గ్రామ స్థాయి నుంచి ఉద్యమించాలని అఖిలభారత కిసాన్ సభ ఫైనాన్స్ సెక్రటరీ కృష్ణ ప్రసాదు అన్నారు. అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. కిసాన్ సభలో (ఏఐకేఎస్) భాగంగా గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు అధ్యక్షతన కార్పొరేట్ వ్యవసాయం, రైతాంగంపై ప్రభావం అనే అంశంపై జరిగిన సభలో కృష్ణ ప్రసాదు ప్రసంగించారు. పెట్టుబడిదారులు వ్యవసాయ రంగంలో తిష్టవేసి, ఏ పంట వేయాలో రైతులకు నిర్దేశిస్తున్నారన్నారు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందులు వినియోగింపజేసి రైతులను ఆర్థికంగా నష్టపరుస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులకు మేలు చేసేందుకు వారిని చైతన్య పరిచేందుకు అఖిల భారత కిసాన్ సభ గ్రామాల వారీగా పంటల ప్రాతిపదికన రైతులతో ఫెడరేషన్లను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతాంగ కార్మిక వ్యతిరేక నిర్ణయాలపై గ్రామస్థాయి నుంచి ఉద్యమాలు బలపడాలని పిలుపునిచ్చారు. అనంతరం కేంద్ర బహుళ సహకార చట్టం-రైతాంగంపై ప్రభావం అనే అంశంపై రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు వై.కేశవరావు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి సాగునీటి ప్రాజెక్టుల ఆవశ్యకత అనే అంశంపై ఏఐకెఎస్ రాష్ట్ర నాయకులు డి.హరనాథ్ ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతుడు భాను ప్రకాష్ (పాత చిత్రం)

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన దూళ్ళిపాళ్ళ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించి మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, ముప్పాళ్ళ మండలం ముప్పాళ్ళ గ్రామానికి చెందిన కందకడ్ల భాను ప్రకాష్ (38)కు, పెదకూరపాడుకు చెందిన మల్లేశ్వరితో ఏడాదిన్నర క్రితం వివాహ మైంది. సంవత్సర కాలంగా భాను ప్రకాష్ భార్యతో కలసి పెదకూరపాడులో ఉంటున్నాడు. పిడుగురాళ్ళలోని రిలయన్స్ మార్టులో పనిచేస్తూ ప్రతి రోజు రైలులో వెళ్ళి వస్తుంటాడు. రోజు లాగే గత నెల 23న భాను ప్రకాష్ విధులకు వెళ్ళాడు. ఇంటికి రాక పోవటంతో కుటుంబసభ్యులు పిడుగురాళ్ళ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం దూళ్ళిపాళ్ళ సమీపంలో ముళ్ళ పొదల్లో కుళ్ళిపోయిన మృతదేహాన్ని గుర్తించారు. మృతుని ఫోన్, చెప్పులు ఆధారంగా అతను భాను ప్రకాష్ అని నిర్ధారణకు వచ్చారు. మృతునికి దృష్టి లోపం ఉందని, ఫోన్ మాట్లాడుకుంటూ గేటు వద్దకు వచ్చి ప్రమాదవ శాత్తు రైలులో నుంచి జారి పడి మృతి చెంది ఉంటాడని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

పెదకూరపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గేదెల మేత కోసం వెళ్ళి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బలుసుపాడులో ఆదివారం జరిగింది. ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం, బులుసుపాడు గ్రామానికి చెందిన గంజిమాల బాబూరావు (62) ఆదివారం గేదెలకు మేత తీసుకు వచ్చేందుకు గ్రామ శివారులో ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లాడు. మేత కోస్తుండగా ప్రమాదవశాత్తు నీటి కంటలో పడి మృతి చెందాడు. అతని కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఆయన చెప్పారు.

లారీ ఢీకొని మహిళా కూలీ మృతి

యడ్లపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ మహిళా కూలీ మృతి చెందిన ఘటన యడ్లపాడు మండలంలో జాతీయరహదారి కొత్త బైపాస్ మార్గంలో ఆదివారం జరిగింది. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గజిల్లా కడెం తాలూకా బటికరెక్కగౌట్ గ్రామానికి చెందిన బాసర నాగమ్మ (36) ఏడాది కిందట జీవనోపాధి నిమిత్తం చిలకలూరిపేట ప్రాంతానికి వలస వచ్చింది. జాతీయరహదారి కొత్త బైపాస్ మార్గం డివైడర్‌లోని మొక్కలు ఎండిపోకుండా నిత్యం వాటర్ ట్యాంకర్‌ల ద్వారా నీరు తెచ్చి పోసే కూలీ పనులకు వెళ్తోంది. ఆదివారం తిమ్మాపురం పరిధిలో నీళ్లు పోస్తుండగా చెన్నై నుంచి విజయవాడ వెళుతున్న లారీ అతి వేగంతో నాగమ్మను, అనంతరం ట్యాంకర్‌ను ఢీకొట్టి సర్వీసు రోడ్డు మీదుగా ప్రక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రగాయాలపాలయ్యాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను స్థానికుల సహాయంతో గంటన్నరపాటు శ్రమించి బయటకు తీశారు. గాయపడిన అతనిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా అతి వేగంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు. నాగమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


సునీల్ గుప్తాను సన్మానిస్తున్న రామకుమార్, కమల

ఐదు శాతం మంది గర్భిణుల్లో షుగర్ వ్యాధి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల్లో షుగర్ వ్యాధి కేసులు పెరుగుతున్నాయని, వీటి నియంత్రణపై తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ సునీల్ గుప్తా సూచించారు. రామ్‌కుమార్ డయాబెటిస్ అకాడమీ, స్పైల్ డయాబెటిస్ ట్రస్ట్, గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక భారతీయ విద్యాభవన్‌లో మధుమేహంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. అకాడమీ అధ్యక్షుడు, షుగర్ వైద్యనిపుణులు పీవీ రామ్‌కుమార్ అధ్యక్షత వహించారు. సమాజంలో సగటున ప్రతి వంద మందిలో ఐదుగురు గర్భిణులు మధుమేహం బారిన పడుతున్నట్లు డాక్టర్ సునీల్ గుప్తా వివరించారు. వైద్య పరిభాషలో దీనిని జెస్టెషనల్ డయాబెటిస్‌గా పిలుస్తారని ఆయన చెప్పారు. ఇలాంటి వారు ప్రసవం జరిగేంత వరకు వైద్య పర్యవేక్షణలో తగిన చికిత్సలు పొందుతూ రక్తంలో షుగర్ స్థాయి పెరగకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. గైనకాలజిస్టులు కూడా గర్భిణులకు షుగర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిపి, జెస్టెషనల్ డయాబెటిస్ నియంత్రణపై దృష్టి సారించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ, గైనకాలజిస్ట్ డాక్టర్ శకుంతల ఉమా శంకర్, డాక్టర్ విమల, డాక్టర్ పీవీ రామ్‌కుమార్, డాక్టర్ వైవీఎస్ ప్రభాకర్, డాక్టర్ టీ.సేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీకేఆర్-కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలు అభినందనీయం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పీకేఆర్-కేఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్లైవ్ చైర్మన్ పుల్లారావు పేర్కొన్నారు. ప్రముఖ సంఘ సేవకులు, మహాదాత డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు స్మృతి సభ స్థానిక వల్లూరి వారి తోట పీకేఆర్-కేఆర్ ట్రస్ట్ భవనంలో ఆదివారం నిర్వహించారు. ట్రస్టు సభ్యులు తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన ట్రస్టు ప్రెసిడెంట్ కన్నా మాస్టర్ మాట్లాడుతూ గొప్ప ఆశయాలతో డాక్టర్ కోటేశ్వరరావు ఏర్పాటుచేసిన ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు కావలసిన వసతి, భోజన సౌకర్యాలు అందజేసేందుకు నిజాయితీగా, సేవా దృక్పథంతో తమ ట్రస్టు సభ్యులు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు కోట సత్యం, జీసీహెచ్ వీరయ్య, వితిక వాసుదేవరావు, మనసం దామోదర్ ఏసుకొండలు, హైకోర్టు అడ్వకేట్ సంజీవరెడ్డి, యువ న్యాయవాది పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విఆర్ఎస్ అధికారి స్వర్ణం పుల్లారావు

అలరించిన అష్టావధానం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, సీపీఐ కార్యాలయంలో తెలుగు కావ్య మథనం పద్య పాఠశాల తృతీయ వార్షికోత్సవం రెండో రోజు ఆదివారం వైభవంగా జరిగింది. పద్య సంబంధ కార్యక్రమాలతో వార్షికోత్సవం సందడిగా సాగింది. సుప్రసిద్ధ మహిళా అష్టావధాని బులుసు అపర్ణ అష్టావధానం నయనానంద వాణిశ్రీ అధ్యక్షత వహించారు. తిగల సురేష్‌బాబు సంచాలకులుగా వ్యవహరించారు. నిషిద్ధాక్షరిని విట్టు బాబు, సమస్యాపూరణను నడిమింటి మార్కండేయ శర్మ, దత్తపదిని గోలి హనుమత్ శాస్త్రి, వర్ణన నాగులపల్లి శ్రీనివాస్ వ్యస్తాక్షరిని బైరోజు రాజశేఖర్, పురాణ పఠనాన్ని సందూరి వెంకటేశ్వరరాజు, ఆశువును కర్నాటి చంద్రమౌళి నిర్వహించారు. అప్రస్తుత ప్రసంగాన్ని పూసపాటి కృష్ణ సూర్య కుమార్ నిర్వహించారు. అనంతరం సుప్రసిద్ధ పండితులు సహస్రావధాని సూరం శ్రీనివాసులు పద్యరచన వ్యాకరణం మెలకువలు అనే అంశంపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. చిక్రతివాతి సౌరభం గ్రంథ పరిచయాన్ని అలంకారం వెంకటరమణరాజు చేశారు. వేదుల సత్య రమాదేవి, యల్లాప్రగడ సాయి, బైరోజు రాజశేఖర్ తదితరులు కార్యక్రమాలను నిర్వహించారు.


అష్టావధానంలో పాల్గొన్న సాహితీవేత్తలు, కవులు, రచయితలు

సంతు రవిదాస్ బోధనలు ఆచరణీయం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సమానత్వం, ప్రేమ, కరుణ వంటి మానవీయ విలువలను పెంపొందించిన సంతు రవిదాస్ బోధనలు నేటి తరానికి ఆదర్శనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో స్థానిక లాలుపురం వాజ్‌పేయి భవనంలో ఆదివారం సంత్ రవిదాస్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ సన్యాసం సేవలో భక్తి పరవశంతో సాధనలో సంతు ఉండేవారని గుర్తుచేసుకున్నారు. మోర్చా జిల్లా అధ్యక్షుడు దారా అంబేద్కర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మేరీ సరోజినీ, బిట్రా వెంకట శివన్నారాయణ, బీసీ యశ్వంత్, కొత్తూరు వెంకట సుబ్బారావు, వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


సంత్ రవిదాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అలరించిన వీణానాదార్చన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంకిరెడ్డిపాలెం, రామాలయం (పెద్దగుడి)లో ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీభారతి సంగీతనిలయం వ్యవస్థాపక అధ్యక్షురాలు భారతీదేవి శిష్యులు కే. నాగలక్ష్మి, ఎస్ భవానీలు వీణ కచేరీ నిర్వహించారు. పలు కీర్తనలు వీణపై పలికించి అభిమానులను అలరించారు. పాలకమండలి వారు కళాకారులను భారతీదేవిని ఘనంగా సత్కరించారు.


వీణానాదార్చన చేస్తున్న కళాకారులు

అంబటిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలి

- ప్రజాస్వామ్యంలో ఉండటానికి పనికిరాడు
- సీఎంపై వ్యాఖ్యలు పూర్తి కుట్రపూరితం
- ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఎమ్మెల్యే నసీర్, మన్నవ వినతిపత్రం


ఎస్పీ వకుల్ జిందాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, టీడీపీ నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై వెంటనే పీడీ యాక్ట్ ప్రయోగించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ కోరారు. వారు కూటమి నాయకులతో కలిసి ఆదివారం ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందించారు. అనంతరం విలేకర్లతో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు పక్కా ప్రణాళికతో వైసీపీకి చెందిన నాయకులు అంబటి రాంబాబు, జోగి రమేష్, ఇతర కేడర్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా వైసీపీ తప్పులు చేసినప్పుడల్లా డైవర్షన్ పాలిటిక్స్ కోసం పదేపదే కుట్ర పూరితంగా మాట్లాడుతున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేల గురించి ఇష్టమొచ్చిన రీతిలో అంబటి వ్యాఖ్యలు చేస్తూ ఉండటం వెనుక కుట్ర దాగి ఉందని చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా ఇదే తరహా విధానంతో ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసేలా అంబటి రాంబాబు మాట్లాడుతుండటం కేవలం ఉద్దేశపూర్వకమైనదేనని ఎస్పీకి ఆయన వివరించారు. ముఖ్యమంత్రిపై అంబటి రాంబాబు దురహంకార వ్యాఖ్యలు చేసిన వెంటనే, మరో చోట జోగి రమేష్, ఇంకో చోట మరో వైసీపీ నాయకుడు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారన్నారు. దీని వెనుక జగన్ ఉన్నారన్నారు. అంబటి రాంబాబుపై పీడీ యాక్ట్ తోపాటు ఐటీ సెక్షన్లు 678, 66ఈ కింద కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలను కాపాడాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు.

రాష్ట్రంలో అలజడి సృష్టించడానికే అంబటి వ్యాఖ్యలు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అలజడులు సృష్టించడానికి జగన్ రెడ్డి ఆదేశాలతోనే అంబటి రాంబాబు అసభ్యకరంగా మాట్లాడారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన టీడీపీ ముఖ్యనేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబటి రాంబాబు ఉద్దేశ్యపూర్వకంగానే చంద్రబాబుని వ్యక్తిగతంగా, అసభ్యక రంగా, కించపరిచే విధంగా మాట్లాడారన్నారు. వైసీపీ నేత జోగి రమేష్ అండ్ కో బృందం కూడా నారా లోకేశ్‌పైన ఇష్టానుసారంగా మాట్లాడారన్నారు. జగన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాల తో మాత్రమే వైసీపీ నేతలు ఇంత దారుణంగా మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల మధ్య కులాల చిచ్చు పెట్టేవిధంగా వ్యాఖ్యలు చేసిన అంబటిపై కఠినమైన చట్టాలను ప్రయోగించాలని లేనిపక్షంలో చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అంబటి అరెస్టుతో జగన్ మాట్లాడుతూ అన్యాయంగా అంబటిని అరెస్టు చేస్తున్నారని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కొంతమంది కావాలని తనపై కులం పేరుతో దూషిస్తూ మాట్లాడారని మాణిక్యరావు ఆరోపించారు. ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ కుట్రలు ఇంక కొనసాగవని ఇప్పటికైనా మార్పు తెచ్చుకోవాలని హితవు పలికారు. ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ అంబటి కనపడితే జనం కుక్కను కొట్టినట్లు కొడతారని హెచ్చరించారు. వైసీపీ క్షుద్ర రాజకీయ నేతలను రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ అంబటి రాంబాబు కుల రాజకీయాలు చేసి రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు నెలలుగా అంబటి అరెస్టు కోసం తహతహ లాడిపోతున్నాడని, అందులో భాగంగానే కావాలనే చంద్రబాబును, ఆయన తల్లిదండ్రులను తీవ్ర పదజాలంతో దూషించాడని అన్నారు. క్షమాపణలు చెప్పమని కోరిన బీసీ మహిళా ఎమ్మెల్యేని దూషిస్తూ రాళ్లతో దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో చిట్టాబత్తిన శ్రీనివాసరావు, సుఖవాసి శ్రీనివాసరావు, గోళ్ళ ప్రభాకర్, కళ్ళం రాజ శేఖర్ రెడ్డి, చుక్కపల్లి రమేష్, శనక్కాయల రాజకుమారి, తాటి శంకర్, తాళ్ల వెంకటేష్, దివి అనిత, గౌసియా బేగం, లాం నవమి, షేక్ ఫిరోజ్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యరావు, డేగల, మన్నవ, కనపర్తి, చిట్టిబాబు, హరిబాబు, టీడీపీ నేతలు

అంబటిని వైసీపీ నుంచి సస్పెండ్ చేయాలి


కొర్రపాటి సురేష్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిపై అసభ్య పదజాలంతో దాడులకు దిగుతున్న అంబటి రాంబాబును వైసీపీ నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్ డిమాండ్ చేశారు. నగరంపాలెంలో ఆయన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య హత్యగా ముద్ర వేసి.. తప్పు చేసినవాడి పక్షాన వైసీపీ కపట వాదన చేస్తుందని మండిపడ్డారు. వైసీపీ నాయకులకు విషయం లేదు.. విధానం లేదు... విజన్ లేదు... అందుకే బూతులు మాట్లాడడమే రాజకీయంగా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. అంబటిని సస్పెండ్ చేయలేని పక్షంలో తాడేపల్లి వైసీపీ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

వైభవంగా శ్రీసత్యదేవుని రథోత్సవం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీరమా సమేత సత్యనారాయణ స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ, జరిగాయి. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి ఉత్సవమూర్తులకు రథోత్సవం నిర్వహించారు. మంగళవాయిద్యాలు, నామ సంకీర్తన బృందాలు, దేవత వేషధారణలో కళాకారులు, విద్యుత్ దీపకాంతుల నడుమ నగరోత్సవం నగరంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. స్వామికి ఊంజల్‌సేవ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ చావలి గణపతి, ఉత్సవ కమిటీ కన్వీనర్ రాయపాటి సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.


రథోత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, ప్రజలు

వేతన జీవులకు నిరాశ మిగిల్చిన బడ్జెట్


సయ్యద్ చాంద్ బాషా

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ 2026- 2027 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనం లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా అన్నారు. గత సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఆదాయపు పన్ను విధానం అలాగే ఉంచారని, దీంతో ఉద్యోగులకు ఎటువంటి ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఉద్యోగులకు రూ.12 నుంచి రూ.15 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపును ఇచ్చి ఉంటే ఉద్యోగులకు కాస్త ఉపశమనం కలిగేలా ఉండేదని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఛండీహోమం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞానపరిషత్ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం విశ్వశాంతిని కాంక్షిస్తూ ఛండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులచే పది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, ఛండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గోదాకల్యాణం నృత్యరూపకం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గుళ్లపల్లి సుబ్బారావు సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గోదా కల్యాణం కూచిపూడి నృత్యరూపకం ప్రదర్శించారు. తొలుత గుళ్లపల్లి సుబ్బారావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, వేంకటరామశర్మ దంపతులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీనృత్య ఆర్ట్ అకాడమి, విజయవాడ నాట్యాచార్యులు భాగవతుల వెంకటరామశర్మ శిష్య బృందం గోదాకల్యాణం నృత్యరూపకం ప్రదర్శించారు. అనంతరం భాగవతుల వెంకట రామశర్మ దంపతులను, శిష్య బృందాన్ని సత్కరించారు. సంస్థ కన్వీనర్ రాఘవరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కన్నుల పండువగా తిరుపతమ్మ గోపయ్యస్వామి కల్యాణం

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఇన్నర్ రింగ్‌రోడ్డు రెడ్డిపాలెంలో ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. పెద్ద ఎత్తున హాజరైన దంపతులతో సామూహిక పూజలు నిర్వహించారు. స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించుకొని, క్యూలైన్‌లలో బారులు తీరారు. అనంతరం శ్రీలక్ష్మీ తిరుపతమ్మ స్పిరిచ్యువల్, సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గొప్ప అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గాదె సుబ్బారెడ్డి, కోనూరు సతీష్‌శర్మ, గౌరవాధ్యక్షుడు ఈదా సాంబిరెడ్డి, కమిటీ సభ్యులు కంది సంజీవరెడ్డి, ఈదా పరశురామిరెడ్డి, అంచురి సాంబిరెడ్డి, యరసాని రోసిరెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి తదితరులున్నారు.


పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

అంబటి రాంబాబుపై తెలుగు మహిళా నేతల ఫిర్యాదు

గుంటూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు పై తెలుగు మహిళా నేతలు ఆదివారం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎం చంద్రబాబు పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా తెలుగు మహిళ నేతలపై అనుచరులతో దాడి చేయించిన అంబటి రాంబాబుపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. తెలుగు మహిళా నాయకురాలు, న్యాయవాది ముత్తినేని శివలీల, లంకా మాధవి తో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ను కలిసి ఫిర్యాదు చేశారు.

రేపు సాయి మందిర వార్షికోత్సవం

- హాజరుకానున్న ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు
- 70 వేల మందికి అన్న సంతర్పణ ఏర్పాట్లు


వార్షికోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడిలోని భగవాన్ శ్రీసత్య షిరిడీ సాయిబాబా మందిరం 20వ వార్షిక వేడుకలకు ముస్తాబవుతుంది. ఈ నెల 3వ తేదీన వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ముమ్మర ఏర్పాట్లు

సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. వార్షికోత్సవ మహోత్సవానికి గుంటూరు జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి సుమారు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం తెలియజేశారు. సుమారు 70 వేల మంది భక్తులకు అన్న సంతర్పణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 3వ తేదీన ఉదయం 5:30 గంటలకు కాగడ హారతి, 6 గంటలకు పాలాభిషేకం, 8 గంటలకు బాబాకి అన్నాభిషేకం, 9 గంటల నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. వార్షికోత్సవం సందర్భంగా భరతనాట్యం, కూచిపూడి, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి, సినీ కళాకారులచే హాస్యవల్లరి, మిమిక్రీ, మ్యాజిక్ షో వంటి కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.


విద్యార్థులకు ఉపకార వేతనాల చెక్కులను అందజేస్తున్న తులసీ రామచంద్రప్రభు తదితరులు

విద్యార్థి దశ నుంచే ఉన్నత ఆలోచనలతో ముందుకు సాగాలి

- తులసీ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఉన్నత ఆలోచనలతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని తులసీ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు సూచించారు. కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్, అండర్ ప్రివిలేజ్డ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్ అగ్రహారంలోని రామనామక్షేత్రంలో ఆదివారం 270 మంది విద్యార్థులకు రూ.12 లక్షల 12వేల 500లు ఉపకార వేతనాలను తులసీ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు, ట్రస్టు సభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. తులసీ రామచంద్రప్రభు మాట్లాడుతూ తాను చదువుకునే రోజుల్లో కేవలం రూ.16లకు పదో తరగతికి పరీక్ష ఫీజు కట్టలేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నానని, బీటెక్, ఇంటర్ చదివే రోజుల్లో ప్రభుత్వం నుంచి రూ.450లకు ఉపకారవేతనాలతో చదువుకున్నానన్నారు. తాను జీవితంలో స్థిరపడ్డాక మరలా తిరిగి సమాజానికి ఇవ్వాలనే ఉద్దేశంతో 1995-96లో ఇద్దరు విద్యార్థులతో మొదలుపెట్టి నేటికి సుమారు 40వేల మంది విద్యార్థులకు రూ.23 కోట్లు ఉపకార వేతనాలను కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ట్రస్టు ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో మేజర్ కాంట్రిబ్యూషన్ తులసీ సీడ్స్ సమకూరుస్తుందన్నారు. ఏటుకూరు మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య మాట్లాడుతూ తులసీ రామచంద్రప్రభు నిస్వార్థంగా కొన్ని కోట్ల రూపాయలను ఉపకార వేతనాలుగా అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులను రామ చంద్రప్రభు సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నారదాసు శ్రీహరిరావు, తోట శంకరరావు, తిమ్మిశెట్టి నారాయణరావు, పసుపులేటి రమణయ్య, అంకిరెడ్డి సాంబశివరావు, నారదాసు కోటేశ్వరరావు, పుచ్చకాయల ఆనంద్, కణదం నరేంద్రనాద్, బళ్ళా నరేంద్ర, దళవాయి సుబ్రమణ్యం, మిరియాల శ్రీనివాస్, విద్యార్థులు వారి తల్లిదండ్రులున్నారు.

దేశాభివృద్ధిని బలోపేతం చేసేలా కేంద్ర బడ్జెట్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలకు ఊతమిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. స్థానిక లాలుపురం, వాజ్‌పేయి భవనంలో ఆదివారం కేంద్ర బడ్జెట్‌పై అవగాహన, ప్రత్యక్ష వీక్షణ, సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ఉపాధి సృష్టికి, పెట్టుబడులకు, పారిశ్రామిక వృద్ధికి అనుకూలంగా ఈ బడ్జెట్ రూపొందించారన్నారు. జోనల్ ఇన్‌చార్జ్ వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ రైతులు, మధ్యతరగతి, యువత, మహిళలు, వ్యాపార వర్గాలకు ఉపయోగపడే అనేక సంస్కరణాత్మక నిర్ణయాలు ఈ బడ్జెట్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్లు కేవీ బ్రహ్మం, మన్నవ శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు, భారతీయ వికాస్ పరిషత్ అధ్యక్షుడు బైరిశెట్టి మల్లికార్జున రావు, బిట్రా శివన్నారాయణ, పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్, దర్శనపు శ్రీనివాస్, జాతీయ స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరి వెంకట సుబ్బారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రి బడ్జెట్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ కళాశాల ప్రాంగణం, ఏకాదండయ్య పంతులు హాల్లో రాధా మాధవ రసరంజని ఆధ్వర్యంలో ఆదివారం 326వ నెలనెలా వెన్నెల కార్యక్రమంలో ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తొలుత డాక్టర్ మనోజ్ చింతల జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయవాడకు చెందిన శ్రీకనకదుర్గ నృత్యాలయం నాట్యాచారిణి విజయలక్ష్మి శిష్య బృందం, గుంటూరుకు చెందిన శ్రీనటరాజు సంగీతం నృత్య కళాశాల నాట్యాచారిణి అనంతుల విజయకుమారి శిష్య బృందం, గుంటూరుకు చెందిన రాధామాధవ రసరంజని నాట్యాచారి ఎస్‌కే ఖలీల్ శిష్య బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. శ్రీభారతి కళాక్షేత్రం నాట్యాచారిణి మైలవరపు వెంకట దివ్యభారతి పలు అన్నమాచార్య కీర్తనలు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమాలను సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచారి ఎస్‌కే ఖలీల్ పర్యవేక్షించారు.


కూచిపూడిని ప్రదర్శిస్తున్న చిన్నారులు

వేడుకగా వాసవీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారం శ్రీవాసవీ కన్యాకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆదివారం వాసవీ క్లబ్ - 2026 నూతన కార్యకర్గ ప్రమాణ స్వీకారం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షుడిగా రాయవరపు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా అమరా రమేష్, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాయవరపు అశోక్‌కుమార్ మాట్లాడుతూ క్లబ్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరుస్తామని అన్నారు. పేదలకు సేవ, సమాజహిత కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.


నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులను అభినందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నాకౌట్‌కు ఢిల్లీ

యూపీపై గెలుపు ▸▸ మహిళల ప్రీమియర్ లీగ్

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఎలిమినేటర్‌కు చేరిన రెండో జట్టుగా ఢిల్లీ క్యాపిటల్స్ నిలిచింది. ఆదివారం యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 5 వికెట్లతో నెగ్గింది. ఇక మంగళవారం గుజరాత్-ఢిల్లీ జట్ల మధ్య జరిగే ఎలిమినేటర్ మ్యాచ్ విజేత ఫైనల్‌కు చేరుతుంది. ముందుగా యూపీ 20 ఓవర్లలో 122/8 స్కోరు సాధించింది. దీప్తి (24), శిఖా (23 నాటౌట్), సిమ్రన్ (22) రాణించారు. మారిజానె కాప్‌నకు 3.. శ్రీచరణి, హెన్రీలకు రెండేసి వికెట్లు లభించాయి. స్వల్ప ఛేదనలో ఢిల్లీ కాస్త తడబాటుకు లోనైనా.. 18.4 ఓవర్లలో 126/5 స్కోరు చేసి గెలిచింది. వోల్వార్ట్ (47), కెప్టెన్ జెమీమా (34 నాటౌట్), షఫాలీ (29) కీలకంగా నిలిచారు. దీప్తికి 2 వికెట్లు దక్కాయి. కాప్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

క్వార్టర్స్‌కు ఆంధ్ర

నాగాలాండ్‌తో మ్యాచ్ డ్రా

డిమాపూర్: రంజీ ట్రోఫీలో ఆంధ్ర క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-ఎలో నాగాలాండ్‌తో ఆఖరి లీగ్ మ్యాచ్‌ను ఆంధ్ర డ్రాగా ముగించింది. ఏడు మ్యాచ్‌ల నుంచి ఆంధ్ర, జార్ఖండ్, డిఫెండింగ్ చాంప్ విదర్భ సమంగా 31 పాయింట్లు సాధించాయి. అయితే, మెరుగైన రన్‌రేట్ కారణంగా జార్ఖండ్ గ్రూప్ టాపర్‌గా నిలవగా.. ఆంధ్ర రెండో స్థానంతో నాకౌట్‌కు చేరుకొంది. విదర్భ టోర్నీ నుంచి అవుటైంది. ఆటకు నాలుగో, ఆఖరి రోజు ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 85/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన నాగాలాండ్ 342 రన్స్‌కు ఆలౌటైంది. ప్రత్యర్థి ముందు 173


ఆంధ్ర జట్టు

పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. చేతన్ బిష్త్ (100) సెంచరీ సాధించగా.. త్రిపురన విజయ్ 5, సౌరభ్ 4 వికెట్లు తీశారు. ఛేదనలో ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 64/4 స్కోరు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిస్తే చాలు రౌండ్-8కు చేరే అవకాశాలుండడంతో ఆంధ్ర జాగ్రత్తగా ఆడింది. శ్రీకర్ భరత్ (6), కెప్టెన్ రికీ భుయ్ (20), సౌరభ్ (15), జ్ఞానేశ్వర్ (12) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. తొలి ఇన్నింగ్స్‌లో నాగాలాండ్ 366 రన్స్ చేయగా, ఆంధ్ర 536/9 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. కాగా, ఛత్తీస్‌గఢ్‌తో మ్యాచ్‌ను హైదరాబాద్ డ్రా చేసుకొంది. ఇక, ఈనెల 6 నుంచి జరిగే రంజీ క్వార్టర్స్ పోరులో బెంగాల్‌తో ఆంధ్ర జట్టు తలపడనుంది. మిగతా క్వార్టర్స్‌లో జార్ఖండ్‌తో ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌తో జమ్మూ కశ్మీర్, ముంబైతో కర్ణాటక ఆడనున్నాయి.


క్రీడలకు రూ. 4479 కోట్లు

కేంద్ర బడ్జెట్‌లో క్రీడా పరికరాల తయారీకి ప్రాధాన్యం

న్యూఢిల్లీ: కేంద్ర క్రీడల బడ్జెట్‌లో.. క్రీడా పరికరాల తయారీ రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ రంగానికి తొలిసారి రూ. 500 కోట్లను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేటాయించారు. అయితే మొత్తం క్రీడలు, యువజన సర్వీసుల శాఖ బడ్జెట్ గత ఏడాది కంటే రూ. వేయి కోట్లకు పైగా పెరిగింది. మొత్తంగా ఈసారి క్రీడా రంగానికి రూ.4,479.88 కోట్లు ఇచ్చారు. 2024-24తో పోల్చితే రూ.1133.34 కోట్లు అదనంగా పెరిగింది. భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) బడ్జెట్‌ను రూ. 880 కోట్ల నుంచి రూ. 917.38 కోట్లకు పెంచారు.

జాతీయ డోపింగ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ, జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ బడ్జెట్‌లను నిరుటి కంటే తగ్గించడం గమనార్హం. ఖేలో ఇండియా ఈవెంట్‌కు రూ.924.35 కోట్లు, కామన్వెల్త్ క్రీడల సహాయం కార్యక్రమానికి రూ. 50 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం ఇది 28.05 కోట్లుగా ఉంది.

అటు జొకోవిచ్.. ఇటు అల్కారజ్.. వయస్సురీత్యా భారీ వ్యత్యాసం కలిగిన ఈ ఇద్దరూ చరిత్ర సృష్టించేందుకే తుది పోరులో తలపడ్డారు. కానీ 22 ఏళ్ల నయా స్పెయిన్ బుల్ అల్కారజ్‌కే ఆస్ట్రేలియన్ ఓపెన్ చిక్కింది. ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ నెగ్గిన అల్కారజ్.. మెల్‌బోర్న్ ట్రోఫీతో 'కెరీర్ స్లామ్' సాధించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. ఇక ఎవరికీ సాధ్యం కాని రీతిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అందుకోవాలన్న జొకోవిచ్ కల మాత్రం మరోసారి భగ్నమైంది.



చిన్నోడికి చిక్కింది

- ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత అల్కారజ్
- 'కెరీర్ స్లామ్'తో కొత్త చరిత్ర
- ఫైనల్లో జొకోవిచ్ పరాజయం


జొకోవిచ్

మెల్‌బోర్న్: స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కారజ్ తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. ఆదివారం టెన్నిస్ దిగ్గజం జొకోవిచ్‌తో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో తను 2-6, 6-2, 6-3, 7-5తో గెలిచాడు. దీంతో కెరీర్ స్లామ్ (నాలుగు గ్రాండ్‌స్లామ్స్) సాధించిన అతిపిన్న వయస్కుడిగానూ వరల్డ్ నెంబర్ వన్ అల్కారజ్ (22 ఏళ్ల 272 రోజులు) రికార్డులకెక్కాడు. గతంలో డాన్ బడ్జ్ (1938లో 22 ఏళ్ల 363 రోజులు) పేరిట ఈ ఫీట్ ఉంది. ఓవరాల్‌గా కార్లోజ్‌కిది ఏడో గ్రాండ్‌స్లామ్ కాగా, కెరీర్ స్లామ్ అందుకున్న తొమ్మిదో ప్లేయర్. ఇంతకుముందు కార్లోస్.. యూఎస్ ఓపెన్ (2022, 2025), వింబుల్డన్ (2023, 2024), ఫ్రెంచ్ ఓపెన్ (2024, 2025) సాధించాడు. మరోవైపు 38 ఏళ్ల జొకోవిచ్ ఈ టైటిల్‌తో కెరీర్‌లో 25 గ్రాండ్‌స్లామ్స్ కలిగిన ఒకే ఒక్కడుగా నిలుద్దామనుకున్నా నిరాశే ఎదురైంది. మెల్‌బోర్న్ పార్క్‌లో పది సార్లు ఫైనల్‌కు వచ్చిన ప్రతిసారీ విజేతగా నిలిచిన సెర్బియా స్టార్‌కు ఈసారి మాత్రం కార్లోస్ రూపంలో ఝలక్ తగిలింది. చివరగా జొకోవిచ్ 2023లో యూఎస్ ఓపెన్ గెలిచాడు. తాజా ఫైనల్లో అతడు తొలి సెట్‌ను గెలిచి అభిమానుల్లో జోష్‌ను నింపినా.. కార్లోస్ పుంజుకుని వరుసగా రెండు సెట్లను కైవసం చేసుకుని ఒత్తిడి పెంచాడు. అయితే నాలుగో సెట్ మాత్రం హోరాహోరీగా సాగింది. రెండో గేమ్ ఏకంగా 15 నిమిషాలపాటు సాగగా జొకో ఆరు బ్రేక్ పాయింట్లను కాపాడుకుని 1-1తో సమం చేశాడు. ఆ తర్వాత ఇద్దరూ వరుసగా సర్వీస్‌లకు కాపాడుకుంటూ 5-5తో ఉత్కంఠ పెంచారు. ఈ దశలో కార్లోస్ వరుసగా 11, 12 గేమ్‌లను గెలిచి మ్యాచ్‌ను ముగించాడు. మొత్తంగా అల్కారజ్ తొమ్మిది, జొకోవిచ్ నాలుగు ఏస్‌లు సంధించారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి: నందిని



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ జూనియర్ 10కే రన్‌ను తెలుగు అథ్లెట్, ఆసియా క్రీడల పతకధారి అగసర నందిని ప్రారంభించింది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో నందిని మాట్లాడుతూ.. స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలంటే పాఠశాల స్థాయిలోనే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించింది. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపింది.

ప్రపంచకప్‌లో పాల్గొంటాం..

భారత్‌తో ఆడం



పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటన
నేడు భేటీ కానున్న ఐసీసీ
పాక్‌పై కఠిన చర్యలు ?

లాహోర్: బంగ్లాదేశ్‌కు మద్దతుగా టీ20 ప్రపంచ కప్‌ను బహిష్కరిస్తామని ప్రగల్భాలు పలికిన పాకిస్థాన్ అందుకు సాహించలేకపోయింది. బదులుగా.. టోర్నీకే తలమానికమైన భారత్‌తో తమ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్టు పాకిస్థాన్ ఆదివారం ప్రకటించింది. ఈనెల 15న భారత్‌తో జరిగే మ్యాచ్ మినహా టోర్నమెంట్‌లో యథాప్రకారం పాకిస్థాన్ జట్టు ఆడుతుందని వెల్లడించింది. కాగా, భారత్‌తో మ్యాచ్ బహిష్కరణకు కారణమేంటన్నది మాత్రం స్పష్టం చేయకపోవడం గమనార్హం. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న వరల్డ్ కప్ ఈనెల 7న మొదలవనున్న సంగతి తెలిసిందే. భద్రతా కారణాలు సాకుగా చూపుతూ భారత్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్ నిరాకరించిన విషయం విదితమే. దాంతో బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి బహిష్కరించిన ఐసీసీ.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడిస్తోంది. ఈ వివాదంలో మొదటి నుంచీ బంగ్లాకు వంత పాడుతున్న పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) టోర్నీ నుంచి తప్పుకొంటామని బీరాలు పలుకుతూ వచ్చింది. వరల్డ్ కప్‌లో తాము ఆడే విషయాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తుందని పీసీబీ ఛైర్మన్ మొహసిన్ నక్వీ గతంలోనే ప్రకటించారు. ఈ క్రమంలో మొత్తం టోర్నీని గాకుండా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్టు తాజాగా పాక్ ప్రభుత్వం తెలిపింది. 'ప్రపంచకప్‌లో పాక్ జట్టు ఆడేందుకు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్థాన్ అనుమతి ఇస్తోంది. కానీ ఈనెల 15న భారత్‌తో జరిగే మ్యాచ్‌లో మాత్రం పాకిస్థాన్ తలపడబోదు' అని పాక్ ప్రభుత్వం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఇక..భారత్‌తో మ్యాచ్ బహిష్కరణకు సంబంధించి పూర్తి వివరాలను పీసీబీ ఛైర్మన్ నక్వీ ఒకట్రెండు రోజుల్లో వెల్లడిస్తాడని ఆ బోర్డు వర్గాలు తెలిపాయి. కాగా, భారత్‌తో మ్యాచ్ నిరాకరించడానికి పీసీబీ ఏ కారణాలు చెబుతుందనేది ఆసక్తికరం.

భారత్‌తో పాక్ ఆడకపోతే ఏం జరుగుతుంది?



టోర్నీలో పాకిస్థాన్ వాకోవర్ ఇవ్వడంతో ఆ మ్యాచ్ ద్వారా భారత్‌కు పూర్తి పాయింట్లు లభిస్తాయి. మ్యాచ్‌ను బహిష్కరించినందుకు పాకిస్థాన్‌పై ఐసీసీ భారీగా జరిమానా విధించనుంది. ఈనెల 7న జరిగే తొలి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌ను పాకిస్థాన్ ఎదుర్కోనుంది. ఫిబ్రవరి 10న అమెరికాను, 18న నమీబియాను ఢీకొననుంది. ఈ మ్యాచ్‌లన్నీ కొలంబోలో జరగనున్నాయి.

ఐసీసీ చర్యలు ఎలా ఉండొచ్చు?



పాకిస్థాన్ నిర్ణయంపై చర్చించేందుకు ఐసీసీ బోర్డు సోమవారం వర్చువల్‌గా సమావేశం కానుంది. ఈ విషయాన్ని బోర్డు సభ్యుడొకరు ఆదివారం రాత్రి వెల్లడించారు. 'పీసీబీ నుంచి మాకు అధికారికంగా సమాచారం లేదు. కానీ ఆ దేశ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినందున.. ఐసీసీ బోర్డు వర్చువల్‌గా భేటీ కానుంది' అని ఆ సభ్యుడు తెలిపారు. ఒకవేళ టోర్నీ నుంచి పాకిస్థాన్‌ను బహిష్కరిస్తే..ఆ జట్టు స్థానంలో ఉగాండాను ఐసీసీ బరిలో దించనుంది. భారత్-పాక్ మ్యాచ్ సందర్భంగా ప్రకటనలకు భారీ డిమాండ్ ఉంటుంది. అది 10 సెకన్లకు రూ. 25 నుంచి 40 లక్షలుల ఉంటుందని సమాచారం. ఈ లెక్కన ఒక్క ప్రకటనల ద్వారానే బ్రాడ్‌కాస్టర్‌కు రూ. 200 కోట్లకు పైగా నష్టం వస్తుందని అంచనా. ఇక భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించిన పాక్‌పై ఐసీసీ తీసుకొనే చర్యలు ఇలా ఉండే చాన్సుంది.

- ▸▸ పాక్‌ను వరల్డ్ కప్ నుంచి పూర్తిగా బహిష్కరణ.
- ▸▸ ఐసీసీ ఆదాయం నుంచి పాకిస్థాన్ వాటా చెల్లింపుల నిలిపివేత.
- ▸▸ మ్యాచ్‌ల ప్రసారదారుకు పూర్తి పరిహారం చెల్లించాలని ఆదేశం.
- ▸▸ ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకుండా పాకిస్థాన్‌పై నిషేధం. దాంతో ఆ జట్టు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్లు, ఐసీసీ ర్యాంకులపై ప్రభావం.
- ▸▸ పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో విదేశీ క్రికెటర్లు పాల్గొనకుండా నిషేధం.

పాక్‌ను పడగొట్టి.. సెమీస్‌కు భారత్

అండర్-19 వరల్డ్ కప్

బులవాయో: పాకిస్థాన్‌పై యువ భారత్ ప్రతీకారం తీర్చుకుంది. నెలన్నర కిందట జరిగిన అండర్-19 ఆసియా కప్ వన్డే టోర్నీ ఫైనల్లో పాకిస్థాన్ చేతిలో భారత్ పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఇందుకు..ఆదివారం జరిగిన అండర్-19 వన్డే వరల్డ్ కప్ సూపర్-6 పోరులో విజయం ద్వారా బదులిచ్చింది. ఈ మ్యాచ్‌లో ఆయుష్ మాత్రే సారథ్యంలోని భారత్ 58 పరుగులతో ప్రత్యర్థిని చిత్తు చేసింది. అంతేకాదు టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు చేరింది. తొలుత భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. వేదాంత్ త్రివేది (68), కనిష్క్ చౌహాన్ (35), వైభవ్ (30) రాణించారు. ఆల్‌రౌండర్ కనిష్క్ చౌహాన్, ఖిలన్ పటేల్ (21) ఎనిమిదో వికెట్‌కు 32 బంతుల్లోనే 50 రన్స్ జత చేశారు. అబ్దుల్ సుభాన్ (3/33) మూడు, మహ్మద్ సయ్యామ్ (2/69) రెండు వికెట్లు సాధించారు. ఛేదనలో పాకిస్థాన్ 46.2 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. ఉస్మాన్ ఖాన్ (66), హమ్జా జహూర్ (42), ఫర్హాన్ యూసఫ్ (38) మాత్రమే రాణించారు. ఆయుష్ మాత్రే (3/21), ఖిలన్ పటేల్ (3/35) చెరో 3 వికెట్లు పడగొట్టారు. కనిష్క్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. బుధవారం జరిగే సెమీఫైనల్లో అఫ్ఘానిస్థాన్‌తో భారత్ తలపడనుంది. మంగళవారం జరిగే తొలి సెమీస్‌లో ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ ఢీకొంటాయి.

రోహిత్ శెట్టి ఇంటి వద్ద కాల్పులు

● తామే చేశామన్న బిష్ణోయ్ గ్యాంగ్



బాలీవుడ్ దర్శకుడు, నిర్మాత రోహిత్ శెట్టి ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఆదివారం తెల్లవారుజామున ముంబైలోని జూహు ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన ముంబై పోలీసులు ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. మరోవైపు ఈ కాల్పులు తామే జరిపామని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టింది. 'మా పనిలో జోక్యం చేసుకోవద్దని చాలా సార్లు హెచ్చరించినా రోహిత్ శెట్టి అర్థం చేసుకోలేదు. అందుకే ఈ చిన్న ట్రైలర్‌ని చూపించాం. ఇకనైనా ఆయన మారకపోతే ఈసారి ఇంటి బయట కాదు.. ఏకంగా బెడ్‌రూమ్‌లోకి వచ్చి కాలుస్తాం' అని పేర్కొంది.

చాలా సంతోషంగా ఉంది


చిరంజీవి

రామ్‌చరణ్, ఉపాసన దంపతులు పండంటి కవల పిల్లలకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా చిరంజీవి మీడియాతో మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు. 'ఆ భగవంతుడి దయ, హనుమాన్ కృపతో రామ్‌చరణ్, ఉపాసనలకు ఒక మగబిడ్డ, ఒక ఆడబిడ్డ జన్మించారు. ఈ శుభపరిణామం వల్ల కొణిదెల, కామినేని కుటుంబాలు ఆనందంతో ఉన్నాయి. ఉపాసనతో పాటు బిడ్డలిద్దరూ చాలా ఆరోగ్యంగా ఉన్నారు. ఈ ఆనంద క్షణాల్ని మీతో పంచుకుంటున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. అందరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

రెట్టింపు ఆనందం



రామ్‌చరణ్ సోషల్‌మీడియా వేదికగా రెట్టింపు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన సతీమణితో ఉన్న ఒక పాత ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. 'మాకు పాప, బాబు పుట్టారన్న విషయాన్ని మీతో పంచుకోవడం ఆనందంగా ఉంది. ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని కలిగి ఉండడం ఎంతో కృతజ్ఞతగా భావిస్తున్నాం. మన జీవితంలో మహిళలే అత్యంత బలం. మాకు ఎల్లప్పుడూ అండగా నిలిచిన కుటుంబ సభ్యులకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని రామ్‌చరణ్ పేర్కొన్నారు. రామ్‌చరణ్ దంపతులకు ఇప్పటికే కుమార్తె క్లీంకార ఉన్న సంగతి తెలిసిందే. రామ్‌చరణ్, ఉపాసన మరోసారి తల్లిదండ్రులయిన సందర్భంగా సోషల్ మీడియా వేదికగా సినీ ప్రముఖులు ఆనందం వ్యక్తం చేశారు. హీరోలు జూనియర్ ఎన్టీఆర్, సాయి దుర్గాతేజ్, వరుణ్ తేజ్, నిర్మాతలు అల్లు అరవింద్, సుష్మిత కొణిదెల, హీరోయిన్ లావణ్య త్రిపాఠి తదితరులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పోస్టులు పెట్టారు.

వేసవిలో 'భగవంతుడు'



తిరువీర్, ఫరియా అబ్దుల్లా జంటగా నూతన దర్శకుడు జి.జి.విహారి రూపొందిస్తున్న చిత్రం 'భగవంతుడు'. ఏషియన్ ఫిల్మ్స్ నారాయణదాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తున్నారు. కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో హీరోలు విష్వక్సేన్, సందీప్ కిషన్ ఈ చిత్రం టీజర్‌ని ఆవిష్కరించారు. దర్శకుడు వేణు ఊడుగుల మాట్లాడుతూ "భగవంతుడు' కథ నాకు బాగా నచ్చింది. మీ అందరి ఆదరణతో ఘన విజయం సాధిస్తుంది' అని అన్నారు. దర్శకనిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాతో డైరెక్టర్‌గా, రైటర్‌గా గోపీ విహారికి గుర్తింపు దక్కుతుంది' అని అన్నారు. నిర్మాత రవి పనస మాట్లాడుతూ సినిమాను ఏప్రిల్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. చిత్ర దర్శకుడు విహారి మాట్లాడుతూ 'నేను సినిమా పాత్రికేయుడిగా కెరీర్ ప్రారంభించా. మనల్ని మనం అర్థం చేసుకునేందుకు, సమాజంలో ఉన్న వైరుధ్యాలు తెలుసుకునేందుకు కథలు చెబుదాం. ఈ అవగాహనతో నేను రూపొందించిన చిత్రమిది' అని చెప్పారు. కార్యక్రమంలో తిరువీర్, ఫరియా అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

హృదయాలను కదిలించే ప్రేమ కథ



మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో పృథ్వీ పెరిచర్ల రూపొందించిన చిత్రం 'స్కై'. వేలార్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియోస్ బ్యానర్‌పై నాగిరెడ్డి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మించారు. ఫిబ్రవరి 6న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకనిర్మాత మధుర శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమా కథాంశం చాలా బాగుంది. మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. నిర్మాత నాగిరెడ్డి గుంటక మాట్లాడుతూ 'హృదయాలను కదిలించే ఒక కొత్త ప్రేమ కథను ప్రేక్షకులకు అందించబోతున్నాం' అని తెలిపారు.

ప్రేక్షకులను వెంటాడుతుంది



యథార్థ సంఘటనలు, మూఢ నమ్మకాల ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'హనీ'. నవీన్ చంద్ర, దివ్య పిళ్లై జంటగా నటించారు. కరుణకుమార్ దర్శకత్వంలో రవి పీట్ల, ప్రవీణ్‌కుమార్ రెడ్డి నిర్మించారు. ఈనెల 6న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో కరుణకుమార్ మాట్లాడుతూ 'మనిషి మెదడు కంటే పెద్ద దెయ్యం లేదనేదే ఈ సినిమా సారాంశం' అని అన్నారు. ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇవ్వాలని చేసిన ప్రయత్నమే ఈ సినిమా అని నవీన్ చంద్ర తెలిపారు. ఇప్పటివరకూ మన సినిమాల్లో రాని కొత్త తరహా కాన్సెప్ట్‌తో వస్తున్న చిత్రమిది, ప్రేక్షకులను వెంటాడుతుంది అని నిర్మాతలు చెప్పారు.

బాబోయ్.. పులి!

- ▸▸ 'తూర్పు'లోకి ప్రవేశించిన పెద్దపులి
- ▸▸ తొర్రేడులో మూడు పశువులు హతం
- ▸▸ భయం గుప్పిట్లో గ్రామస్థులు
- ▸▸ సంఘటన స్థలానికి నేతలు, అధికారులు
- ▸▸ ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతుండగానే బయటికొచ్చిన పులి
- ▸▸ కేకలు వేస్తూ పరుగు తీసిన జనం
- ▸▸ పులిని గుర్తించి పట్టుకునేందుకు ట్రాప్ కెమెరాలు, బోను ఏర్పాటు


పులి దాడిలో మృతి చెందిన ఆవు


తొర్రేడులో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పు గోదావరిలోకి ప్రవేశించింది. ఆదివారం వేకువజామున రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామంలో అరటి తోట సమీపంలో కట్టి ఉన్న పశువులపై దాడి చేసి చంపేసింది. పులి పాదముద్రలను బట్టి పులి వచ్చిందని గుర్తించి స్థానికులు తీవ్ర భయాందోళన చెందారు. డీఎఫ్‌వో ప్రభాకరరావు కథనం ప్రకారం.. తొర్రేడులో పశువుల మందపై దాడి చేసి రెండు ఆవులను చంపి, దూడను లాక్కొనిపోయింది. ఆదివారం ఉదయం రెవెన్యూ పోలీసు, అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పులి పాదముద్రలను పరిశీలించారు. మృతి చెందిన దూడను ఆ ప్రాంతంలో ఉన్న అరటి తోటలో పడేసినట్లు గుర్తించారు. కాగా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులకు, ప్రజలకు పలు సూచనలు చేశారు.

గోరంట్ల మాట్లాడుతుండగానే..

ఎమ్మెల్యే గోరంట్ల అధికారులతో కలిసి.. పులి దూడను ఈడ్చుకు వెళ్లిన ప్రాంతంలో కొంత దూరం వెళ్లారు. అక్కడ విలేకరులతో మాట్లాడుతున్న సమయంలో సుమారు 70 నుంచి 80 మీటర్ల దూరంలో పులి అరటి తోట నుంచి దూడను ఈడ్చుకు వెళ్లిన మార్గంలోనే రావడాన్ని కొంతమంది బిగ్గరగా కేకలు వేస్తూ భయంతో పరుగులు పెట్టారు. దీంతో పులి మొక్కజొన్న తోటలోకి వెళ్లిపోయింది. పులిని అతి దగ్గరలో చూసిన ప్రజలు షాక్‌కు గురయ్యారు. అదే సమయంలో డ్రోన్ కెమెరాలు వినియోగించి ఉంటే పులి ఆచూకీ దొరికి ఉండేదని పలువురు అన్నారు. పులిని పట్టుకొనేందుకు పలుచోట్ల 12 ట్రాప్ కెమెరాలు, ఒక బోను ఏర్పాటు చేశారు. పులి సంచారంతో గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని ఎమ్మెల్యే గోరంట్ల సూచించారు. గ్రామంలో మైక్‌తో చాటింపు వేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

భారత్ ఇకపై ఇరాన్ చమురు కాకుండా వెనిజువెలా చమురు కొనుగోలు చేస్తుంది: ట్రంప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: భారత్ ఇకపై ఇరాన్ నుంచి కాకుండా వెనిజువెలా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఫ్లోరిడాకు వెళ్తున్న సమయంలో ఎయిర్‌ఫోర్స్ వన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ విషయంపై ఇప్పటికే భారత్‌తో ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. వెనిజువెలా నుంచి చమురు దిగుమతులను భారత్ తిరిగి ప్రారంభించేందుకు అమెరికా అనుమతించవచ్చన్న సంకేతాల నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా చమురు కొనుగోలు ద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ నిధులు సమకూరుస్తోందని గతంలో ఆరోపించిన అమెరికా.. ప్రస్తుతం రష్యా చమురుకు ప్రత్యామ్నాయంగా వెనిజువెలా చమురును పరిగణనలోకి తీసుకోవాలని భారత్‌ను ప్రోత్సహిస్తోంది. ఇదిలా ఉండగా అమెరికా సైనిక చర్య తర్వాత వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్స్‌తో ప్రధాని మోదీ శుక్రవారం తొలిసారిగా ఫోన్‌లో మాట్లాడారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు అంగీకరించామని, భారత్- వెనిజువెలా సంబంధాలను రాబోయే రోజుల్లో కొత్త ఎత్తులకు తీసుకెళ్లేందుకు నిర్ణయించామని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.49 పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: హోటళ్లు, వీధి వ్యాపారులు ఉపయోగించే వాణిజ్య గ్యాస్ ధర పెరిగింది. నెలవారీ ధరల సవరణలో భాగంగా ఆదివారం 19 కిలోల సిలిండర్ ధరను రూ.49 మేర పెంచుతూ పెట్రో కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ.1740.50 పలకనుంది. జనవరి ఒకటో తేదీన ఏకంగా రూ.110 పెంచగా, సిలిండర్ ధర రూ.1,691.50కు చేరుకుంది. ఫిబ్రవరి నెలలోనూ ధర పెరగడం గమనార్హం.

డ్యూటీ ఫ్రీ గూడ్స్ పరిమితి రూ.75వేలకు పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: విదేశాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులకు అనుమతినిచ్చే డ్యూటీ ఫ్రీ వస్తువుల పరిమితిని ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం రూ.50 వేలుగా ఉన్న పరిమితిని రూ.75 వేలు పెంచినట్టు ఆదివారం ప్రకటించింది. రోడ్డు మార్గంలో కాకుండా ఇతర మార్గాల్లో(విమానం, నౌక) భారత్‌కు వచ్చే భారతీయులు లేదా భారత్ సంతతి పర్యాటకులు.. రూ.75 వేలు విలువ చేసే వస్తువులను డ్యూటీ ఫ్రీ గూడ్స్ కింద నిబంధనలకు అనుగుణంగా తమ లగేజీలో తీసుకురావచ్చు.

నటుడు రఘునాథ రెడ్డి ఇక లేరు



ప్రముఖ నటుడు రఘునాథ రెడ్డి (82) మృతిచెందారు. కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శనివారం రాత్రి కుషాయిగూడ ప్రథమపురి కాలనీలోని తన నివాసంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. తెలుగు, హిందీ, తమిళ్, బోజ్‌పురి భాషల్లో మొత్తం 370కి పైగా సినిమాల్లో నటించారు ఆయన. శోభన్ బాబు నటించిన 'సర్పయాగం' సినిమాతో టాలీవుడ్‌లో క్యారెక్టరు ఆర్టిస్టుగా కెరీర్‌ను మొదలుపెట్టారు. 'కలిసుందాం రా', 'ఒసేయ్ రాములమ్మ', 'చీమల దండు', 'రాయలసీమ రామన్న చౌదరి', 'సీమ సింహం', 'మల్లీశ్వరి', 'సంక్రాంతి', 'శ్రీరామ రాజ్యం', 'గాయం 2' ఇలా పలు సినిమాల్లో కీలక పాత్రలు పోషించారు. పలు సీరియల్స్‌లోనూ నటించారు. 2018లో వచ్చిన 'సుబ్రహ్మణ్య పురం' ఆయన నటించిన చివరి చిత్రం. రఘునాథ రెడ్డిది కృష్ణా జిల్లా కుందేరు గ్రామం. కృష్ణా రెడ్డి, సామ్రాజ్యమ్మ దంపతులకు జన్మించారు. విజయవాడ, మచిలీపట్నంలో విద్యాభ్యాసం చేశారు. లాలగూడలో రైల్వే ఉద్యోగం చేస్తున్నప్పుడు పరుచూరి బ్రదర్స్ సహకారంతో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నెల క్రితం కుమారుడు మరణించడంతో తీవ్ర మనోవేదనకు గురై అదే బెంగతో మరణించారని సమాచారం.



2026-27లో రూ.3.16 లక్షల కోట్ల డివిడెండ్

వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), జాతీయ బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ నుంచి రూ.3.16 లక్షల కోట్ల డివిడెండ్ వస్తుందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం (రూ.3.05 లక్షల కోట్లు)తో పోల్చితే ఇది 3.75 శాతం ఎక్కువ. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థలు ప్రభుత్వానికి అందించిన డివిడెండ్ రూ.2.56 లక్షల కోట్లుగా ఉంది. కాగా ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్ఈ), ఇతర పెట్టుబడుల రూపంలో రూ.75,000 కోట్ల వరకు డివిడెండ్ అందుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

2026-27

మ్యూచువల్ ఫండ్ ఆదాయంపై పన్ను మార్పులు

షేర్లపై లభించే డివిడెండ్ ఆదాయం లేదా మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల నుంచి లభించిన ఆదాయానికి సంబంధించి ఏదైనా వడ్డీ వ్యయంపై పన్ను మినహాయింపును రద్దు చేయాలని బడ్జెట్లో ప్రతిపాదించారు. ఈ ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్న కొత్త ఆదాయం పన్ను చట్టం 2025లో ఈ మార్పు భాగం కానుంది. ప్రస్తుతం ఈ రెండు ఆదాయాల్లో 20 శాతం వరకు వడ్డీ వ్యయం కింద మినహాయించుకునే వెసులుబాటు ఉంది. తాజా మార్పుతో అప్పు చేసి షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టేవారిపై పన్ను భారం పెరగనుంది.



ప్రవాసుల 'ఈక్విటీ' పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

వ్యక్తిగత పరిమితి 5 నుంచి 10 శాతానికి పెంపు

భారత క్యాపిటల్ మార్కెట్లో ప్రవాస భారతీయులు (ఎన్‌ఆర్ఐ), భారత సంతతి ప్రజల (పీఐఓ) నేరుగా పెట్టుబడులు పెంచేందుకూ కేంద్ర బడ్జెట్ చర్యలు తీసుకుంది. ఇప్పటి వరకు వీరు విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ (ఎఫ్‌పీఐ) రూపంలో లేదా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) రూపంలో భారత ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతూ వస్తున్నారు. తాజాగా వీరు నేరుగా పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇప్పటి వరకు ఉన్న విధానంలో లిస్టెడ్ కంపెనీల ఈక్విటీలో వీరి వ్యక్తిగత పెట్టుబడి పరిమితి 5 శాతం వరకు ఉంది. తాజాగా దీన్ని 5 నుంచి 10 శాతానికి పెంచుతున్నట్లు బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మల ప్రకటించారు. అలాగే ఒక లిస్టెడ్ కంపెనీ ఈక్విటీలో ఎన్‌ఆర్ఐలు, పీఐఓల పెట్టుబడుల మొత్తం పరిమితిని ప్రస్తుత 10 శాతం నుంచి 24 శాతానికి పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మల ప్రకటించారు. కాకపోతే వీరు తమ పెట్టుబడులను పోర్టుఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ (పీఐఎస్) ద్వారా మాత్రమే చేయాలి. నమోదిత స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా కొనుగోలు చేసే షేర్లు, కన్వర్టబల్ డిబెంచర్లకు మాత్రమే ఈ పరిమితి వర్తిస్తుంది. ఈ చర్య దేశీయ స్టాక్ మార్కెట్‌తో పాటు రూపాయి మారకం రేటులోనూ స్థిరత్వం తెస్తుందని భావిస్తున్నారు. ఎన్‌ఆర్ఐ, పీఐఓలు ఇప్పటి వరకు ఫెమా నిబంధనలకు అనుగుణంగా గుర్తింపు పొందిన బ్యాంకుల ద్వారా ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాల్సి వచ్చేది. ఇకపై వీరు ఎఫ్‌పీఐ రిజిస్ట్రేషన్ లేకుండా కేవైసీ నిబంధనలు, బ్యాంకింగ్ చానల్స్ ద్వారా భారత ఈక్విటీల్లో పెట్టుబడులు అవకాశం లభించనుంది. ఇందుకు సంబంధించి ఆర్‌బీఐ రానున్న వారాల్లో పూర్తి స్థాయి మార్గదర్శకాలను జారీ చేయనుంది.

షేర్ల బైబ్యాక్‌పై పన్ను నిబంధనల్లో మార్పులు



కంపెనీలు సొంత షేర్లను తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేసే సమయంలో మైనారిటీ షేర్‌హోల్డర్ల ప్రయోజనాలను రక్షించడంతో పాటు ప్రమోటర్ల దుర్వినియోగాన్ని నిరోధించేందుకు ఆర్థిక మంత్రి ఈసారి బడ్జెట్లో పన్ను నిబంధనల్లో సమూల మార్పులు ప్రకటించారు. ఇకపై ప్రమోటర్ల పరిధిలోకి రాని అన్ని విభాగాల షేర్‌హోల్డర్ల బైబ్యాక్ రాబడులపై క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్‌ను వసూలు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ 12.5 శాతంగా, షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ 20 శాతంగా ఉంది. బైబ్యాక్‌లో తమ వాటా విక్రయించే ప్రమోటర్లు మాత్రం అదనపు పన్ను చెల్లించాల్సి ఉంటుందని సీతారామన్ స్పష్టం చేశారు. కార్పొరేట్ ప్రమోటర్లపై పన్ను రేటు 22 శాతంగా, నాన్ కార్పొరేట్ ప్రమోటర్లపై పన్ను రేటు 30 శాతంగా ఉండనుంది. కంపెనీ ప్రమోటర్లు తమ ఈక్విటీ వాటాల రాబడులపై పన్ను భారాన్ని తగ్గించుకునేందుకు బైబ్యాక్‌లను ఉపయోగించుకోకుండా నివారించడమే ఈ మార్పుల ఉద్దేశం. అలాగే, బైబ్యాక్‌లో షేర్లను విక్రయించే చిన్న, సాధారణ షేర్‌హోల్డర్లకు లబ్ధి చేకూరనుంది. ఎందుకంటే, ప్రస్తుతం బైబ్యాక్ రాబడులను డివిడెండ్‌గా పరిగణించి, 35 శాతం వరకు పన్ను విధిస్తోంది కేంద్రం. తాజా మార్పుతో వీరికి బైబ్యాక్ రాబడులపై పన్ను భారం దీర్ఘకాలిక (కనీసం3 ఏళ్లు) పెట్టుబడిపై 12.5 శాతానికి, స్వల్పకాలిక (1-3 ఏళ్లు) పెట్టుబడిపై 20 శాతానికి తగ్గనుంది.

డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ.80,000 కోట్లు

2026-27 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్)తో పాటు పీఎస్‌యూల కీలకేతర ఆస్తుల నగదీకరణ ద్వారా రూ.80,000 కోట్లు సమకూర్చుకోవాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26) సవరించిన డిజిన్వెస్‌మెంట్ టార్గెట్ రూ.34,000 కోట్లతో పోలిస్తే చాలా అధికమిది. గడిచిన కొన్నేళ్లుగా ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాలను చేరుకోలేకపోతోంది. అయితే, పీఎస్‌యూల నిర్వచనాన్ని మార్చాలని.. వీటిలో ప్రభుత్వ కనీస వాటా పరిమితిని 51 శాతం నుంచి 26 శాతానికి తగ్గించాలని బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే నివేదిక సూచించింది.

ద్రవ్య లోటు లక్ష్యం 4.3%

ద్రవ్య క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ ఈ ఏడాది ద్రవ్య లోటు లక్ష్యం జీడీపీలో 4.3 శాతంగా ఆర్థిక మంత్రి నిర్మల ప్రకటించారు. ఈ ఏడాది మార్చితో ముగియనున్న 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇది 4.4 శాతానికి పరిమితం కానుంది. ప్రభుత్వం సామాజిక బాధ్యతల పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండానే విత్తపరమైన లక్ష్యాలను ఎప్పటికప్పుడు సాధిస్తూ వస్తోంది. 2030-31 నాటికి జీడీపీలో రుణాల వాటాను 1 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటు చేసుకునే వెసులుబాటుతో 50 శాతానికి పరిమితం చేయాలనుకుంటున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సర సవరించిన లక్ష్యం 56.1% కాగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో దాన్ని 55.6 శాతానికి తీసుకురావాలనుకుంటున్నాం. జీడీపీలో రుణాల శాతం తగ్గిన కొద్ది అందుబాటులోకి వచ్చే వనరులు ప్రాధాన్యతా రంగాలకు కేటాయించుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు.

తయారీకి ఊతం..

ట్రంప్ సుంకాల పోటును తట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు

వికసిత్ భారత్ లక్ష్యంగా కీలక రంగాలపై దృష్టి

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆర్థిక వృద్ధికి బాటలు వేయటంతో పాటు దేశీయంగా తయారీ రంగానికి ఊతమిచ్చే విధంగా ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటుతో అల్లాడిపోతున్న రంగాలను ఆదుకునేందుకు బడ్జెట్‌లో మంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. తయారీ రంగాన్ని పరుగులు పెట్టించి 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు రేర్ ఎర్త్ మాగ్నెట్స్, సెమీకండక్టర్ చిప్స్, టెక్స్‌టైల్, బయో ఫార్మా, ఎలక్ట్రానిక్ ఉపకరణాల విడిభాగాల తయారీ, రసాయనాలు, క్యాపిటల్ గూడ్స్ వంటి ఏడు రంగాలను వ్యూహాత్మక ప్రాధాన్యతా రంగాలుగా ప్రకటించారు. ఇందులో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్, సెమీకండక్టర్ చిప్స్ ఇప్పటికే చైనా ఆంక్షలతో అల్లాడిపోతున్నాయి. ఇక టెక్స్‌టైల్స్ గురించైతే చెప్పాల్సిన పనే లేదు. ట్రంప్ సుంకాల పోటుతో టెక్స్‌టైల్ ఎగుమతులు ఇప్పటికే నీరసించాయి. ఈ ఏడు రంగాలను పరుగులు పెట్టించడం ద్వారా ఆత్మనిర్భరత సాధించాలన్నది మోదీ సర్కార్ లక్ష్యంగా కనిపిస్తోంది. భవిష్యత్ అవసరాలు, ఎగుమతి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని బయోఫార్మా అభివృద్ధికి రూ.10,000 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడం దేశీయ ఫార్మా రంగానికి మరింత కలిసి రానుంది. ఇదే సమయంలో ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌తో స్టాక్ మార్కెట్లో చేతులు కాల్చుకుంటున్న చిన్న, రిటైల్ మదుపరులను కట్టడి చేసేందుకూ ఆర్థిక మంత్రి ప్రత్యేక చర్యలు ప్రకటించారు.



కంటైనర్ల తయారీకి రూ.10,000 కోట్లు

దేశంలో కంటైనర్ల తయారీని ప్రోత్సహించేందుకు కేంద్రం బడ్జెట్లో ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. ఇందుకోసం వచ్చే ఐదేళ్లలో రూ.10,000 కోట్లు కేటాయించనున్నట్లు సీతారామన్ వెల్లడించారు. ప్రపంచ స్థాయిలో పోటీపడగలిగే కంటైనర్ల తయారీ వ్యవస్థను దేశీయంగా అభివృద్ధి చేసేందుకు ఈ పథకం దోహదపడనుందన్నారు. పర్యావరణ హితమైన సరుకు రవాణాను ప్రోత్సహించేందుకు, కన్‌స్ట్రక్షన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎక్విప్‌మెంట్ (సీఐఈ)ను పెంచే పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. అత్యాధునిక, అత్యున్నతమైన సీఐఈని దేశీయంగా తయారు చేసేందుకు ఈ పథకం దోహదపడనుందన్నారు.

బయోఫార్మా హబ్‌గా భారత్

భారత్‌ను బయోఫార్మా తయారీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు వచ్చే ఐదేళ్లలో రూ.10,000 కోట్ల పెట్టుబడులను ఆర్థిక మంత్రి బడ్జెట్లో ప్రతిపాదించారు. బయోఫార్మా శక్తి కార్యక్రమం దేశంలో బయోలాజిక్స్, బయోసిమిలర్స్ ఉత్పత్తికి అవసరమైన ఆవరణ వ్యవస్థ మరింతగా అభివృద్ధి చెందేందుకు దోహదపడనుందని అన్నారు. అలాగే, దేశవ్యాప్తంగా 1,000 క్లినికల్ ట్రయల్ కేంద్రాల ఏర్పాటుతో పాటు ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ)ను బలోపేతం చేయనున్నట్లు సీతారామన్ ప్రకటించారు. బయోఫార్మాస్యూటికల్స్ లేదా బయోలాజిక్స్ క్లిష్ట ఔషధాలు. వీటిని రసాయనాలకు బదులు జీవులు, కణాలు, కణజాలల నుంచి తయారు చేస్తారు. దేశంలో మధుమేహం, క్యాన్సర్, ఆటోఇమ్యూన్ డిజార్డర్ తో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో అందుబాటు ధరలో దీర్ఘాయువు, జీవ నాణత్యను అందించడంలో బయోలాజిక్స్ కీలకమని మంత్రి పేర్కొన్నారు. బయోఫార్మా శక్తిలో భాగంగా మూడు కొత్త నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐపీఈఆర్, నైపర్)తో కూడిన బయోఫార్మా కేంద్రీకృత నెట్‌వర్క్ ఏర్పాటుతో పాటు ఇప్పటికే ఏర్పాటైన 7 నైపర్స్‌ను సైతం ఆధునికీకరించనున్నట్లు మంత్రి తెలిపారు.

చిప్‌ల తయారీకి బూస్ట్

సెమీ కండక్టర్ మిషన్ 2.0 ప్రకటన
ఈసీఎంఎస్‌కు రూ.40,000 కోట్లు

దేశీయంగా చిప్‌ల తయారీని ప్రోత్సహించేందుకు ఈసారి బడ్జెట్లో కేంద్రం 'ఇండియా సెమీకండక్టర్స్ మిషన్ (ఐఎస్ఎం) 2.0'ను ప్రకటించింది. "ఐఎస్ఎం 1.0 దేశీయ సెమీకండక్టర్ రంగ సామర్థ్యాలను విస్తరించింది. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఐఎస్ఎం 2.0ను ప్రారంభిస్తాం. దేశంలోనే చిప్‌ల తయారీకి అవసరమైన యంత్రాలు, సామాగ్రిని ఉత్పత్తి చేయడంతోపాటు ఫుల్ స్టాక్ ఇండియన్ ఐపీ డిజైనింగ్, ఈ రంగ సరఫరా వ్యవస్థను బలపరిచేందుకు కొత్త పథకం లక్ష్యమని" ఆర్థిక మంత్రి నిర్మల అన్నారు. పరిశోధనతో పాటు సాంకేతికత, నిపుణుల తయారీ కోసం శిక్షణ కేంద్రాల ఏర్పాటుపైనా దృష్టిసారించనున్నట్లు ఆమె చెప్పారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ పథకానికి (ఈసీఎంఎస్) భారీ స్పందన లభించిన నేపథ్యంలో ఈ స్కీమ్‌కు కేటాయింపులను కూడా రెట్టింపు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. "2025 ఏప్రిల్‌లో రూ.22,909 కోట్లతో ప్రారంభించిన ఈసీఎంఎస్ లక్ష్యానికి రెండింతల పెట్టుబడులను ఆకర్షించింది. ఈ రంగంలోకి పెట్టుబడుల జోరు కొనసాగేందుకు వీలుగా ఈ పథకానికి కేటాయింపులను దాదాపు రెట్టింపు స్థాయి రూ.40,000 కోట్లకు పెంచుతున్నా"మని బడ్జెట్ ప్రసంగంలో సీతారామన్ పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈల కోసం రూ.10,000 కోట్ల ఫండ్

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)ల కోసం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి బడ్జెట్లో రూ.10,000 కోట్ల ఫండ్ సహా త్రిముఖ వ్యూహాన్ని ప్రకటించారు. ఆర్థిక వృద్ధికి కీలకమైన ఎంఎస్ఎంఈలను విజేతలుగా తీర్చిదిద్దేందుకు ఈక్విటీ, ద్రవ్య, వృత్తిపరమైన మద్దతును ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. ఈక్విటీ మద్దతు కోసం రూ.10,000 కోట్ల ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్‌తో పాటు సూక్ష్మ పరిశ్రమల కోసం 2021లో ఏర్పాటు చేసిన సెల్ఫ్ రిలయంట్ ఫండ్‌కు మరో రూ.2,000 కోట్లు కేటాయించారు. ద్రవ్య మద్దతు కోసం టీఆర్ఈడీఎస్ (ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్)ను పూర్తి సామర్థ్యం మేరకు వినియోగించుకునేందుకు మంత్రి ప్రణాళికలు ప్రకటించారు. ఎంఎస్ఎంఈలకు వృత్తిపరంగా సాయపడేలా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కార్పొరేట్ మిత్రుల కేడర్‌ను అభివృద్ధి చేయనున్నట్లు సీతారామన్ తెలిపారు. ఎంఎస్ఎంఈలకు నిబంధనలకు అనుగుణమైన అవసరాలను తక్కువ ధరలో అందించేందుకు ఈ కేడర్ సాయపడనుంది.

ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ మరింత భారం

ఎస్‌టీటీ భారాన్ని పెంచిన ఆర్థిక మంత్రి

ఫ్యూచర్స్‌పై 150%, ఆప్షన్స్‌పై 50% పెంపు

మార్కెట్లో స్పెక్యులేషన్‌కు చెక్

2025-26లో రూ.63,670 కోట్లు

2026-27లో వసూళ్లు రూ.73,700 కోట్లు ఉంటాయని అంచనా

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో రిటైల్ మదుపరులను నిండా ముంచుతున్న ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌కు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఈ లావాదేవీలపై విధించే సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్స్ ట్యాక్స్ (ఎస్‌టీటీ)ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భారీగా పెంచేశారు. ఫ్యూచర్స్ లావాదేవీలపై విధించే ఎస్‌టీటీని 150 శాతం, ఆప్షన్స్ లావాదేవీలపై విధించే ఎస్‌టీటీని 50 శాతం పెంచుతున్నట్టు ఆదివారం ప్రవేశపెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో ఫ్యూచర్స్ కాంట్రాక్టులపై ప్రస్తుతం ఉన్న 0.02 ఎస్‌టీటీ నుంచి 0.05 శాతానికి చేరనుంది. ఆప్షన్స్ ప్రీమియంపై విధించే ఎస్‌టీటీ కూడా ప్రస్తుత 0.1 శాతం నుంచి 0.15 శాతానికి పెరగనుంది. ఆప్షన్ హక్కును వినియోగించుకోవడంపై విధించే ఎస్‌టీటీ కూడా ప్రస్తుత 0.125 శాతం నుంచి 0.15 శాతానికి చేరనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌టీటీ ద్వారా రూ.63,670 కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. తాజా పెంపుతో వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఎస్‌టీటీ వసూళ్లు రూ.73,700 కోట్లు ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఎఫ్‌పీఐలు వెనక్కి!

అయితే ఎఫ్ అండ్ ఓ లావాదేవీలపై ఎస్‌టీటీ పెంచడం స్వల్పకాలిక పెట్టుబడి లాభాల కోసం డెరివేటివ్స్‌లో మదుపు చేసే విదేశీ పోర్టుఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులను దెబ్బ తీసే అవకాశం ఉందని కోటక్ సెక్యూరిటీస్ ఎండీ, సీఈఓ శ్రీపాల్ షా ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో ట్రేడింగ్ పరిమాణం కూడా దెబ్బతినే ప్రమాదం కనిపిస్తోంది. ఈ భయంతోనే ఆదివారం అనేక బ్రోకరేజీ సంస్థల షేర్లు భారీగా నష్టపోయాయి.



ఎందుకంటే ?

ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ పూర్తిగా టెక్నికల్ అనాలిసిస్‌తో జరుగుతుంది. ఈ టెక్నికల్ అంశాలపై పెద్ద పెద్ద బ్రోకరేజీ సంస్థలకు, నిపుణులకు తప్ప సామాన్య రిటైల్ మదుపరులకు పెద్దగా పట్టు ఉండదు. అయినా రిటైల్ మదుపరుల్లో చాలా మంది ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ చేసి చేతులు కాల్చుకుంటున్నారు. ఈ ట్రేడింగ్ చేసే రిటైల్ మదుపరుల్లో 90 శాతం మంది నష్టపోతున్నారని సెబీ అధ్యయనంలోనే తేలింది. దీన్ని కట్టడి చేసేందుకు సెబీ కొన్ని చర్యలు తీసుకున్నా పెద్దగా ఫలితం లేదు. దీంతో ఈ లావాదేవీలపై ఎస్‌టీటీ పెంచడం ద్వారా దీన్ని కట్టడి చేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రయత్నం చేశారని భావిస్తున్నారు. బడ్జెట్ తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ కూడా ఇదే విషయం చెప్పారు. 'మార్కెట్లో స్పెక్యులేటివ్ ధోరణులకు చెక్ పెట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఆ లక్ష్యంలో భాగంగానే ఎఫ్ అండ్ ఓ లావాదేవీలపై ఎస్‌టీటీ పెంచాం' అని స్పష్టం చేశారు.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.93 లక్షల కోట్లు

జనవరిలో 6.2 శాతం వృద్ధి నమోదు

న్యూఢిల్లీ: జనవరి నెలలో వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 6.2 శాతం పెరుగుదలతో మూడు నెలల గరిష్ఠ స్థాయి రూ.1.93 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ఫలితంగా మార్కెట్లో పుంజుకున్న వినియోగం ప్రభుత్వానికి తగ్గిన ఆదాయాన్ని క్రమంగా భర్తీ చేస్తోందనడానికిది సంకేతమని విశ్లేషకులు పేర్కొన్నారు. గత నెలలో జీఎస్‌టీ రిఫండ్లు మాత్రం 3.1 శాతం తగ్గి రూ.22,665 కోట్లకు పరిమితమయ్యాయి. దాంతో, జీఎస్‌టీ నికర వసూళ్లు రూ.1.71 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2025 జనవరిలో నికర జీఎస్‌టీ ఆదాయంతో పోలిస్తే 7.6 శాతం వృద్ధి నమోదైంది. ఈ జనవరిలో దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్‌టీ స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 4.8 శాతం వృద్ధితో రూ.1.41 లక్షల కోట్లకు పెరిగింది. దిగుమతులపై పన్ను ఆదాయం 10.1 శాతం పెరిగి రూ.52,253 కోట్లకు చేరింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	500
వరంగల్	487	గోదావరి	467
చిత్తూరు	573	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	143
వరంగల్	130	గుంటూరు	143
కరీంనగర్	130	ఒంగోలు	143
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	126
కర్నూలు	130	నెల్లూరు	131
విశాఖపట్నం	135	అనంతపురం	131
గోదావరి	143		



మార్కెట్లకు ఎస్‌టీటీ దెబ్బ

ఇంట్రాడేలో సెన్సెక్స్ 2,370 పాయింట్లు డౌన్

చివరకు 1,546 పాయింట్ల పతనంతో 80,722 వద్ద క్లోజింగ్

రూ.9.4 లక్షల కోట్ల మదుపరుల సంపద హాంఫట్

ముంబై: డెరివేటివ్స్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) పెంపుపై ఈక్విటీ మార్కెట్ తీవ్రంగా స్పందించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్లో ఈ పన్నును 0.02% నుంచి 0.05 శాతానికి పెంచుతున్నట్టు ప్రతిపాదించారు. బడ్జెట్ ప్రతిపాదన నేపథ్యంలో ఆదివారం అయినప్పటికీ స్టాక్ ఎక్స్ఛేంజీలు ప్రత్యేక ట్రేడింగ్ సెషన్ నిర్వహించాయి. బడ్జెట్ ప్రతిపాదనలు ప్రారంభించినప్పుడు లాభాల్లో ఉన్న మార్కెట్ ఈ ప్రతిపాదన రాగానే ఉన్నట్టుండి భారీ పతనం చవిచూసింది. ఒక దశలో సెన్సెక్స్ 2,370.36 పాయింట్లు నష్టపోయి మానసిక అవధి 80,000 కన్నా కూడా దిగజారింది. తదుపరి నష్టాలు కొంత పూడ్చుకున్నా కల్లోలం తప్పలేదు. సెన్సెక్స్ 1,546.84 పాయింట్ల నష్టంతో 80,722.94 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 748.9 పాయింట్లు కోల్పోయినా ఆ నష్టాన్ని 495.20 పాయింట్లకు కుదించుకుని 24,825.45 వద్ద ముగిసింది.సెన్సెక్స్ షేర్లలో ఎస్‌బీఐ 5.61% నష్టపోగా అదానీ పోర్ట్స్ 5.53% నష్టపోయింది. టీసీఎస్, ఇన్ఫోసిస్, సన్ ఫార్మా, టైటన్ లాభపడ్డాయి బడ్జెట్ షాక్‌తో రూ.9.40 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ నికరంగా రూ.9,40,581.75 కోట్లు దిగజారి రూ.4,50,61,658.60 కోట్ల వద్ద స్థిరపడింది.

15లో 8 ప్రతికూల సెషన్లే

నరేంద్ర మోదీ సారథ్యంలో ఇప్పటివరకు ఎన్‌డీఏ ప్రభుత్వం 15 బడ్జెట్లు ప్రవేశపెట్టగా వాటిలో బడ్జెట్ ప్రతిపాదించిన రోజున ఎనిమిది సందర్భాల్లో మార్కెట్ ప్రతికూలంగానే స్పందించింది. వాటిలో రెండు మధ్యంతర బడ్జెట్లు (2019, 2024) కూడా ఉన్నాయి. గత ఏడాది బడ్జెట్ రోజున సెన్సెక్స్ కేవలం 5.39 పాయింట్లు లాభపడింది.

వెండి వెలవెల

బులియన్ మార్కెట్లో వెండి మరో భారీ పతనాన్ని నమోదు చేసింది. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్ ట్రేడ్‌లో మార్చి డెలివరీకి ఉద్దేశించిన వెండి కిలో రూ.26,273 క్షీణించి రూ.2,65,652 వద్ద ముగిసింది. వెండి ధరల పతనం వరుసగా ఇది రెండో రోజు. శుక్రవారం నాటి సెషన్‌లో కిలో వెండి ఒక్కసారిగా రూ.1,07,968 (27%) క్షీణించింది. దీంతో రెండు వరుస సెషన్లలో కిలో వెండి రూ.1,34,241 (33.6%) పడిపోయింది. గత నెల 23వ తేదీన కిలో వెండి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.3,34,699 పలికింది. కాగా గోల్డ్ ఫ్యూచర్స్ కూడా ఆదివారం భారీ ఆటుపోట్లకు లోనయింది. ఏప్రిల్ కాంట్రాక్టులకు ఉద్దేశించిన రూ.10 గ్రాముల బంగారం 9% నష్టపోయి రూ.1,38,634 వరకు దిగజారి దిగువ సర్క్యూట్‌ను తాకినా చివరికి నష్టాన్ని 3 శాతానికి కుదించుకుని రూ.1,48,104 వద్ద ముగిసింది.



ఆర్థిక వ్యూహ పరీక్షలో విఫలం



ఆర్థిక వ్యూహం, ఆర్థిక రాజనీతిజ్ఞత పరీక్షలో కేంద్ర బడ్జెట్ ఫెయిలైంది. వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా కేవలం రూ.95,000 కోట్లతో 125 రోజుల ఉపాధి ఎలా కల్పించగలరు. బడ్జెట్ నిరాశాజనకంగా ఉంది. రాష్ట్రాలకు నిధులు కేటాయించలేదు. భవిష్యత్తులో ఏం చేయబోతున్నారనే విషయంపై స్పష్టత కొరవడింది.

- మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం

2026-27

నక్సలిజాన్ని ఎదుర్కొనేందుకు 20 శాతం నిధుల పెంపు



దేశంలో నక్సలిజాన్ని ఎదుర్కొనే వ్యూహంలో భాగంగా భద్రత, మౌలికసదుపాయాల ఖర్చుల కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.3,610 కోట్లు కేటాయించారు. ఇది గత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనా రూ.3,006 కోట్లకన్నా 20 శాతం అధికం. మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని తుడిచిపెట్టాలన్న సంకల్పంతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉంది.



సుంకాలకు జంకం..
ఆత్మనిర్భర శంఖం



ఈసారి కాంజీవరం చీరలో..

ఏటా బడ్జెట్ వేళ.. చేనేత కళావైభవాన్ని చాటిచెప్పేలా నిర్మలా సీతారామన్ ధరించే చీరలు అందరి దృష్టిని ఆకర్షిస్తాయి. చేనేత కళపై తనకున్న మక్కువ చూపుతూ.. ఈ ఏడాది బడ్జెట్ ప్రసంగం కోసం సొంత రాష్ట్రమైన తమిళనాడుకు చెందిన కాంజీవరం చీరను ఎంచుకున్నారు. బంగారు రంగు జరీ అంచుతో ఉన్న ముదురు ఎరుపు(మెజెంటా) రంగు చీరను ఆమె పసుపు రంగు బ్లౌజ్‌తో జత చేశారు. త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన చీరను ధరించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇందులో మూలధన వ్యయానికే రూ.12.21 లక్షల కోట్లను కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే 8 శాతం అంటే.. దాదాపు లక్ష కోట్లను పెంచారు! భారత్ సహా ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చిప్‌ల కొరత! దాని పరిష్కారానికి గతంలో ఏర్పాటు చేసిన ఇండియా సెమీకండక్టర్ మిషన్‌ను విస్తరించారు. రూ.22,919 కోట్లతో గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించిన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ స్కీమ్‌కు కేటాయింపులను రూ.40 వేల కోట్లకు పెంచారు. అంతేనా, ఇప్పుడు ప్రపంచమంతా రేర్ ఎర్త్ మినరల్స్ చుట్టూ తిరుగుతోంది. అందుకే, గత ఏడాది నవంబరులో ప్రారంభించిన రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్స్ స్కీముకు కొనసాగింపుగా రేర్ ఎర్త్ కారిడార్స్ ఏర్పాటు చేయనున్నారు. ఆ ఖనిజాలు అధికంగా ఉన్న ఒడిసా, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చేయూత ఇవ్వనున్నారు. ఎగుమతి చేసే సముద్ర ఉత్పత్తుల ప్రాసెసింగ్‌కు ఉపయోగించే నిర్దిష్ట ముడి సరుకులపై సుంకం లేని దిగుమతుల పరిమితిని ఒకటి నుంచి మూడు శాతానికి పెంచారు. లెదర్, జౌళి ఉత్పత్తులు, సింథటిక్ ఫుట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల గడువును ఆరు నెలల నుంచి ఏడాదికి పెంచారు. కొన్ని రకాల రసాయనాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. అందుకే, మూడు కెమికల్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే, కంటెయినర్ల తయారీకి ఇప్పుడు డిమాండ్ పెరిగింది. అందుకే, రాబోయే ఐదేళ్లలో ఇందుకు రూ.10 వేల కోట్లను ఖర్చు చేయాలని సంకల్పించారు. బయో ఫార్మా మాన్యుఫాక్చరింగ్ హబ్ ఏర్పాటుకు రూ.10 వేల కోట్లను కేటాయించారు. ట్రంప్ సుంకాలతో దెబ్బ తిన్న టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి సమ్మిళిత, సమగ్ర వ్యూహాన్ని రచించారు. మరిన్ని మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 'స్వదేశీ'కి మూడంచెల వ్యూహాన్ని సిద్ధం చేశారు. మొదటి దశలో.. ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తున్న రక్షణ, ఇంధన, ఆరోగ్య రంగాల్లో స్వయంసమృద్ధిపై వెంటనే దృష్టి పెట్టనున్నారు. ఐదు మెడికల్ హబ్‌లు, మూడు ఆయుర్వేద సంస్థలను ఏర్పాటు చేస్తారు. రెండో దశలో.. ఇతర దేశాలతో పోటీ పడేలా సెమీ కండక్టర్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ ఎగుమతులకు పెద్దపీట వేయనున్నారు. మూడో దశలో.. దేశీయంగా సరసమైన ధరకు దొరకని ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటారు. వెరసి, ఒక్క మౌలిక సదుపాయాల రంగాని (ఇన్ఫ్రా)కే దాదాపు రూ.12 లక్షల కోట్లను ఖర్చు చేయనున్నారు. కాగా.. ఈసారి బడ్జెట్లో తెలుగు రాష్ట్రాలకు కాస్త ఊరట దక్కింది. దేశవ్యాప్తంగా ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో మూడు హైదరాబాద్ నుంచే ప్రారంభం కానున్నాయి. వీటిలో రెండు ఏపీతోనూ అనుసంధానం అవుతాయి. ఏపీలో రేర్ ఎర్త్ మినరల్ కారిడార్ ఏర్పాటు చేస్తారు. ఇక, హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారిన సంగతి తెలిసిందే. విశాఖలోనూ భారీ డేటా సెంటర్లు వస్తున్నాయి. వీటిని మరింత ప్రోత్సహించేలా విదేశీ కంపెనీలకు 2047 వరకూ ట్యాక్స్ హాలీడే ప్రకటించారు. జిల్లాకు ఒకటి చొప్పున బాలికల వసతి గృహాలూ ఏర్పాటు కానున్నాయి. అన్నదాతకు బడ్జెట్లో పెద్దగా తాయిలాలు లేవు. కానీ, కొబ్బరి రైతులకు కోకోనట్ ప్రమోషన్ స్కీమ్ ప్రకటించారు. జీడిపప్పు, కోకో, చందనం ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధికి ప్రణాళికలు రచించారు. మహిళలకు సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల తరహాలో సెల్ఫ్ హెల్ప్ మార్ట్‌లు మినహా పథకాలు ప్రకటించలేదు. ఎంఎస్ఎంఈలకు రూ.10 వేల కోట్లతో ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్‌ను; రూ.2000 కోట్లతో సెల్ఫ్ రిలయంట్ ఇండియా ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నారు. చివరిగా.. బడ్జెట్‌పై స్టాక్ మార్కెట్ పెదవి విరిచింది. ప్రారంభంలో పాజిటివ్‌గా కదలాడిన మార్కెట్ ఒక సందర్భంలో కుప్పకూలింది. సెన్సెక్స్ ఏకంగా 2400 పాయింట్లు పడిపోయింది. ఇందుకు కారణం.. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌ను నిరుత్సాహపరచడానికి సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ)ను ఫ్యూచర్స్‌లో 0.02 శాతం నుంచి 0.05 శాతానికి; ఆప్షన్స్‌లో 0.01 శాతం నుంచి 0.15 శాతానికి పెంచడమే.

85 నిమిషాల పాటు సాగిన బడ్జెట్ ప్రసంగం



వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించిన నిర్మల... ఈ ఏడాది తన ప్రసంగాన్ని 85 నిమిషాల్లో క్లుప్తంగా ముగించారు. ఆదివారం ఉదయం 11గంటలకు ప్రారంభమైన ప్రసంగం మధ్యాహ్నం 12:25నిమిషాలకు ముగిసింది. నిర్మలా సీతారామన్ గత ప్రసంగాల నిడివిని పరిశీలిస్తే.. చాలా వరకు ప్రసంగాలు 90 నుంచి 120 నిమిషాల మధ్యలో ముగిశాయి. 2020లో బడ్జెట్ ప్రసంగం.. ఆమె కెరీర్‌లోనే కాకుండా దేశ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన ప్రసంగంగా రికార్డు సృష్టించింది. అప్పట్లో ఆమె 2గంటల 40నిమిషాల పాటు మాట్లాడారు. 2024లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను కేవలం 56నిమిషాల్లోనే ముగించారు. గతేడాది (2025) బడ్జెట్ ప్రసంగం 1గంట 14నిమిషాల పాటు, 2019లో ఆర్థికమంత్రిగా తొలి బడ్జెట్ ప్రసంగం 2 గంటల 17నిమిషాల పాటు కొనసాగింది.

₹ నిర్మల గారి బడ్జెట్



వా.గ. - వాస్తవ గణాంకాలు
బ.అం. - బడ్జెట్ అంచనా
స.అం - సవరించిన అంచనా

వివరం	2024-25 (వా. గ.)	2025-26 (బ.అం.)	2025-26 (స. అం.)	2026-27 (బ.అం.)
1) రెవెన్యూ వసూళ్లు	30,36,619	34,20,409	33,42,323	35,33,150
ఎ)పన్ను ఆదాయం	25,00,039	28,37,409	26,74,661	28,66,922
బి) పన్నేతర ఆదాయం	5,36,580	5,83,000	6,67,662	6,66,228
2) మూలధన వసూళ్లు	16,16,249	16,44,936	16,22,519	18,141,65
ఎ) రుణ వసూళ్లు	24,617	29,000	30,190	38,397
బి) ఇతర వసూళ్లు	17,202	47,000	33,837	80,000
సి) రుణాలు	15,74,431	15,68,936	15,58,492	16,95,768
3) మొత్తం వసూళ్లు	46,52,867	50,65,345	49,64,842	53,47,315
4) పథకాలకు వ్యయం	36,00,914	39,44,255	38,69,087	41,25,494
5) పథకేతర వ్యయం	10,51,953	11,21,090	10,95,755	12,21,821
6) మొత్తం వ్యయం	46,52,867	50,65,345	49,64,842	53,47,315
7) రెవెన్యూ లోటు	5,64,296	5,23,846	5,26,764	5,92,344
8) ద్రవ్య లోటు	15,74,431	15,68,936	15,58,492	16,95,768


దేశీయంగా కంటైనర్ల తయారీకి రూ.10,000 కోట్లు

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో కంటైనర్ల తయారీ పథకానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.10,000 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. రానున్న ఐదేళ్లలో ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తారు. ఇంతవరకు వీటి తయారీపై కేంద్రం గట్టిగా దృష్టి పెట్టలేదు. అయితే సరకు రవాణాలో వీటి ప్రాధాన్యం ఎంతో ఉంది. భౌగోళిక రాజకీయ వ్యూహం వల్ల కూడా వీటి తయారీపై కేంద్రం దృష్టి సారించింది. ఎందుకంటే వీటి తయారీలో చైనాకు గుత్తాధిపత్యం ఉంది. అమెరికానూ ఈ విషయంలో ఆ దేశం ఇరుకున పెట్టింది. ఒకవేళ మన దేశంలో వీటికి కొరత ఏర్పడితే మన విదేశీ వాణిజ్యం దెబ్బతినడం ఖాయం. దీన్ని దృష్టిలో ఉంచుకునే కేంద్రం ఈ అంశానికి ప్రాధాన్యం ఇచ్చింది.



తయారీ అంతా అక్కడే..

సరకు రవాణాలో కంటైనర్లు ఎంతో అవసరం. అలాగే విదేశీ వాణిజ్యంలో నౌకాయానం ముఖ్యమైనది. ప్రపంచ వ్యాప్తంగా పరిమాణంలో 95 శాతం, విలువలో 70% వర్తకానికి నౌకాయానమే ఆధారం. దేశంలో 12కు పైగా మెగా.. 200కు పైగా చిన్న పోర్టుల నుంచి సరకు రవాణా జరుగుతుండగా.. ఇందుకు కంటైనర్లే పూర్తిగా ఆధారం. వీటి కొరత సరకు రవాణాపై ప్రభావం చూపుతుంది. కాగా ప్రపంచంలో వీటి తయారీ 95 శాతం చైనాలోనే జరుగుతోంది. మొత్తంగా చైనాలో తయారయ్యే కంటైనర్ల సంఖ్య 50 లక్షల యూనిట్లకన్నా ఎక్కువే ఉంది. ఇక మన దేశంలో ఏటా 30,000 యూనిట్లు మాత్రమే తయారవుతున్నాయి. చైనా-అమెరికా వాణిజ్య యుద్ధం కారణంగా గత ఏడాది చైనా వద్ద పెద్దసంఖ్యలో కంటైనర్లు ఉండిపోయాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా వీటి ధరలు 30 శాతం పెరిగే అవకాశం ఉందని భావించారు. ఈ కారణంగా దేశంలోనూ వీటి తయారీపై దృష్టి పెట్టాలన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కేంద్రం ప్రస్తుతం ఇందుకు నిధులు కేటాయించినందున కంటైనర్ల తయారీ ఊపందుకునే అవకాశం ఉంది.



ఆరోగ్యానికి తొలిసారి లక్ష కోట్లకుపైగా నిధులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో ఆరోగ్య సంరక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు బడ్జెట్‌లో తొలిసారి రూ.లక్ష కోట్లకుపైగా నిధులను కేంద్రం కేటాయించింది. ఈ రంగానికి రూ.1,04,599 కోట్లను ప్రతిపాదించింది. ఇది 2025-26 బడ్జెట్ కేటాయింపుల కంటే 10 శాతం ఎక్కువ.. ఆస్పత్రుల ఆధునికీకరణ, వైద్య సిబ్బందికి శిక్షణ, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఈ నిధులు వినియోగించనున్నారు. దేశాన్ని ప్రధాన వైద్య పర్యాటక గమ్యస్థానంగా మార్చేందుకు ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో ఐదు ప్రాంతీయ వైద్య పర్యాటక కేంద్రాల (రీజినల్ మెడికల్ టూరిజం హబ్)ను ఏర్పాటు చేసి రాష్ట్రాలకు చేయూతనందిస్తామని కేంద్రం తెలిపింది. అపోలో, మ్యాక్స్, ఫోర్టిస్, డాక్టర్ లాల్‌పాత్‌ల్యాబ్స్, మెట్రోపొలిస్ ఇందుకు సహకరిస్తాయని వివరించింది. 'కొత్తగా మూడు ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద సంస్థలను ఏర్పాటు చేయనున్నాం. సేవల నాణ్యతను పెంచడానికి ఆయుష్ ఫార్మసీలను, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లను అప్‌గ్రేడ్ చేస్తాం. ఇక మానసిక ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు బెంగళూరులోని నేషనల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్-నిమ్హాన్స్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్) తరహాలో ఉత్తర భారతదేశంలోనూ నిమ్హాన్స్ 2.0 ఏర్పాటు చేయనున్నాం.' అని వివరించింది. 'దివ్యాంగ్ సహారా యోజన' కింద అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అధిక నాణ్యత కలిగిన సహాయక పరికరాలు అందించనున్నట్లు కేంద్రం పేర్కొంది. .

జాతీయ ఆరోగ్య మిషన్‌కు రూ.39,390 కోట్లు..

ఆరోగ్య సంరక్షణ రంగంలో జాతీయ ఆరోగ్య మిషన్‌కు రూ.39,390 కోట్లు కేటాయించారు. స్వయం ప్రతిపత్తిగల సంస్థలకు రూ.22,343.97 కోట్లు, ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ-పీఎం-జేఏవై)కు రూ.9,500 కోట్లు ప్రతిపాదించారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం-ఏబీహెచ్ఐఎం)కు రూ.4,200 కోట్లు కేటాయించారు.

రెవెన్యూ లోటు గ్రాంటుకు స్వస్తి

రాష్ట్రానికి షాకిచ్చిన కేంద్రం.. మిగతా రాష్ట్రాలకూ ఇంతే

అమరావతి/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలకు కేంద్రం ప్రతి నెలా ఇచ్చే రెవెన్యూ లోటు గ్రాంటును, ప్రత్యేక గ్రాంట్లను పూర్తిగా నిలిపివేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఐదేళ్ల పాటు వాటికి ఇవేవీ అందవు. ఈ నిర్ణయం అన్ని రాష్ట్రాలకే పెద్ద షాకే. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచీ రెవెన్యూ లోటులోనే కొట్టుమిట్టాడుతున్న ఆంధ్రప్రదేశ్‌కైతే కోలుకోలేని దెబ్బ. తమ ఖర్చులకు తగినట్లుగా సంపాదించుకునే సామర్థ్యం రాష్ట్రాలన్నిటికీ ఉందని.. అందుకే గ్రాంట్లు నిలిపివేస్తున్నట్లు 16వ ఆర్థిక సంఘం పేర్కొంది. దాని సిఫారసులను కేంద్రప్రభుత్వం ఆమోదించింది. రెవెన్యూ లోటు గ్రాంటు ఏటా రూ.10,000 కోట్లు వస్తుందన్న అంచనాలతో ఏపీ ప్రభుత్వం ఉంది. ఈ మేరకు రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఈ తరుణంలో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్ర బడ్జెట్ తలకిందులు కానుంది. వెనుకబడిన జిల్లాలకు, కొన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం ఇస్తున్న గ్రాంట్లు కూడా ఇక అందవు. ఆరేళ్లుగా ఏపీ రెవెన్యూ లోటులోనే ఉందని ఇటీవల కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సర్వే తెలిపింది. తాజా బడ్జెట్‌లో రాష్ట్రాలకు కేంద్రం కేటాయించే పన్నుల వాటా మొత్తంలో ఏపీకి 4.217 శాతం కేటాయించారు. 2011 జనాభా లెక్కలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలన్న నిబంధనను దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకించాయి. అయినప్పటికీ వాటినే పరిగణనలోకి తీసుకున్నారు. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. గత ఆర్థిక సంఘం జనాభా నియంత్రణకు 12.5 శాతం వెయిటేజీ ఇవ్వగా.. ఈసారి 2.5 శాతానికి తగ్గించారు. జనాభాకు 2.5 శాతం వెయిటేజీ పెంచడం, జనాభా నియంత్రణ చర్యలకు 2.5 శాతం వెయిటేజీ తగ్గించడం ఈ రెండూ ఏపీకి నిధులు తగ్గించే చర్యలే. 5 శాతం వెయిటేజీని ఇక్కడ కోల్పోయింది.

రెవెన్యూ నిల్వలు అడుగంటాయ్..: రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఆర్థిక పరిస్థితి 2014-15 నుంచీ డోలాయమానంగానే ఉందని 16వ ఆర్థిక సంఘం పేర్కొంది. రెవెన్యూ, ఆర్థిక లోటులను నియంత్రించేందుకు పోరాడుతోందని.. రాష్ట్ర రెవెన్యూ నిల్వలు పూర్తిగా అడుగంటాయని.. ద్రవ్య లోటు ఏటా మూడు శాతం మేరకు ఉంటోందని తెలిపింది. 'ఏపీలో రూ.15,133 కోట్ల విద్యుత్ సబ్సిడీలు కల్పిస్తున్నారు. డిస్కంల రుణం 28 శాతానికి చేరుకుంది. సామాజిక పింఛన్లకు అత్యధిక వ్యయం భరిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. అన్నదాత సుఖీభవ పేరుతో భారీగా నగదు బదిలీ చేస్తున్న రాష్ట్రాల్లో ఏపీ కూడా ఉంది' అని తెలిపింది. ప్రత్యేక మౌలిక సదుపాయాల కింద విశాఖపట్నం, విజయవాడలకు నిధులు కేటాయించాలని సిఫారసు చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేషన్లను అడ్డంపెట్టుకుని తీసుకొస్తున్న ఆఫ్ బడ్జెట్ అప్పులను తేవడం ఇకపై ఆపేయాలని సూచించింది. జీఎస్‌డీపీలో అప్పుల శాతం 3 శాతానికి మించకూడదని సూచించింది. ఇప్పటి వరకు కార్పొరేషన్లను అడ్డం పెట్టుకుని బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి తెచ్చిన అప్పులను బడ్జెట్లో పొందుపరచాలని పేర్కొంది. ఇకపై ఇలాంటి ఆఫ్ బడ్జెట్ అప్పులిచ్చే బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్థితిగతులు వివరించేలా ఆన్‌లైన్ ఫ్రేమ్‌వర్క్‌ను తయారుచేయాలని సూచించింది. ఈ సూచనలను తాము విడిగా పరిశీలిస్తామని కేంద్రం తెలిపింది.

అంశాల వారీగా 16వ ఆర్థిక సంఘం కేటాయింపులు

అంశం	శాతం
జనాభా (2011 ప్రకారం)	17.5
జనాభా నియంత్రణ పనితీరు	10
రాష్ట్ర విస్తీర్ణం	10
అటవీ విస్తరణ	10
తలసరి ఆదాయ వెనుకబాటు	42.5
పన్ను - జీడీపీ నిష్పత్తి	10
మొత్తం	100

కేంద్ర పన్నుల్లో ముఖ్యమైన రాష్ట్రాలకు దక్కనున్న వాటా

రాష్ట్రం	వాటా (శాతంలో)
ఆంధ్రప్రదేశ్	4.217
తెలంగాణ	2.174
ఉత్తరప్రదేశ్	17.62
బిహార్	9.94
మధ్యప్రదేశ్	7.35
పశ్చిమబెంగాల్	7.21

రాష్ట్రాలకు ఏమిచ్చారు?



పన్నులు, పథకాలు, గ్రాంట్ల రూపంలో..

(రూ.లక్షల కోట్లలో)

	ఆర్థిక కమిషన్ గ్రాంట్లు	పథకాలు	రాష్ట్రాల వాటా
2024-25	1.21	8.18	12.86
2025-26	1.53	7.90	13.93
2026-27	1.29	9.65	15.26

పీఎఫ్ ట్రస్ట్ నిబంధనల హేతుబద్ధీకరణ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: పీఎఫ్ ట్రస్ట్‌లకు సంబంధించిన నిబంధనలను హేతుబద్ధీకరించాలని కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ఉద్యోగుల తరఫున సంస్థ యజమాని చెల్లించే వాటాలో సమానత్వంతో పాటు శాతం ఆధారిత పరిమితులను తొలగించాలని పేర్కొన్నారు. వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహించడమే దీని లక్ష్యమని తెలిపారు. ఇందులో భాగంగా యజమానులు, ఉద్యోగుల మధ్య సమాన విరాళాల వాటా తప్పనిసరి అనే నిబంధనను తొలగిస్తారు. ఇది కంపెనీలు అదనపు వాటా ఇవ్వడాన్ని సులభతరం చేస్తుంది.

గ్రామీణ ఉపాధికి ఆర్థిక చేయూత



గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధికి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి బడ్జెట్‌లో పెద్దమొత్తంలో నిధులు కేటాయించింది. ఏడాదిలో 125 రోజులు ఉపాధి పనులు కల్పించే లక్ష్యంతో ఇటీవల కొత్తగా ప్రకటించిన వీబీ-జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (గ్రామీణ్)) పథకానికి 2026-27 బడ్జెట్‌లో రూ. 95,692.31 కోట్లు కేటాయించారు. ఈ పథకాన్ని మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ (ఎంజీఎన్ఆర్ఈజీఏ) స్థానంలో తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే వీబీ-జీ రామ్ జీ పథకం అమల్లోకి వచ్చేవరకు ఎంజీఎన్ఆర్ఈజీఏ కొనసాగుతోంది. పెండింగ్ పనులు పూర్తి చేస్తారు. దీనికి రూ. 30 వేల కోట్లను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు.


'ఉడాన్'కు రూ.550 కోట్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో చిన్న నగరాలకూ విమాన సర్వీసులు నడిపేందుకు, విమాన ప్రయాణాన్ని సామాన్యులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన ఉడాన్ పథకానికి బడ్జెట్‌లో పెద్దగా నిధులు పెంచలేదు. గత ఏడాది రూ.540 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాల ప్రకారం ఆ మొత్తం ఇంకా తక్కువకు రూ.434 కోట్లకు చేరింది. తాజా బడ్జెట్‌లో రూ.550 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రాంతీయ అనుసంధానత లక్ష్యంతో 2016లో ప్రవేశపెట్టిన ఈ పథకానికి గతంతో పోలిస్తే నిధుల కేటాయింపు తగ్గింది.



రోడ్డు రవాణ, హైవేల శాఖకు 3.09 లక్షల కోట్లు



2026-27 బడ్జెట్‌లో రోడ్డు రవాణ, హైవేల శాఖకు 3.09లక్షల కోట్లు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.2.87లక్షల కోట్లతో పోలిస్తే ఇది సుమారు 8శాతం ఎక్కువ. అలాగే నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)కి గతేడాది రూ.170 లక్షల కోట్లు కేటాయించగా దాన్ని ఈసారి రూ.1.87 లక్షల కోట్లకు పెంచాలని ప్రతిపాదించారు.

దేశ వాస్తవ సంక్షోభాలను పట్టించుకోలేదు



దేశ వాస్తవ సంక్షోభాలను కేంద్ర బడ్జెట్ పట్టించుకోలేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. యువతకు ఉద్యోగాలు లేవని, తయారీ రంగం పతనమైపోతోందని, రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నా పట్టించుకోలేదన్నా రు. పెట్టుబడిదారులు తమ పెట్టుబడులు ఉపసంహరించుకుంటున్నారని, కుటుంబాల గృహ పొదుపు తగ్గిపోయిందని, ప్రపంచదేశాల నుంచి ఎదురుదెబ్బలు తగులుతున్నా విస్మరించారని చెప్పారు.

- ప్రతిపక్ష నేత రాహుల్ విమర్శ



కీలక రంగాలు.. కేటాయింపులు

(రూ. కోట్లలో)

- 1,62,671 వ్యవసాయం
- 1,39,289 విద్య
- 1,04,599 ఆరోగ్యం
- 85,522 పట్టణాభివృద్ధి
- 2,55,234 హోంశాఖ
- 2,73,108 గ్రామీణాభివృద్ధి
- 74,560 ఐటీ, టెలికాం
- 1,09,029 ఇంధన శాఖ
- 62,362 సాంఘిక సంక్షేమం
- 55,756 శాస్త్రీయ విభాగాలు

రాబడి కట్.. స్కీములు ఫట్!

ఈ ఏడాది కేంద్రానికి 1.92 లక్షల కోట్ల మేరకు తగ్గిన ఆదాయం

- ఆదాయ పన్ను 1.26 లక్షల కోట్లు.. జీఎస్టీ 1.31 లక్షల కోట్లకు గండి
- దీనికితోడు, రక్షణ, ఎరువులు, ఆహార సబ్సిడీకి భారీగా పెరిగిన వ్యయం
- ఆర్థిక సంఘం గ్రాంట్ల కింద రూ.20 వేల కోట్ల మేర ఎక్కువ చెల్లింపులు
- ఫలితంగా.. శాఖల కేటాయింపుల్లో భారీ కోతలు.. ఇళ్లు, రోడ్లకు మొండిచేయి
- ఒక్క కేంద్ర ప్రాయోజిత పథకాల అమల్లోనే రూ.1.21 లక్షల కోట్లకు కోతలు



కేంద్ర ప్రభుత్వానికి ఈ ఏడాది ఆదాయం పడిపోయింది. మరీ ముఖ్యంగా.. ఆదాయ పన్ను, జీఎస్టీ వసూళ్లు అంచనాలకు ఎంతో దూరంగా ఉండిపోయాయి. అదే సమయంలో, ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఆపరేషన్ సిందూర్ కారణంగా రక్షణ శాఖకు, అంతర్జాతీయ పరిణామాల కారణంగా ఎరువులు, ఆహార సబ్సిడీకి ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చింది. ఫలితం.. ప్రజలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరే వివిధ పథకాల్లో కోతలు పెట్టాల్సి వచ్చింది. ఇళ్లకు, రోడ్లకు కోతలు పెట్టి, తాగు నీటి పథకాలను రద్దు చేయాల్సి వచ్చింది.

2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం పన్ను వసూళ్లు రూ.42,70,233 కోట్లు వస్తాయని బడ్జెట్లో కేంద్రం అంచనా వేసింది. కానీ, సవరించిన అంచనాల్లో అది రూ.40,77,772 కోట్లకు తగ్గింది. అంటే, ప్రభుత్వానికి రావాల్సిన పన్ను ఆదాయం రూ.1,92,461 కోట్లు పడిపోయింది. ఇందులో ఒక్క ఆదాయ పన్నే ఏకంగా రూ.1.26 లక్షల కోట్లు పడిపోవడం విశేషం. గత ఏడాది బడ్జెట్లో ప్రకటించిన కొత్త స్లాబులు ఈ ఆర్థిక సంవత్సరం నుంచే అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. కొత్త ఆదాయ పన్ను చట్టం ప్రకారం ఏడాదికి రూ.12 లక్షల వరకూ ఆదాయం ఉన్న వారికి పన్ను నుంచి మినహాయింపు ఇచ్చింది. దీంతో కొత్తగా ఆదాయపన్ను పరిధిలోకి వచ్చేవారి సంఖ్య తగ్గిపోయింది. అంతేనా.. ఆర్థిక సంక్షోభం కారణంగా చాలా రంగాల్లో కొత్త నియామకాలు నిలిచిపోయాయి. వేతన పెంపులు కూడా ఆగిపోయాయి. రియల్ ఎస్టేట్ సంక్షోభం కారణంగా క్రయవిక్రయాలు మందగించడంతో క్యాపిటల్ గెయిన్స్ ద్వారా వచ్చే ఆదాయం కూడా సర్కారుకు పడిపోయింది. ఫలితంగా, ఈ ఏడాది ఆదాయ పన్నులో లక్ష కోట్లకుపైగా రాబడి పడిపోయింది. ఇక, జీఎస్టీ వసూళ్లదీ కూడా ఇదే తంతు! ఈ ఆర్థిక సంవత్సరంలోనే జీఎస్టీ స్లాబులను కేంద్ర ప్రభుత్వం గణనీయంగా తగ్గించిన విషయం తెలిసిందే. దాంతో, జీఎస్టీ ఆదాయం ఏకంగా రూ.1.31 లక్షల కోట్లు పడిపోయింది. గత బడ్జెట్లో జీఎస్టీ కింద రూ.11,78,000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తే.. సవరించిన అంచనాల్లో ఆ మొత్తం కేవలం రూ.10,46,480 కోట్లు మాత్రమే. ద్రవ్యోల్బణం పెరగడంతో మధ్య తరగతి ప్రజలు సొంత ఖర్చు తగ్గించుకున్నారు. వినియోగం పడిపోవడంతో జీఎస్టీ వసూళ్లూ తగ్గిపోయాయి. అయితే, ఆదాయ పన్ను, జీఎస్టీల్లో రెండున్నర లక్షల కోట్లకుపైగా ఆదాయం పడిపోయినా.. కార్పొరేషన్ ట్యాక్స్, కస్టమ్స్, ఎక్సైజ్ శాఖలు కేంద్ర ప్రభుత్వాన్ని కాస్త ఆదుకున్నాయి. అంచనా వేసిన దానికంటే కార్పొరేషన్ ట్యాక్స్ రూ.27 వేల కోట్లు; కస్టమ్స్ రూ.18,290 కోట్లు; ఎక్సైజ్ పన్ను రూ.19,550 కోట్ల ఆదాయం పెరిగింది. ఆదాయం తగ్గినా ఆర్బీఐ, ప్రభుత్వ బ్యాంకుల నుంచి కేంద్రానికి రావాల్సిన డివిడెండ్లు అంచనా వేసిన వాటి కంటే రూ.50 వేల కోట్లు పెరగడం కాస్త ఊరట. ఇక్కడ మరో ముఖ్య విషయం ఏమిటంటే.. కేంద్ర ప్రభుత్వ ఆదాయం పడిపోవడంతో ఆ ప్రభావం అంతిమంగా రాష్ట్రాలపైనా పడింది. రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చే వాటా కూడా తగ్గిపోయింది. రాష్ట్రాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.14,22,444 కోట్లు పంచాలని అంచనా వేస్తే.. సవరించిన అంచనాల్లో ఈ మొత్తాన్ని రూ.13,92,971 కోట్లకు కుదించారు.

ఇళ్లు, రోడ్లకు మొండిచేయి

కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం పడిపోవడంతో కీలక శాఖల కేటాయింపుల్లో కోతలు విధించాల్సి వచ్చింది. ఫలితంగా, ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కలేదు. ఉదాహరణకు, గ్రామీణ పేదలు ఇళ్లు కట్టుకోవడానికి అమలు చేసే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) పథకం కింద బడ్జెట్లో రూ.54,832 కోట్లు కేటాయిస్తే.. సవరించిన అంచనాల్లో అది కాస్తా రూ.32,500 కోట్లకు తగ్గిపోయింది. అంటే, ఒక్క ఈ పథకంలోనే రూ.22,332 కోట్లకు కోతలు పెట్టారు. ఇక, గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి పథకాలకు గత బడ్జెట్లో రూ.67 వేల కోట్లు కేటాయించారు. కానీ, కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. గ్రామీణ రోడ్ల విషయంలోనూ ఇదే పరిస్థితి. పీఎంజీఎస్‌వై పథకం కింద 2025-26 బడ్జెట్లో రూ.19 వేల కోట్లు కేటాయించారు. కానీ, కేవలం రూ.11 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంతేనా.. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపైనా ప్రభావం పడింది. వీటి అమలుకు గత బడ్జెట్లో రూ.5,41,850 కోట్లను కేటాయించారు. కానీ, రూ.4,20,078 కోట్లను మాత్రమే ఖర్చు చేశారు. అంటే, దేశవ్యాప్తంగా కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు రూ.1.21 లక్షల కోట్లు కోత పెట్టారన్నమాట. ఇందులో భాగంగా పీఎంఏవై (అర్బన్)కు రూ.19,794 కోట్లను కేటాయించి కేవలం రూ.7,500 కోట్లు ఖర్చు చేశారు. పీఎంఏవై అర్బన్ 2.0 కింద రూ.3500 కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించారు. కానీ, కేవలం రూ.300 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పీఎం సూర్య ఘర్ యోజన కింద 20 వేల కోట్లను ఖర్చు చేస్తామని ప్రకటించి 17 వేల కోట్లను మాత్రమే ఖర్చు చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కిందకు వచ్చే మిగిలిన స్కీములదీ ఇదే పరిస్థితి. దీనికితోడు, వివిధ శాఖలకు గత బడ్జెట్లో చేసిన కేటాయింపులనూ గణనీయంగా తగ్గించాల్సి వచ్చింది. మరో విశేషం ఏమిటంటే.. 2023-24 ఆర్థిక సంవత్సరం వరకూ ఆయా శాఖలకు కేటాయింపుల కంటే ఖర్చు ఎక్కువగా ఉండేది. కానీ, ఆ ఏడాది నుంచి ఏటా కేటాయింపు కంటే ఖర్చు తగ్గిపోతూ రావడం గమనార్హం.

- సెంట్రల్ డెస్క్

ఈ రంగాలకు కోసేశారు..

(రూ. కోట్లలో)

రంగం	2025-26 బడ్జెట్ అంచనా	2025-26 సవరణ	తగ్గుదల
ఐటీ-టెలికాం	86,898	53,946	32,952
పట్టణాభివృద్ధి	96,777	57,204	39,573
గ్రామీణాభివృద్ధి	2,65,817	2,12,750	53,067
శాస్త్రీయ విభాగాలు	55,679	37,014	18,665
పన్ను యంత్రాంగం	1,86,632	74,540	1,12,092
విద్య	1,28,650	1,21,949	6,701
ఆరోగ్యం	98,311	94,625	3,686
వ్యవసాయం	1,58,838	1,51,853	6,985
సాంఘిక సంక్షేమం	60,052	50,053	9,999

రక్షణకు భారీగా ఖర్చు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రక్షణ శాఖకు భారీగా ఖర్చు చేయాల్సి వచ్చింది. గత బడ్జెట్లో రక్షణ శాఖకు రూ.4,54,773 కోట్లు కేటాయించగా.. సవరించిన అంచనాల్లో దీనిని రూ.5,30,895 కోట్లకు పెంచారు. అంటే, కేటాయించిన మొత్తం కంటే రూ.76,122 కోట్లను ఎక్కువగా ఖర్చు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే చోటు చేసుకున్న ఆపరేషన్ సిందూర్‌తోపాటు దాని పర్యవసానంగా భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవడానికి తయారీని, కొనుగోళ్లను భారీగా పెంచడమే ఇందుకు కారణం. ఇక, ఎరువుల సబ్సిడీ కూడా ఊహాతీతంగా పెరిగిపోయింది. బడ్జెట్లో ఇందుకు రూ.1,64,000 కోట్లు కేటాయించగా.. చివరికి రూ.2,10,230 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. అంటే, రూ.46 వేల కోట్లు ఎక్కువగా ఖర్చయింది. ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధమే ఇందుకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. అలాగే, ఆహార సబ్సిడీకి గత బడ్జెట్లో రూ.2,05,250 కోట్లు కేటాయించారు. కానీ, రూ.2,25,000 కోట్లను ఖర్చు చేశారు. దాదాపు రూ.20 వేల కోట్లు ఈ వ్యయం పెరిగింది. అలాగే, ఆర్థిక సంఘం కింద ఇచ్చే గ్రాంట్లను కూడా రూ.20 వేల కోట్లు ఎక్కువగా చెల్లించాల్సి రావడమూ ఖర్చు పెరగడానికి మరో కారణం. ఆర్థిక సంఘం గ్రాంట్ల కింద గత బడ్జెట్లో రూ.1,32,767 కోట్లను కేటాయిస్తే.. చివరికి రూ.1,52,953 కోట్లను ఖర్చు చేయాల్సి వచ్చింది.


దేశీయంగా విమానాల తయారీకి ఊతం

పౌర, శిక్షణ విమానాల తయారీకి అవసరమైన భాగాలు,

విడిభాగాలపై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో విమానయాన రంగంలో విప్లవాత్మక మార్పులకు కారణమయ్యే రెండు కీలక నిర్ణయాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకున్నారు. వాటిలో ఒకటి.. పౌర, శిక్షణ, ఇతర విమానాల తయారీకి అవసరమైన భాగాలు, విడిభాగాలపై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు. రెండోది.. రక్షణ విభాగాలు నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాల్ కోసం ఉపయోగించే భాగాల తయారీకి ముడిపదార్థాల దిగుమతిపైన కూడా ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు. ఈ రెండు నిర్ణయాలూ దేశ రక్షణ-ఏరోస్పేస్ ఇండస్ట్రీకి ఊతమివ్వనున్నాయి. ముఖ్యంగా.. మొదటి నిర్ణయం వల్ల దేశంలో దేశీయంగా విమానాల తయారీ ఊపందుకునే అవకాశం ఉంటుంది. ఎందుకంటే.. సుంకాల కారణంగా విమానాల తయారీకి అవసరమైన విడిభాగాలను దిగుమతి చేసుకోవడం ప్రస్తుతం ఖరీదైన వ్యవహారంగా ఉంది. కానీ, బేసిక్ కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు వల్ల ఇప్పటికే ఈ రంగంలో ఉన్న విదేశీ దిగ్గజ కంపెనీలతోపాటు, దేశీయ స్టార్టప్‌లు కూడా విడిభాగాలను దిగుమతి చేసుకుని మనదేశంలోనే విమానాల అసెంబ్లింగ్‌కి ఎక్కువగా ఆసక్తి చూపుతాయి. విమానాల మరమ్మతులు, నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతాయి. దీనివల్ల.. ఇప్పటిదాకా రక్షణ రంగానికి మాత్రమే పరిమితమైన 'భారత్‌లోనే తయారీ' పౌర విమానయాన రంగానికీ విస్తరిస్తుంది. తద్వారా ఉపాధి అవకాశాలూ పెరుగుతాయి. విమానాల మరమ్మతు, నిర్వహణ ఖర్చులు తగ్గడం వల్ల.. ప్రయాణికులపై పడే టికెట్ భారం కూడా తగ్గుతుంది.


దేశంలో ఒక్కొక్కరి తలపై.. రూ.1.34 లక్షల అప్పు!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలోని 147 కోట్ల మంది జనాభాలో ప్రతి ఒక్కరిపై ఈ ఏడాది మార్చి నాటికి రూ.1.34 లక్షల అప్పుంది. ఇది వ్యక్తులు చేసిన అప్పు కాదు!. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణం!!. అయినప్పటికీ.. ఈ సంవత్సరం(2026-27) కూడా భారీ స్థాయిలో అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.14.61 లక్షల కోట్ల అప్పులు చేసిన కేంద్రం.. రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.17.2 లక్షల కోట్ల రుణాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణానికి 17 శాతం ఎక్కువ కావడం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ.53.47 లక్షల కోట్లకు బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇందులో మార్కెట్ నుంచి మొత్తం రూ.17.2 లక్షల కోట్లు సేకరించాల్సి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల వెల్లడించారు. 2025-26 సవరించిన అంచనాల ప్రకారం కేంద్రం మొత్తం అప్పులు రూ.1,97,18,016 కోట్లు కాగా.. మార్చి 2027 నాటికి ఇది 2,14,82,050 కోట్లకు చేరనుంది. ఇక జీడీపీలో రుణ నిష్పత్తిని 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ నిష్పత్తి 2019లో 50 శాతంలోపే ఉంది. ఇక తాజాబడ్జెట్‌లో జీడీపీలో ద్రవ్యలోటును 4.3 శాతంగా అంచనా వేశారు.

ముందుచూపు బడ్జెట్

రాష్ట్రాభివృద్ధికి మరింత దూకుడు ప్రదర్శించే వెసులుబాటు: సీఎం



అమరావతి/కుప్పం/శాంతిపురం,, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను స్వాగతిస్తున్నా. దేశం నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ముందుచూపుతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం దృష్టి సారించిన అంశాల్లో మరింత దూకుడుగా వెళ్లేందుకు ఈ బడ్జెట్ సహాయకారిగా నిలుస్తుంది. రాష్ట్రం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఈ బడ్జెట్ మరింత ఊతమిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎంఎస్ఎంఈలపై దృష్టి సారించింది. వీటిని మరింత బలోపేతం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉపకరించనుంది. మహిళలు, రైతులు, యువత సాధికారత సాధించేలా బడ్జెట్ రూపకల్పన జరిగింది. 2047 వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు బడ్జెట్ దోహదపడుతుంది. ప్రధాని మోదీ నిర్దేశకత్వంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఏఐ సహా వివిధ టెక్నాలజీలు, నెక్ట్స్ లెవల్ ఆఫ్ రిఫార్మ్స్‌కు బడ్జెట్ దోహదపడుతుంది. రెన్యూవబుల్ ఎనర్జీ, వన్ గ్రిడ్ వన్ నేషన్ దిశగా బడ్జెట్ అడుగులు వేయిస్తోంది. స్వల్ప, దీర్ఘకాలిక లక్ష్యాల సమ్మేళనంగా బడ్జెట్ రూపకల్పన చేయడం బాగుంది. మెరుగైన జీవన ప్రమాణాలు, ఈజ్ ఆఫ్ లివింగ్‌కు ఈ బడ్జెట్ బాటలు వేస్తుంది. హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ ద్వారా రాష్ట్రానికి ఎంతో ఉపయోగం కలుగుతుంది. తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాలు ఈ కారిడార్‌లో కవర్ అవుతాయి. బెంగళూరు - చెన్నై హైస్పీడ్ కారిడార్ వల్ల పలమనేరు, చిత్తూరు తదితర ప్రాంతాలు కవర్ అవుతాయి. డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్‌లో ఏపీ కూడా ఉండటంతో అత్యంత విలువైన ఖనిజాలు వెలికి తీసి క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి ఉపయోగించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఐఎస్ఎం 2.0 ద్వారా సెమీ కండక్టర్‌కు రూ.40 వేల కోట్లు కేటాయించారు. టెక్స్‌టైల్ సెక్టార్‌కు ఊతమిచ్చారు. ఇవి మన రాష్ట్రానికి ఎంతో ఉపకరిస్తాయి. కేంద్ర బడ్జెట్‌లో పర్యాటకానికి, ఆతిథ్య రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు.' అని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.

రూపాయి రాక

- అప్పుల ద్వారా 24
- ఆదాయ పన్ను 21
- జీఎస్టీ, పన్నులు 15
- కార్పొరేట్ పన్ను 18
- పన్నేతర ఆదాయం 10
- ఎక్సైజ్ సుంకం 6
- కస్టమ్స్ 4
- రుణేతర మూలధన వసూళ్లు 2

రూపాయి పోక

- కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా 22
- వడ్డీ చెల్లింపులు 20
- కేంద్ర పథకాలకు 17
- రక్షణకు 11
- కేంద్ర ప్రాయోజిత పథకాలకు 8
- ఆర్థిక సంఘం, ఇతర బదిలీలకు 7
- ఇతర వ్యయం 7
- సబ్సిడీలకు 6
- పెన్షన్లు 2

విలువలు పైసల్లో..



అంతరిక్ష రంగానికి రూ.13,705 కోట్లు



ఇస్రో భవిష్యత్తు ప్రణాళికలకు ఊతమిచ్చేలా అంతరిక్ష రంగానికి బడ్జెట్‌లో రూ.13,705.60 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అంచనా రూ.13,416 కోట్లు కాగా, సవరించిన అంచనాల ప్రకారం ఈ విభాగానికి రూ.12,448.60 కోట్లు లభించాయి.

2026-27

వాస్తవాలతో విమర్శలు చేస్తే స్పందిస్తాం

భారత ఆర్థిక వ్యవస్థ, దాని మూలాలు, ప్రాథమిక అంశాలు పటిష్ఠంగా ఉన్నాయి. రాహుల్‌గాంధీ వాదనకు మూలమేంటో వాస్తవాలతో చెబితే.. ఆయన మాటలు వినడమే గాక స్పందించేందుకూ సిద్ధం. ఎకానమీ దిశను సరిదిద్దాలన్న ఆయన మాటలు నాకు అర్థం కాలేదు. మన ఆర్థిక వ్యవస్థ మూలాలు పటిష్ఠంగా ఉన్నాయి.. ఏం దిద్దుబాట్లు చేయాలి?'ప్రపంచ ఆర్థిక అనిశ్చితి కారణంగా మన రంగాలు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నాయి. అందుకే చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం విభిన్న పథకాలు తీసుకొచ్చాం.

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



రక్షణకు పెద్ద పీట

రూ.7.85 లక్షల కోట్లు కేటాయించిన నిర్మలమ్మ.. గత ఏడాదితో పోలిస్తే 15% ఎక్కువ




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్‌ల నుంచి ఎదురవుతున్న సవాళ్లతోపాటు, 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో దేశ రక్షణను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన కేంద్రం.. బడ్జెట్‌లో ఈసారి రక్షణ శాఖకు భారీగా రూ.7,84,678 కోట్లు కేటాయించింది. ఇది మన జీడీపీలో 2 శాతానికి సమానం. రక్షణ శాఖకు నిరుడు కేటాయించిన 6.81 లక్షల కోట్లతో పోలిస్తే ఈసారి కేటాయించిన మొత్తం 15శాతం ఎక్కువ. 2026-27లో కేంద్ర ప్రభుత్వం చేసే ఖర్చులో 14.67% రక్షణ వ్యయమే. ఇతర శాఖలన్నింటి కంటే అత్యధికం ఇది. కాగా.. ఈసారి రక్షణ శాఖకు కేటాయించిన రూ.7.85లక్షల కోట్లలో రెవెన్యూ వ్యయం (సైనికుల జీతభత్యాలు, నిర్వహణ ఖర్చులు) రూ.3.65లక్షల కోట్లు కాగా.. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సైన్యం తక్షణ అవసరాల కోసం, యుద్ధ సన్నద్ధత కోసం మూలధన వ్యయాన్ని రూ.2.19లక్షల కోట్లుగా పేర్కొన్నారు. మూలధన వ్యయం అంటే అత్యంత అధునాతన ఆయుధాల కొనుగోలు, రక్షణ వ్యవస్థల ఆధునికీకరణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని నవీకరించడం వంటి వాటికి చేసే ఖర్చు. గత ఏడాది రక్షణ బడ్జెట్‌లో మూలధన వ్యయానికి కేటాయించిన మొత్తం (రూ.1.8 లక్షల కోట్లు)తో పోలిస్తే ఇది ఏకంగా 24శాతం అధికం. ఇందులో రూ.63,733 కోట్లు ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఏరో ఇంజన్ల కోసం ఖర్చు చేయనున్నారు. రూ.25,023 కోట్లు నౌకల కోసం కేటాయించారు. రూ.2,19,306 కోట్లలో.. రూ.1.85 లక్షల కోట్లు కొత్త ఆయుధాల కొనుగోలుకు.. అందులోనూ రూ.1.39లక్షల కోట్లు 'భారత్‌లో తయారీ' విధానంలో భాగంగా భారతీయ కంపెనీల నుంచి(ప్రైవేటుతో సహా) కొనుగోలు చేయడానికి కేటాయించారు. అంటే.. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, మహీంద్ర డిఫెన్స్ సిస్టమ్, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ తదితర దేశీయ పరిశ్రమల నుంచే 75శాతం కొనుగోళ్లు చేస్తారు. దేశీయ పరిశ్రమలకు ఆర్డర్లు పెరగడం వల్ల అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి దారి తీసి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

డీఆర్‌డీవోకు రూ.29,100 కోట్లు

అత్యాధునిక ఆయుధాలను తయారుచేయడమే లక్ష్యంగా డీఆర్‌డీవోకు రూ.29,100కోట్లు కేటాయించారు. ఇందులో మూలధనవ్యయం రూ.17,250కోట్లు (మిగతాది జీతభత్యాలకు).అంటే.. డీఆర్‌డీవో మొత్తం బడ్జెట్‌లో 60శాతం మూలధన వ్యయం కోసమే కేటాయించారు. రక్షణ శాఖ రెవెన్యూ వ్యయం రూ.3.65 లక్షల కోట్లలో రూ.1.58లక్షల కోట్లు యుద్ధ విమానాలు, నౌకల నిర్వహణకు, రూ.2.07లక్షల కోట్లు సైనికుల జీతభత్యాలకు వినియోగిస్తారు.

మాజీ సైనికులకు అండగా..

మాజీ సైనికుల పింఛన్ల కోసం రూ.1.71 లక్షలు కేటాయించిన కేంద్రం, వారికి, వారికుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందించి ఈసీహెచ్‌ఎస్ (ఎక్స్-సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్) బడ్జెట్‌ను నిరుటితో పోలిస్తే ఏకంగా 45.49%మేర పెంచేసింది. 2025-26లో ఈ పథకానికి రూ.8,317 కోట్లు కేటాయించగా, ఈసారి ఏకంగా రూ.12,100 కోట్లు కేటాయించింది. అంటే.. రూ.3,783 కోట్లు పెంచింది. అలాగే.. సివిల్ డిఫెన్స్ వ్యయాలకు రూ.28,554కోట్లు కేటాయించారు. కోస్ట్ గార్డ్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో), రక్షణ శాఖలో పనిచేసే ఉద్యోగుల జీతభత్యాలన్నీ ఈ కేటగిరీ కిందకి వస్తాయి. సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు.. బీఆర్‌వోకు రూ.7,394కోట్లు కేటాయించింది. కాగా.. రక్షణశాఖ కేటాయింపులను గణనీయంగా పెంచడంపై ఆ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లో అత్యంత ముఖ్యమైన అంశం మన త్రివిధ దళాల ఆధునీకరణ అని.. అందుకోసం రూ.1.85 లక్షల కోట్లు కేటాయించారని, గత ఏడాదితో పోలిస్తే ఇది 24 శాతం అధికమని.. దీనివల్ల మన సైనిక సామర్థ్యం మరింత శక్తిమంతంగా మారుతుందని ఆయన ఆనందం వెలిబుచ్చారు.



హైదరాబాద్ టూ బెంగళూరు!

2 గంటల్లోనే..

బడ్జెట్‌లో ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లు భారతీయ రైల్వే ముఖచిత్రాన్ని మార్చేస్తాయి. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలను కలుపుతూ ప్రతిపాదించిన 'దక్షిణాది హైస్పీడ్ ట్రయాంగిల్' వల్ల ఆయా నగరాల మధ్య ప్రయాణ సమయం ఊహించని రీతిలో తగ్గనుంది. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రెండు గంటల్లో, హైదరాబాద్ నుంచి చెన్నైకి 2గంటల 55నిమిషాల్లో, చెన్నై నుంచి బెంగళూరుకు గంట 13నిమిషాల్లో చేరుకోవచ్చు. దక్షిణాది ఆర్థిక వ్యవస్థకు ఈ కారిడార్లు 'గ్రోత్ ఇంజన్'గా నిలవనుంది.

- రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్

రైల్వేకు 2.77 లక్షల కోట్లు

2025-26 కన్నా 10 శాతం అధికం

- అదనపు వనరుల కింద మరో 15 వేల కోట్లు
- ప్రయాణికులు, సరకుల రవాణాలో ఆదాయ లక్ష్యాలను అందుకోలేని రైల్వే
- అంచనాల కన్నా రూ.22 వేల కోట్ల తగ్గుదల
- పింఛన్లదే ప్రధాన ఖర్చు.. 74,500 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బడ్జెట్‌లో రైల్వేలకు పెట్టుబడి వ్యయం కింద రూ.2,77,830 కోట్లు కేటాయించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.2,52,000 కోట్లకన్నా ఈసారి 10.25 శాతం నిధుల్ని అదనంగా ఇచ్చారు. రైల్వేల చరిత్రలోనే ఇది అతి భారీ కేటాయింపు. వీటిని ప్రధానంగా కొత్త లైన్ల నిర్మాణం, పాత లైన్ల విస్తరణ, ఇంజిన్లు, కోచ్‌ల తయారీ, టెలికాం, సిగ్నలింగ్ వ్యవస్థలకు ఉపయోగించనున్నారు. ఈ నిధులతో పాటు అదనపు బడ్జెట్ వనరుల కింద రైల్వేశాఖకు మరో రూ.15 వేల కోట్లు ప్రభుత్వం అందించనుంది. కాగా, 2024-25లో రైల్వే శాఖ రూ.3,35,757 కోట్లను ఆర్జించగా రూ.3,32,440 కోట్లు వ్యయం చేసింది. నికర మిగులు రూ.3,317 కోట్లు. 2025-26లో ఆదాయం రూ.3,85,733 కోట్లు, ఖర్చులు రూ.3,82,186 కోట్లు, మిగులు రూ.3,547 కోట్లు ఉంటుందని బడ్జెట్ అంచనా వేసింది. మిగులు గత ఏడాది కన్నా రూ.230 కోట్లు మాత్రమే అధికంగా ఉండటం గమనార్హం. 2025-26లో ప్రయాణికుల నుంచి రూ.92,800కోట్ల ఆదాయం, సరకు రవాణా నుంచి రూ.1,88,000 కోట్ల ఆదాయం వస్తుందని ఆశించినప్పటికీ.. అది వరుసగా రూ.80 వేల కోట్లకు, రూ.1,78,457 కోట్లకు పరిమితమైందని సవరణ అంచనాలు తెలిపాయి. ఏసీ త్రీ టైర్ టికెట్ల అమ్మకాల నుంచి రూ.37,115 కోట్ల ఆదాయం వస్తుందని ఆశించగా.. రూ.27,262 కోట్లు మాత్రమే రావటం గమనార్హం. మొత్తమ్మీద, రైల్వేశాఖ ఆదాయ లక్ష్యాలను అందుకోలేకపోయింది. ఇక రైల్వేల వ్యయంలో పింఛన్ల చెల్లింపులదే ప్రధాన వాటా. 2024-25లో ఇది రూ.58,844 కోట్లు ఉండగా, 2025-26లో రూ.74,500 కోట్లకు పెరుగుతుందని అంచనా వేశారు.

భారీగా పెరిగిన సిగరెట్ల ధర

ఒక్కో ప్యాకెట్‌పై రూ.55 వరకు బాదుడు

బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే అమల్లోకి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బడ్జెట్‌లో అదనంగా ఎక్సైజ్ సుంకం విధించడంతో సిగరెట్ల ధరలు ఆదివారం నుంచే భారీగా పెరిగాయి. 10 సిగరెట్లు ఉండే ఒక్కో ప్యాకెట్‌పై కనిష్ఠంగా రూ.22 నుంచి గరిష్ఠంగా రూ.55 వరకు పెరుగుదల అమల్లోకి వచ్చింది. డిస్ట్రిబ్యూటర్లు తెలిపిన వివరాల మేరకు 76 మిల్లీ మీటర్ల పొడవు ఉండే ప్రీమియం సిగరెట్లకు బ్రాండ్‌ను బట్టి ఒక్కో ప్యాకెట్‌పై రూ.50 నుంచి రూ.55 వరకు ధర పెరిగింది. సిగరెట్ల తయారీదారులు గరిష్ఠ అమ్మకం ధర(ఎంఆర్‌పీ)ను ఇంకా సవరించనప్పటికీ, డిస్ట్రిబ్యూటర్లు పాత స్టాక్‌కు 40 శాతం జీఎస్టీతో రిటైలర్లకు బిల్లులు ఇవ్వడం ప్రారంభించేశారు. ఆదివారం హోల్ సేల్ మార్కెట్లు మూసి ఉన్నందున, సోమవారం నుంచి హోల్‌సేల్ వ్యాపారులూ ఎంఆర్‌పీని సవరించే అవకాశం ఉందని డిస్ట్రిబ్యూటర్లు భావిస్తున్నారు. ప్రిన్స్ నావీ కట్ డీలక్స్ ప్యాకెట్‌ను ఇప్పటి వరకు రూ.95కు విక్రయిస్తుండగా దీని ధర రూ.120 వరకు చేరొచ్చని భావిస్తున్నారు. గోల్డ్‌ఫ్లాక్ లైట్స్, విల్స్ క్లాసిక్, విల్స్ క్లాసిక్ మైల్డ్స్ తదితర ప్యాకెట్ల ధర రూ.170 ఉండగా, వాటి ధర రూ.220 నుంచి రూ.225 వరకు పెరగొచ్చని అంటున్నారు. ఇక తయారీదారులు ఈ నెలాఖరు నుంచి కొత్త ఎంఆర్‌పీని అమల్లోకి తెచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. కొన్ని కంపెనీలు ఇప్పటికే స్టాక్‌ను నిలిపేశాయని, కొత్త ధరలు ముద్రించాక ఆ స్టాక్‌ను విడుదల చేసే అవకాశం ఉందని ఒక స్టాకిస్ట్ తెలిపారు.



ఇది సంస్కరణల ఎక్స్‌ప్రెస్!

- కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణకూ లబ్ధి: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈ బడ్జెట్ 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివర్ణించారు. రక్షణ రంగాన్ని మరింత శక్తిమంతం చేసుకుంటూ.. రైల్వే, ఫార్మా, వ్యవసాయం, మహిళా సంక్షేమం వంటి రంగాలకు ప్రాధాన్యం లభించిందనిచెప్పారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు ఈ బడ్జెట్ తొలి అడుగు అని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణకు మేలు కలుగుతుందన్నారు. తెలంగాణకు 2025-26లో పన్నుల వాటాగా రూ.29,280కోట్లు రాగా 2026-27లో 13.5శాతం పెరుగుదలతో రూ.33,180కోట్లు వస్తాయని తెలిపారు. 7 హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటిస్తే అందులో మూడు హైదరాబాద్ నుంచే ప్రారంభమవుతున్నాయని గుర్తుచేశారు. బయోఫార్మా శక్తి పథకం ద్వారా ఫార్మా, టీకాల రాజధానిగా ఉన్న హైదరాబాద్‌కు మరింత లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఎరువుల సబ్సిడీలో సింహభాగం తెలంగాణకే కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాలకు ఒక్కో బాలికల హాస్టల్ రానుందన్నారు.

విదేశీ పర్యటనలపై తగ్గిన భారం!

విదేశాల్లో విద్య, వైద్యం కోసం పంపే సొమ్ముపైనా మూలం వద్ద పన్ను 2శాతానికి తగ్గింపు


- ఆదాయ పన్నులో కొత్తగా మినహాయింపులు లేవు
- సరళీకరించిన పన్ను విధానం ఏప్రిల్ నుంచి అమల్లోకి..




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: విదేశీ పర్యటనలకు వెళ్లే భారతీయులకు కేంద్రం బడ్జెట్‌లో కాస్త ఉపశమనం కల్పించింది. విదేశీ పర్యటనల కోసం తీసుకెళ్లే/ఖర్చు చేసే సొమ్ముపై 'మూలం వద్ద వసూలు చేసే పన్ను (టీసీఎస్)'ను 2శాతానికి తగ్గించింది. ఇప్పటివరకు రూ.10 లక్షల వరకు 5శాతం, ఆపైన వ్యయంపై 20శాతం పన్ను ఉండేది. ఇప్పుడు సొమ్ము పరిమితిని పూర్తిగా తొలగించి, ఒకేలా 2శాతం టీసీఎస్‌ను వసూలు చేయనున్నట్టు కేంద్రం తెలిపింది. ఇక విదేశాల్లో విద్య, వైద్యం కోసం పంపే/తీసుకెళ్లే సొమ్ముపైనా టీసీఎస్‌ను 2 శాతానికి కుదించింది. విదేశాల్లో చదువు కోసం వెళ్లే కుటుంబాలకు ఇది కాస్త ఉపశమనం కలిగించనుంది. వైద్యం, విద్య కోసం కాకుండా ఇతర అవసరాల కోసం విదేశాలకు తీసుకెళ్లే సొమ్ముపై మాత్రం 20శాతం టీసీఎస్ కొనసాగుతుంది. 'సరళీకృత రెమిటెన్సుల స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)' కింద ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు కేంద్రం వెల్లడించింది. ఇక ఆల్కహాల్, తుక్కు, ఖనిజాల (బొగ్గు, లిగ్నైట్, ఇనుప ఖనిజం వంటివి)విక్రయాలపై టీసీఎస్‌ను 2శాతానికి పెంచింది. బీడీల తయారీకి వాడే తునికి ఆకులపైనా టీసీఎస్‌ను 5శాతం నుంచి 2శాతానికి తగ్గించింది. ఆదాయ పన్నులో ఈసారి ఎలాంటి మార్పులూ చేయలేదు.

ఆదాయ పన్ను మినహాయింపులు యథాతథం

గత ఏడాది పేర్కొన్న మినహాయింపులు యథాతథంగా కొనసాగనున్నాయి. ఇక కేంద్రం గత ఏడాది ప్రతిపాదించిన కొత్త ఆదాయ పన్ను చట్టం-2025 ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. సాధారణ ప్రజలు కూడా సులభంగా ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేసేలా సరళీకరించిన కొత్త ఫారాలు, నిబంధనలపై త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తామని నిర్మల తెలిపారు. ఇక ప్రస్తుత చట్టంలో ఉన్న అసెస్‌మెంట్ సంవత్సరం, అంతకు ముందటి సంవత్సరం వంటి వాటిని తొలగించి.. సులువుగా 'పన్ను సంవత్సరం (ట్యాక్స్ ఇయర్)'గా కొత్త చట్టంలో చేర్చారు. ఇక గడువు ముగిసిన తర్వాత ఐటీ రిటర్నులు దాఖలు చేసినా టీడీఎస్ సొమ్మును రీఫండ్ పొందడానికి అవకాశం కల్పించారు. సవరించిన ఐటీ రిటర్నుల దాఖలుకు తుది గడువును డిసెంబర్ 31 నుంచి తర్వాతి సంవత్సరం మార్చి 31వరకు పెంచారు. వాహన ప్రమాదాల్లో మరణించిన, శాశ్వత అంగవైకల్యానికి గురైనవారికి అందే పరిహారంపై వచ్చే వడ్డీలను ఆదాయ పన్ను నుంచి మినహాయించారు. ఎన్నారైల నుంచి ఇళ్లు, భూములు కొనుగోలు చేసేవారు 'ట్యాన్ (మూలం వద్ద పన్ను కోతకు సంబంధించిన ఖాతా)' వివరాలు సమర్పించాల్సిన అవసరం లేదని.. పాన్ కార్డు ఇస్తే సరిపోతుందని వెల్లడించారు.





విదేశాల్లోని ఆస్తుల వెల్లడికి ప్రత్యేక స్కీమ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: విదేశాల్లో కూడబెట్టుకున్న ఆదాయం, ఆస్తుల వెల్లడి కోసం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజా బడ్జెట్‌లో ప్రత్యేక పథకాన్ని ప్రకటించారు. ఆరు నెలల పాటు అమల్లో ఉండే ఈ పథకం కింద నిర్ణీత పన్ను, జరిమానా చెల్లించి.. విదేశీ ఆదాయం, ఆస్తులను వెల్లడించి, అధికారికం చేసుకోవచ్చని తెలిపారు. తద్వారా నల్లధనం నియంత్రణ చట్టం కింద కేసులు, విచారణ నుంచి తప్పించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ స్కీమ్ ప్రకారం.. విదేశాల్లోని ఆదాయం, ఆస్తుల వివరాలను అసలేమాత్రం వెల్లడించనివారు.. ఆ ఆదాయం/ఆస్తి విలువలో 30శాతం ఆదాయ పన్ను, మరో 30శాతాన్ని జరిమానా కింద చెల్లించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా రూ.కోటి వరకు ఆదాయం/ ఆస్తిని ఈ విధానంలో వెల్లడించవచ్చు. ఇక విదేశీ ఆదాయాన్ని రిటర్నుల్లో వెల్లడించి, ఆదాయ పన్ను కట్టినా.. ఆ ఆదాయంతో విదేశాల్లో కొన్న ఆస్తుల వివరాలను వెల్లడించనివారు కేవలం రూ.లక్ష జరిమానాగా చెల్లిస్తే చాలు. గరిష్ఠంగా రూ.5 కోట్ల విలువైన ఆస్తిని వెల్లడించవచ్చు. విదేశాల్లో చదువుకున్న విద్యార్థులు, వివిధ వృత్తిపర ఉద్యోగాలు చేసినవారు, బదిలీ/డిప్యూటేషన్‌పై విదేశాలకు వెళ్లిన ఐటీ ఉద్యోగులు, భారత్‌కు తిరిగొచ్చిన ఎన్నారైలు వంటివారు విదేశాల్లో ఉన్నప్పుడు కూడబెట్టిన ఆదాయం, ఆస్తుల వివరాల వెల్లడి కోసమే ఈ స్కీమ్ ప్రవేశపెట్టామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. నల్లధనం దాచినవారు ఈ స్కీమ్‌తో ఏమాత్రం ప్రయోజనం పొందలేరని, అందుకోసమే గరిష్ఠ ఆదాయం, ఆస్తుల వెల్లడి పరిమితి విధించామని తెలిపారు. 'ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్' విధానం కింద అందిన సమాచారం మేరకు.. భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు ఆయా దేశాల్లో సంపాదించిన ఆదాయం, కొన్న ఆస్తుల వివరాలను ఇక్కడ వెల్లడించలేదని పన్నుల శాఖ వర్గాలు తెలిపాయి.

కీలక పథకాలకు కేటాయింపులు

(రూ. కోట్లలో)

పథకం	కేటాయింపు
గరీబ్ కల్యాణ్ అన్న యోజన	2,27,429
ఉపాధి హామీ (నరేగా+జీరామ్‌జీ)	1,25,692
ప్రధానమంత్రి ఆవాస్ యోజన	76,542
జల్ జీవన్ మిషన్	67,670
జాతీయ ఆరోగ్య మిషన్- అర్బన్	31,820
గ్రామ సడక్ యోజన	19,000
పంటల బీమా పథకం	12,200
స్వచ్ఛ భారత్	9,692
నదుల అనుసంధానం	1,906
పీఎం-పోషణ్	12,750
సమగ్ర శిక్ష	42,100
కిసాన్ సమ్మాన్ నిధి	63,500



మహిళా సాధికారతకు 'షి' మార్టులు

దేశంలో మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా సెల్ఫ్‌హెల్ప్ ఆంత్రప్రెన్యూర్స్ (షి) మార్టులను ఏర్పాటు చేస్తాం. లఖ్‌పతి దీదీ పథకం విజయం స్ఫూర్తితో దీనిని చేపడుతున్నాం. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో వారితోనే రిటైల్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేయిస్తాం. వారు ఇకపై వ్యాపారాల్లో నిర్ణయాత్మక శక్తిగా, భాగస్వాములుగా మారతారు.

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



2026-27

గేమింగ్, కంటెంట్ సృష్టిని దృష్టిలో ఉంచుకొని.. దేశవ్యాప్తంగా 15 వేల పాఠశాలల్లో 'కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు', నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పరిశ్రమ కారిడార్ల సమీపంలో ఐదు యూనివర్సిటీ టౌన్‌షిప్‌ల ఏర్పాటుపై సీతారామన్ ప్రణాళికలను ప్రకటించారు.

2026-27 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతం అంచనా వేస్తున్నామని, ఇది 2025-26లోని 4.4 శాతం కంటే తక్కువని పేర్కొన్నారు.



నైపుణ్యాభివృద్ధి మంత్రం

విద్యా రంగానికి 1,39,285.95 కోట్లు.. గతేడాది కంటే 8.27% పెరిగిన కేటాయింపు




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: విద్య, ఉపాధి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంపై కేంద్రం దృష్టి సారించింది. విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అవసరమని కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా ఆరెంజ్ ఎకానమీని ప్రోత్సహించందుకు కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రతిపాదించింది. యువత నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఏఐ ఎక్సలెన్స్ కేంద్రాలు, పారిశ్రామిక, లాజిస్టిక్ కారిడార్ల వద్ద యూనివర్సిటీ టౌన్‌షిప్‌ల ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకనుగుణంగా ఈ ఏడాది విద్యారంగానికి రూ.1,39,285.95 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే 8.27 శాతం పెంచింది. 2026-27 బడ్జెట్‌లో విద్యా రంగంపై తీసుకున్న ముఖ్య నిర్ణయాలివీ..

ఆరెంజ్ ఎకానమీపై ఫోకస్

మీడియా, వినోదం, మేధో సంపత్తి వంటి సృజనాత్మక రంగాలను ఆరెంజ్ ఎకానమీగా పేర్కొంటారు. యానిమేషన్, వీఎఫ్‌ఎక్స్, గేమింగ్, కామిక్స్(ఏవీజీసీ), టూరిజం, వినోదం తదితర రంగాలు ఇందులోకి వస్తాయి. వేగంగా వృద్ధి చెందుతున్న ఏవీజీసీ రంగంలో 2030 నాటికి 20లక్షల మంది నిపుణులు అవసరమని కేంద్రం అంచనా వేసింది. ఈ డిమాండ్‌ను అందుకునేందుకు ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ నేతృత్వంలో 15,000 ప్రాథమికోన్నత పాఠశాలలు, 500 కళాశాలలో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌ల ఏర్పాటును ప్రతిపాదించింది. స్టార్టప్‌లను ప్రోత్సహించడం, కొత్త కంటెంట్ క్రియేటర్లను తయారు చేయడం, డిజిటల్ క్రియేటివ్ రంగాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడం వీటి లక్ష్యం. అంతర్జాతీయ భాగస్వామ్యంతో ఐదు 'నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఏఐ' కేంద్రాల ఏర్పాటును కేంద్రం ప్రతిపాదించింది.

- పారిశ్రామిక, లాజిస్టిక్ కారిడార్ల సమీపంలో రాష్ట్రాల సహకారంతో ఐదు యూనివర్సిటీ టౌన్‌షిప్‌ల అభివృద్ధిని ప్రతిపాదించింది. దేశంలోని 20,000 పర్యాటక ప్రాంతాల్లో పని చేసేందుకు వీలుగా ఐఐఎంల ద్వారా 10,000 మంది టూరిస్టు గైడ్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రకటించింది. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్‌ను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం రంగాల్లో ఉన్నత విద్య అందించే స్టెమ్(ఎస్‌టీఈఎం) ఇన్‌స్టిట్యూషన్స్‌లో పరిశోధనలు, అధ్యయనాలు చేసే క్రమంలో విద్యార్థినులు ఇబ్బందులను గుర్తించిన కేంద్రం జిల్లాకో బాలికల వసతి గృహం ఏర్పాటును ప్రతిపాదించింది. ఖగోళ భౌతికశాస్త్రం, ఖగోళ శాస్త్ర రంగాలను ప్రోత్సహించేందుకు నాలుగు టెలిస్కోపిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కేంద్రాల ఏర్పాటు చేయనుంది.
- ఆయుర్వేద వైద్య రంగం బలోపేతానికి ఆలిండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఆయుర్వేద పేరిట 3 విద్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. పశు వైద్య నిపుణుల సంఖ్యను 20,000కు చేర్చడమే లక్ష్యంగా కొత్త వెటర్నరీ, పారా వెటర్నరీ కళాశాలల ఏర్పాటును ప్రతిపాదించారు. దేశాన్ని బయోఫార్మాసూటికల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కొత్తగా 3 నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. ఈసారి కొత్త ఐఐటీలు, ఐఎంఎంలపై ప్రకటన లేదు. 2014 తర్వాత ఏర్పాటైన 5 ఐఐటీల్లో మౌలిక వసతుల కల్పన, విస్తరణ చేపట్టనున్నారు.



మన విద్యార్థులకు ఉపశమనం

హైదరాబాద్ సిటీ: చదువు కోసం విదేశాలకు పంపే సొమ్ముపై టీసీఎస్ (మూలం వద్ద పన్ను వసూలు)ను 2 శాతానికి తగ్గించడంతో.. విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నవారికి ప్రయోజనం కలిగించనుంది. గత ఏడాది తెలుగు రాష్ట్రాల నుంచి 1,62,500 మంది చదువు కోసం విదేశాలకు వెళ్లారు. ఇప్పటికే విదేశాల్లో చదువుతున్నవారు ఐదారు లక్షల మందికిపైనే ఉంటారు. వారందరికీ ప్రయోజనం ఉంటుందని ఒక కన్సల్టెన్సీ ప్రతినిధి సూరజ్ చెప్పారు. విదేశీ చదువు కోసం అప్పులు చేసో, ఆస్తులు విక్రయించో సమకూర్చుకున్న డబ్బులో 5శాతాన్ని టీసీఎస్ కింద చెల్లించి.. తర్వాత ఐటీ రిటర్నులు దాఖలు చేసి, రీఫండ్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందని సీఏ హరికృష్ణ తెలిపారు. ఇప్పుడు టీసీఎస్‌ను 2 శాతానికి తగ్గించడం వల్ల ఉపశమనం లభిస్తుందని చెప్పారు.

పెరిగేవి..



ఖరీదైన వాచీలు, ఆల్కహాలు



కాఫీ రోస్టింగ్, బ్రూయింగ్, వెండింగ్ మెషిన్లు



వీడియో గేమ్స్ తయారీ విడిభాగాలు



దిగుమతి చేసుకున్న గొడుగులు



ఏటీఎం/క్యాష్ డిస్పెన్సర్ మెషిన్, దాని విడిభాగాలు



విదేశీ ఫిల్మ్ యూనిట్ దిగుమతి చేసుకునే ఫిల్మ్ ఎక్విప్‌మెంట్



జూ దిగుమతి చేసుకునే జంతువులు, పక్షులు

అమ్మోనియం ఫాస్ఫేట్/నైట్రో ఫాస్ఫేట్ ఫెర్టిలైజర్స్, నాఫ్తా, పొటాషియం హైడ్రాక్సైడ్, కాస్టర్ ఆయిల్ కేక్

సోలార్ గ్లాస్ తయారీలో వాడే ముడి పదార్థాలు, టీవీ ఎక్విప్‌మెంట్, అణు విద్యుత్ ప్రాజెక్టుల కోసం దిగుమతి చేసుకునే ఉత్పత్తులు



క్రీడా పరికరాలు




లెదర్ ఉత్పత్తులు



విమాన ఇంజన్ సహా విడిభాగాలు



మైక్రోవేవ్ ఓవెన్స్ విడిభాగాలు



విదేశీ విద్య



విదేశీ పర్యాటక ప్యాకేజీలు



17 రకాల క్యాన్సర్ ఔషధాలు, ఏడు అరుదైన వ్యాధుల ఔషధాలు, ఆహారం. వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే ఔషధాలు

తగ్గేవి..

టెక్స్‌టైల్‌కు 'మెగా' ఊపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 : దేశంలో టెక్స్‌టైల్ రంగాన్ని సంఘటితపరుస్తూ తొలి మెగా పార్కును కేంద్రం ఏర్పాటు చేయనుంది. అన్ని తయారీ ప్రక్రియలను ఒక్కచోటకు తీసుకురావడం, ఉత్పత్తులకు అదనపు విలువను జోడించడం లక్ష్యంగా దీనిని నెలకొల్పనున్నారు. టెక్స్‌టైల్ రంగంలోకి ఎద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, మరింతగా ఉత్పత్తులు అందుబాటులో ఉంచడం, సమీకృత హబ్‌లను పెద్దఎత్తున నెలకొల్పడం, ఎగుమతులే లక్ష్యంగా ప్రణాళికలు, నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకపోవడం.. అనే పంచ సూత్రాలను నిర్దేశించారు. సామర్థ్యం, సాంకేతిక వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఖాదీ, చేనేత ఉత్పత్తులు, హస్తకళలకు చేయూతను ఇవ్వడం కోసం కొత్తగా మహాత్మాగాంధీ గ్రామ్ స్వరాజ్ పథకాన్ని ప్రతిపాదించారు. మన టెక్స్‌టైల్ ఉత్పత్తులకు మార్కెట్, బ్రాండ్‌ను సాధించడంతోపాటు ఆధునిక పద్ధతులపై శిక్షణ, నైపుణ్యాల మెరుగుదల, ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కేలా ఈ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఈ పథకం కింద కార్యక్రమాలు చేపట్టనున్నారు. 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' విధానం కింద టెక్స్‌టైల్‌ను ప్రోత్సాహిస్తూ, చేనేత కార్మికులకు, గ్రామీణ పరిశ్రమలకు, యువతకు మద్దతు ఇవ్వనున్నారు. ఎక్స్‌పోర్ట్ ఆబ్లిగేషన్ గడువును (సుంకాల మినహాయింపు ఉన్న ఉత్పత్తుల ఎగుమతికి డెడ్‌లైన్) ఆరు నెలల నుంచి 12 నెలలకు పెంచడం ద్వారా ఎగుమతులకు ఊపు తీసుకురానున్నారు.



ఉద్యోగాలపై ఏఐ ప్రభావ అంచనాకు కమిటీ

సేవల రంగంలో ఎమర్జింగ్ టెక్నాలజీల ప్రభావంపై అధ్యయనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలోని సేవల రంగంలో ఉద్యోగాల కల్పనపై కృత్రిమ మేధ (ఏఐ) వంటి కొత్త సాంకేతికతల ప్రభావం ఎలా ఉండబోతోందనే విషయాన్ని అంచనా వేసేందుకు ఉన్నత స్థాయి స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 2047 నాటికి ప్రపంచ సేవల మార్కెట్‌లో 10 శాతాన్ని సొంతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఐటీ, ఫైనాన్స్, టూరిజం, వైద్యం, లాజిస్టిక్స్ తదితర రంగాల్లో భవిష్యత్తులో ఉద్యోగ కల్పనను ఏఐ, ఆటోమేషన్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ వంటివి ఎలా మార్చబోతున్నాయనే అంశాన్ని ఈ కమిటీ అంచనా వేస్తుందని మంత్రి వెల్లడించారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అత్యంత కీలకమైన సేవల రంగం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను కమిటీ సూచిస్తుంది. ఆధునిక సాంకేతికతలకు అనుగుణంగా ఉపాధి రంగంలో కొత్తగా ప్రవేశపెట్టాల్సిన నైపుణ్యాలతోపాటు విధానపరంగా తీసుకోవాల్సిన చర్యలను కూడా ఈ కమిటీ ప్రతిపాదిస్తుంది.





హైటెక్ వ్యవసాయం..!

రైతుల కోసం ఏఐ ఆధారిత 'భారత్ విస్తార్'

ప్రాంతీయ భాషల్లో సమగ్ర సమాచారం

రైతుల చేతికి కొత్త డిజిటల్ ఆయుధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రస్తుతం అనేక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హవా కొనసాగుతోంది..! అయితే.. వ్యవసాయంలోనూ దీన్ని సమర్థంగా వినియోగించుకునే దిశగా కీలక ముందడుగు పడింది. రైతుల చేతిలో సమగ్ర సమాచారం ఉంచే లక్ష్యంతో.. 'భారత్ విస్తార్' పేరిట కొత్త ఏఐ ఆధారిత ప్లాట్‌ఫామ్‌ను తీసుకొస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రాంతీయ భాషల్లో వ్యవసాయ సూచనలిచ్చే ఈ సాధనం ద్వారా రైతులకు అవసరమైన సమాచారం ఒకేచోట లభించేలా ఈ వ్యవస్థను రూపొందించారు. భారత్ విస్తార్ ద్వారా రైతులకు పంటలపై సలహాలు, వాతావరణ అంచనాలు, మార్కెట్ ధరల సమాచారం అందుతుంది. దీనివల్ల పంట నష్టాల ప్రమాదం తగ్గుతుంది. పంట ఉత్పాదకత పెరుగుతుంది. ఖర్చులు కూడా తగ్గుతాయి.

పల్లెలకు ఆదాయం, ఉపాధి..

గ్రామాల ఆదాయం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా కేంద్ర బడ్జెట్‌లో వినూత్న ప్రతిపాదనలు చేశారు. కొత్తగా 500 చెరువుల అభివృద్ధి, కనీసం 20 వేలమందికి పశువైద్య నిపుణులుగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. పశు సంపద, మత్స్య ఉత్పత్తులతోపాటు ఉద్యానవన పంటలు, కోళ్ల పరిశ్రమ, సుగంధ మొక్కల పెంపకం తదితర వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు పెద్దపీట వేశారు. పశు సంపద రంగంలో రుణ ఆధారిత పెట్టుబడి రాయితీ పథకాన్ని తీసుకురావాలని, ప్రైవేటు రంగంలో వెటర్నరీ కాలేజీలు, ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లు, బ్రీడింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. స్టార్టప్‌లు, మహిళా సాగుదారుల సంఘాల సాయంతో మత్స్య పరిశ్రమకు ఊపు తీసుకురానున్నారు. ప్రపంచంలోనే కొబ్బరి సాగులో భారత్ ప్రథమ స్థానంలో ఉండగా, ఈ రంగాన్ని నమ్ముకుని కోటి మంది రైతులు సహా మొత్తం మూడు కోట్ల మంది జీవిస్తున్నారు. వీరి కోసం ఆయా రాష్ట్రాల్లో పనికిరాని చెట్ల స్థానంలో అధిక దిగుబడినిచ్చే మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నారు. అధిక ఆదాయమిచ్చే జీడిపప్పు, కోకో, కొబ్బరి, గంధపు చెక్క, వాల్‌నట్స్, బాదం, పైన్ నట్స్ వంటి సాగు ప్రోత్సాహానికి ప్రాధాన్యమివ్వనున్నారు. జీడిపప్పు, కోకో ఉత్పత్తులకు 2030 నాటికి గ్లోబల్ బ్రాండ్ హోదా సాధించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

సహకార సంఘాలకు పన్ను రాయితీలు

పశువుల దాణా, పత్తి గింజలు సరఫరా చేసే సహకార సంఘాలకు పన్నుల్లో రాయితీలను కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతం పాలు, నూనె గింజలు, పండ్లు, కూరగాయలను పండించే, లేదా ఉత్పత్తి చేసే సభ్యులున్న ప్రాథమిక సహకార సంఘాలు వాటిని ఒక ఫెడరల్ సహకార సంఘానికి లేదా అలాంటి ఇతర సంస్థలకు సరఫరా చేయడం ద్వారా వచ్చే లాభాలు, ఆదాయాలపై పన్ను రాయితీలను కల్పిస్తున్నారు. ఈ రాయితీలను ఇప్పుడు పశువుల దాణా, పత్తి గింజల విషయంలోనూ వర్తింపచేయనున్నట్టు బడ్జెట్‌లో తెలిపారు.

పర్యాటకానికి పెద్దపీట

ఉపాధి, ఉద్యోగాల కల్పనలే లక్ష్యంగా కొత్త బడ్జెట్‌లో పర్యాటక రంగం అభివృద్ధికి పెద్దపీట వేశారు. రూ.2,438.4 కోట్లు కేటాయించారు. 15 వారసత్వ ప్రదేశాలను పునరుద్ధరించనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. వీటిని అభివృద్ధి చేయడం ద్వారా స్థానికంగా ఉద్యోగ, ఉపాధి కల్పనలకు ప్రాధానం ఉంటుందన్నారు. వారసత్వ ప్రదేశాల్లో రాయ్‌గిరి, లోథాల్, సారనాథ్, హస్తినాపూర్ వంటి ముఖ్యమైన ప్రదేశాలు ఉన్నాయి. ఇక, బుద్ధిస్ట్ సర్క్యూట్ అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. వీటిలో అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, మిజోరం, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాలు ఉన్నాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ ఏర్పాటుచేసి 10 వేల మందికిపైగా పర్యాటక గైడ్లకు 20 అతి పెద్ద పర్యాటక ప్రాంతాల్లో 12 వారాల పాటు శిక్షణ ఇస్తారు.

అరుదైన ఖనిజాల కోసం కారిడార్లు

ఒడిశా, ఏపీ, తమిళనాడు, కేరళల్లో ఏర్పాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: అరుదైన ఖనిజాల విషయంలో దిగుమతులపై ఆధారపడకుండా దేశీయంగా వాటిని ఉత్పత్తి చేసేందుకు కేంద్రం ప్రత్యేకంగా కారిడార్లను ఏర్పాటు చేయనుంది. ప్రత్యేక అరుదైన భౌగోళిక కారిడార్ల ఏర్పాటుకు ఖనిజాలు పుష్కలంగా ఉండే రాష్ట్రాలకు సహకరిస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ కారిడార్లు ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలను అనుసంధానం చేస్తాయని చెప్పారు. అరుదైన ఖనిజాల మైనింగ్, ప్రాసెసింగ్, దేశీయంగా రవాణా చేయడానికి వ్యవస్థీకృత నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి ఈ కారిడార్లను ప్రతిపాదించారు. అరుదైన ఖనిజాలను ఆధునిక సాంకేతిక పరికరాల్లో విరివిగా వినియోగిస్తారు. ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పవన విద్యుత్ టర్బైన్లు, మొబైల్ ఫోన్లు, రక్షణ పరికరాలకు వీటి అవసరం ఉంటుంది. అలాంటి అరుదైన ఖనిజాల నిల్వలు పుష్కలంగా ఉన్న రాష్ట్రాలను అనుసంధానం చేయడం ద్వారా సప్లయ్ చైన్ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు తక్కువ ఖర్చు, సులువుగా వేగంగా దేశీయ ఉత్పత్తి సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నాలుగు రాష్ట్రాల్లో అరుదైన ఖనిజాల నిల్వలు ఉండటమే కాకుండా, తీర ప్రాంతం కూడా సుదీర్ఘంగా ఉంటుంది. ఖనిజాలను ప్రాసెస్ చేసే మౌలికసదుపాయాలు, ఇండస్ట్రియల్ జోన్లు, రవాణాకు అనువుగా ఉండే పోర్టులు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతాలకు సహకారం అందిస్తే, అరుదైన భూ ఖనిజాల ఉత్పత్తి విషయంలో దేశీయంగా ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయవచ్చని కేంద్రం విశ్వసిస్తోంది.



సబ్సిడీల్లో దేనికెంత? (రూ.కోట్లలో)

మొత్తం 410495

	(వాస్తవ) 2024-25	(సవరించిన) 2025-26	(బడ్జెట్ అంచనా) 2026-27
ఆహారం	1,99,867	2,28,154	2,27,629
ఎరువులు	1,70,683	1,86,460	1,70,781
పెట్రో ఉత్పత్తులు	14,479	15,121	12,085

ఆహారం, ఎరువులు, ఇంధనంపై సబ్సిడీ 4.47% తగ్గింపు

ఆహారం, ఎరువులు, ఇంధనంపై 2026-27లో ప్రభుత్వ వార్షిక సబ్సిడీ వ్యయం రూ.4,10,495 కోట్లు (మైనస్ 4.47%)గా కేంద్ర బడ్జెట్‌లో అంచనా వేశారు. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ రంగాలపై సవరించిన సబ్సిడీ రూ.4,29,735 కోట్లు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆహార సబ్సిడీని రూ.2,27,629 కోట్లుగా అంచనా వేశారు. 2025-26లో సవరించిన అంచనా రూ.2,28,154 కోట్ల కంటే ఇది తక్కువ. ఎరువుల సబ్సిడీపైనా గతేడాది (రూ.1,86,460 కోట్లు)తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం (రూ.1,70,805 కోట్లు) తక్కువగానే అంచనా వేసింది. 2025-26లో పెట్రోలియం సబ్సిడీ రూ.15,121 కోట్లతో పోలిస్తే 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.12,085 కోట్లకు తగ్గించింది.

ఏపీకి ఏమిచ్చారంటే..!

రాష్ట్రానికి రేర్ ఎర్త్ కారిడార్.. 'పూర్వోదయ'లో ఈస్ట్ కోస్ట్ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మైనింగ్, ఉత్పత్తి, పరిశోధన, క్రమబద్ధీకరణను ప్రోత్సహించేందుకు రేర్ ఎర్త్ కారిడార్ నెలకొల్పుతామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. బడ్జెట్ ప్రసంగంలో ఆమె మూడుసార్లు ఆంధ్రప్రదేశ్ పేరు ప్రస్తావించారు. పూర్వోదయ పథకం కింద ఆంధ్రప్రదేశ్ సహా ఐదు పూర్వోదయ రాష్ట్రాల్లో సమగ్ర ఈస్ట్ కోస్ట్ పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా ఉన్న ఈ కారిడార్ కోల్‌కతా నుంచి కన్యాకుమారి వరకు 2,500 కిలోమీటర్ల మేర విస్తరించింది. దేశంలో ప్రపంచ స్థాయి ట్రెక్కింగ్, హైకింగ్ సౌకర్యాలను హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్, పశ్చిమ ఘాట్లతో పాటు తూర్పు ఘాట్లలో కీలకమైన అరకు లోయలో కల్పించనున్నారు. ఏపీ, తమిళనాడులో పులికాట్ సరస్సులో పక్షుల విహారాన్ని సందర్శించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. సిటీ ఆర్థిక మండలిలో భాగంగా ఐదేళ్లపాటు రూ.5 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడంతో అమరావతికి నిధులు లభించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. సంస్కరణలు, ఫలితాలతో కూడిన ఆర్థిక యంత్రాంగాన్ని సవాల్‌గా తీసుకుని కట్టుదిట్టంగా ప్రణాళికలు అమలు చేసే నగరాలకు ఈ నిధులు లభిస్తాయి. కేంద్రం ప్రకటించిన ఏడు హైస్పీడ్ కారిడార్లలో హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు కారిడార్ల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు కీలక ప్రయోజనాలు సమకూరనున్నాయి. విజయవాడ, అమరావతికి అనుసంధానం చేసే హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ రాష్ట్రానికి ఇతోధికంగా ప్రయోజనం కలిపిస్తుందని భావిస్తున్నారు.

డేటా సెంటర్‌కు పన్ను రాయితీ

డేటా సెంటర్లలో కీలక పెట్టుబడులు, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు వీలుగా ఏ విదేశీ కంపెనీ అయినా భారత్ నుంచి డేటా సెంటర్ సేవల ద్వారా క్లౌడ్ సర్వీసులను అందిస్తే 2047 వరకూ టాక్స్ హాలిడే ప్రకటించారు. విశాఖలో ఇప్పటికే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం జరిగింది. పెద్ద నగరపాలక సంస్థలకు వెయ్యి కోట్ల మేర బాండ్ల ద్వారా నిధులు సమీకరించేందుకు అవకాశం కల్పించారు. వందకోట్ల మేరకు కేంద్రమే ప్రోత్సాహకం కల్పించనుంది. దీంతో ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి తదితర నగరపాలక సంస్థలకు నిధులు లభించనున్నాయి. అమృత్ 2.0 ద్వారా వచ్చే నిధులతో ఏపీలోని నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం లభించే అవకాశాలు ఉన్నాయి. మెడికల్ టూరిజం, రీజినల్ హబ్‌లను పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక కారిడార్లలో 5 యూనివర్సిటీ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయడం, నైపుణ్య శిక్షణకు అవకాశం కల్పించడం, ప్రతి జిల్లాకు ఒక మహిళా హాస్టల్ ఏర్పాటు చేయడం వంటి అనేక నిర్ణయాల ద్వారా ఏపీకి ప్రయోజనం చేకూరనుంది. వీబీ జీ రామ్ జీ పథకం కింద గ్రామీణ ఉపాధికి గతంలో కంటే మరో రూ.10 వేలకోట్లు కేటాయించడం వల్ల ఏపీకి లబ్ధి కలిగే అవకాశాలు ఉన్నాయి. మూలధన వ్యయం కింద దీర్ఘకాలిక వడ్డీలేని రుణాలు మంజూరు నిర్ణయం కూడా ఏపీకి అనుకూలం.

ఏపీకి నిధులు

- అమరావతి ఇన్‌క్లూసివ్ అండ్ సస్టెయినబుల్ క్యాపిటల్ సిటీ అభివృద్ధికి (ఏడీబీ నిధులు) రూ.1128.91 కోట్లు కేటాయింపు. ఇందులో అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఐబీఆర్డీ నిధులు) కింద రూ.432.09 కోట్లు మంజూరు.
- గ్రామీణ రోడ్ ప్రాజెక్టులకు రూ.500.99 కోట్లు.
- పట్టణ తాగు, మురుగు నీటి నిర్వహణకు రూ.800 కోట్లు. ప్రకృతి వ్యవసాయానికి రూ.155.32 కోట్లు. రహదారులు, వంతెనల పునర్నిర్మాణం కోసం రూ.350 కోట్లు.
- ఈక్విటీ మూలధనం కింద విశాఖలోని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కు రూ.100 కోట్లు.
- హిందూస్థాన్ షిప్ యార్డుకు రూ.150 కోట్లు.
- పోలవరం ప్రాజెక్టుకు రూ.3320.39 కోట్లు. 41.15 మీటర్ల నీటి నిల్వ మేరకు నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పూర్తయ్యేందుకు సవరించిన అంచనాల ప్రకారం రూ.30436.95 కోట్లు కాగా, కేంద్రం చెల్లించవలసిన మొత్తం రూ.12157.53 కోట్లు మాత్రమేనని బడ్జెట్ పత్రాల్లో స్పష్టం చేశారు.
- పోలవరం ప్రాజెక్టు అథారిటీకి రూ.20 కోట్లు.

రాష్ట్రానికి పన్నుల్లో వాటా

- 2026-27 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర పన్నుల్లో రూ.64,362.16 కోట్లు. 16వ ఫైనాన్స్ కమిషన్ ప్రకారం కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా 4.217 శాతం.
- కార్పొరేషన్ ట్యాక్స్ ద్వారా రూ.18,893.64 కోట్లు
- ఆదాయ పన్ను రూపంలో రూ.22,904.77 కోట్లు
- కేంద్ర జీఎస్టీ రూపంలో రూ.17,603.01 కోట్లు
- కస్టమ్స్ రూపంలో రూ.3,434.92 కోట్లు
- కేంద్ర ఎక్సైజ్ సుంకం రూపంలో రూ.1,462.85 కోట్లు, ఇతర పన్నులు, సుంకాల రూపంలో రూ.63.97 కోట్లు
- 2024-25, 2025-26లో కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా 4.047 శాతం కాగా, ప్రస్తుతం 0.174 శాతం పెరిగింది. దీంతో గత రెండు ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే రాష్ట్రానికి దాదాపు రూ.7489 కోట్లు అదనంగా లభించినట్టు అయ్యింది.

కేంద్రం వరాలు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ అనగానే... రాష్ట్రాలన్నీ 'మాకేంటి?' అని చూస్తాయి! అందరికీ వచ్చేవి కొన్ని! కొందరికి మాత్రమే ఇచ్చేవి కొన్ని! ఆదివారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి మేలు చేసే కొన్ని ప్రత్యేక నిర్ణయాలివి...

పూర్వోదయానికి శుభోదయం: తూర్పు తీరం వెంబడి ఉన్న ఐదు 'పూర్వోదయ' రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. 'పూర్వోదయ' రాష్ట్రాలకు తాజా బడ్జెట్‌లో అనేక వరాలు ప్రకటించారు. ఐదు రాష్ట్రాలకు 4 వేల ఈ-బస్సులు ఇస్తామన్నారు. అందులో ఏపీకి ఎన్ని అన్నది తేలాల్సి ఉంది.

సాహస పర్యాటకం: భారత్‌లో 'ట్రెక్కింగ్'ను మరింత ప్రోత్సహించాలని కేంద్రం నిర్ణయించుకుంది. తూర్పు కనుమల్లోని 'అరకు లోయ'నూ ఇందుకు ఎంపిక చేసింది. అలాగే, పులికాట్ సరస్సులో విదేశీ వలస పక్షుల వీక్షణ మరింత సౌకర్యవంతం చేయనుంది.

కోకో, కొబ్బరి: కొబ్బరి, జీడిపప్పు, కోకో పంటలను సాగు చేసే రైతుల ఆదాయాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇది రాష్ట్రంలోని రైతులకు మేలు చేయనుంది.

గనులు: ఏపీ సహా పలు రాష్ట్రాల్లో 'అరుదైన ఖనిజాల' వెలికితీతకు చర్యలు తీసుకోనున్నారు.

డేటా సెంటర్లకు 'స్పీడ్': డేటా సెంటర్ల ఏర్పాటు చేసే విదేశీ సంస్థలకు 2047 దాకా పన్నులుండవని ప్రకటించారు. గూగుల్ రాకతో భారత డేటా సెంటర్ల 'హబ్'గా మారుతున్న విశాఖకు ఇది మరింత జోష్ తెచ్చే అవకాశముంది.

సెజ్: ప్రత్యేక ఆర్థిక మండళ్ల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయింపు వల్ల వల్ల నెల్లూరులోని శ్రీసిటీ సెజ్‌కు మరిన్ని పరిశ్రమలు వచ్చే వీలుంది.



నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని వింటున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి.. రూ.46,488 కోట్లు కావాలి

- 2026-27 బడ్జెట్‌లో కేటాయించాలని జల వనరుల శాఖ ప్రతిపాదనలు
- రేపు పూర్తి స్థాయిలో ఆర్థిక శాఖ సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేందుకు 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.46,488.43 కోట్లు కేటాయించాలని జలవనరుల శాఖ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలను ప్రాథమికంగా సమీక్షించిన ఆర్థిక శాఖ.. మంగళవారం నాటి సమీక్షలో సమగ్రంగా చర్చించి.. తేలుద్దామని స్పష్టం చేసింది. 2026-27 ప్రతిపాదనల్లో పోలవరం ప్రాజెక్టుకు రూ.10,866.27 కోట్లు విడుదల చేయాలని జలవనరుల శాఖ కోరింది. భారీ ప్రాజెక్టుల కోసం రూ.9,463 కోట్లు, తెలుగుగంగ-3,229 కోట్లు, తుంగభద్ర-1,122 కోట్లు, కడప నీటిపారుదల ప్రాజెక్టులు-3,185 కోట్లు, అనంతపురం ప్రాజెక్టులు-4,374 కోట్లు, కర్నూలు ప్రాజెక్టులు-1,329 కోట్లు, ఒంగోలు ప్రాజెక్టులు-1,745 కోట్లు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు-1,350 కోట్లు, గోదావరి డెల్టా సిస్టమ్-553 కోట్లు, కృష్ణా డెల్టా సిస్టమ్‌కు రూ.4,682 కోట్లను ప్రతిపాదించింది.

స్థానిక సంస్థలకు 28,785 కోట్లు

- 16వ ఆర్థిక సంఘం సిఫారసులు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు కలిపి రూ.28,785 కోట్ల గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం సిఫారసు చేసింది. ఇందులో గ్రామీణ స్థానిక సంస్థలకు (ఆర్ఎల్‌బీ) రూ.16,627 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు (యూఎల్‌బీ) రూ.12,158 కోట్లు కేటాయించారు. ఆర్ఎల్‌బీ, యూఎల్‌బీల్లో ఇప్పటి వరకు 60:40 శాతం ఉన్న జాతీయ గ్రాంటును ఇప్పుడు 80:20 శాతం చేశారు. 16వ ఆర్థిక సంఘం ఐదేళ్ల కాలానికి గాను దేశవ్యాప్తంగా రూ.7,91,493 కోట్లు సిఫారసు చేసింది. గ్రామీణ జనాభా అంచనాల ఆధారంగా 90:10 నిష్పత్తిలో ఈ గ్రాంట్లను రాష్ట్రాలకు కేటాయించాలని పేర్కొన్నారు. ఆర్ఎల్‌బీ, యూఎల్‌బీల్లో ఉండే బేసిక్ కంపోనెంట్ మొత్తం విలువలో 50శాతాన్ని పారిశుధ్య, ఘన వ్యర్థాల నిర్వహణకు, లేదంటే నీటి నిర్వహణకు వాడాలని పేర్కొన్నారు. మిగతా 50 శాతంలో రోడ్ల నిర్మాణం, వాటి నిర్వహణకు 20 శాతం కంటే ఎక్కువ వాడకూడదని తెలిపారు.

ఏపీకి రూ.8,166 కోట్ల విపత్తు నిధులు

16వ ఆర్థిక సంఘం రాష్ట్ర విపత్తుల నిర్వహణ, నియంత్రణ నిధి కోసం రూ.2,04,401 కోట్లు సిఫారసు చేసింది. ఇందులో కేంద్రం వాటా రూ.1,55,915.85 కోట్లు, రాష్ట్రాల వాటా రూ.48,485.15 కోట్లు. ఈశాన్య రాష్ట్రాలకు 90:10 నిష్పత్తిలో, మిగతా రాష్ట్రాలకు 75:25 నిష్పత్తిలో ఈ నిధులు వాడాలి. వాడని విపత్తు నిధుల బ్యాలెన్స్ చివరి మూడేళ్ల కేటాయింపుల సగటు కంటే ఎక్కువగా ఉంటే కొత్తగా నిధులు విడుదల చేయరు. ఏపీకి విపత్తు నిధుల కింద రూ.8,166 కోట్లు సిఫారసు చేశారు. ఇక జాతీయ విపత్తు, నియంత్రణ నిధి కోసం రూ.79,406 కోట్లు కేటాయించారు. విపత్తు నిర్వహణ, నియంత్రణ ఖర్చు రూ2.50 కోట్లలోపు ఉంటే 10 శాతం, రూ.500 కోట్ల లోపు ఉంటే 20 శాతం రాష్ట్రాలు, రూ.500 కోట్ల దాటితే 25 శాతం రాష్ట్రాలు భరించాలి.

అరుదైన ఖనిజాల కారిడార్ శుభపరిణామం

- కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ ఎంపీల హర్షం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అవసరాలకు ఎంతో కీలకమైన అరుదైన ఖనిజాల కారిడార్‌ను ఏపీకి కేటాయించడం శుభపరిణామమని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీనేత లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో భారీ ఎత్తున ఉపాధి కల్పన జరుగుతుందన్నారు. కేంద్ర బడ్జెట్‌పై ఆదివారం ఢిల్లీలోని ఏపీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీలో గత 10-15 ఏళ్లుగా స్వల్పస్థాయిలో అరుదైన ఖనిజాల తవ్వకాలు జరుగుతున్నాయని, కేంద్రం తాజా ప్రకటనతో ఆ తవ్వకాలు ఊపందుకుటాయని చెప్పారు. రాష్ట్రంలో అరుదైన ఖనిజాలున్న పదిపన్నెండు ప్రాంతాలను గుర్తించారని, వాటిలో మూడింటికి వేలం ప్రక్రియ పూర్తి చేశారని తెలిపారు. మెడికల్ కళాశాలల విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పీపీపీ మోడల్‌ను కేంద్రం స్ఫూర్తిగా తీసుకుందని, పీపీపీ మోడ్‌లో మెడికల్ హబ్‌లు ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు బురద చల్లడం మానుకోవాలని హితవు పలికారు. మెడికల్ హబ్‌లలో సింహభాగం ఏపీకి వస్తాయన్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన ఐదు మెగా టెక్స్‌టైల్స్ హబ్‌లలో ఒకటి ఏపీకి వస్తుందని, దానివల్ల యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.

అన్ని వర్గాలకూ ఆశాజనకం: సీఐఐ చైర్మన్

విజయవాడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకూ ఆశాజనకంగా ఉందని సీఐఐ వైస్ చైర్మన్ ఎస్.నరేంద్రకుమార్ అభిప్రాయపడ్డారు. కేంద్రప్రభుత్వం అన్ని రంగాలకూ ప్రాధాన్యమిస్తూ సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. లార్జ్‌స్కేల్ మాన్యుఫ్యాక్చరింగ్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టిపెట్టడం వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సీఐఐ విజయవాడ జోన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమం ద్వారా మహిళలను స్వయం ఉపాధి వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దే ప్రయత్నం గొప్ప పరిణామమని పేర్కొన్నారు.

అభివృద్ధి, ఉపాధి కల్పనే లక్ష్యంగా బడ్జెట్

- ఏపీ చాంబర్స్ ప్రతినిధులు

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నిలకడైన అభివృద్ధి, ఉపాధి కల్పనను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలకూ ఊతమిచ్చేలా ఉందని ఏపీ చాంబర్స్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ప్రపంచ అనిశ్చితి పరిస్థితుల్లోనూ దేశ ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసేందుకు సరికొత్త ప్రణాళికతో బడ్జెట్‌ను రూపొందించడాన్ని అభినందించారు. చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ 2030 నాటికి దేశ అప్పులను జీడీపీలో 50శాతానికి తీసుకురావాలనే లక్ష్యంగా నిర్దేశించుకోవడం హర్షణీయమన్నారు. చాంబర్స్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, డైరెక్టర్ సాంబశివరావు, బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధి నాగమల్లేశ్వరరావు, ఎంఎస్ఎంఈ సంఘం ప్రతినిధి ముళ్లపూడి సత్యనారాయణ, ఏపీ లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు మాట్లాడారు.

పర్యాటకుల సంఖ్య పెంచేలా..: ఆర్వీ స్వామి

కేంద్ర బడ్జెట్ కేవలం పర్యాటకుల సంఖ్యనే కాకుండా, పర్యాటకులకు అనుభూతిని పెంచేలా కీలక నిర్ణయాలు తీసుకుందని ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి అన్నారు. 'దేశవ్యాప్తంగా ఐఐఎంల ద్వారా 10వేల మంది గైడ్‌లకు శిక్షణ ఇస్తారు. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాల వద్ద వీరు పర్యాటకులకు మెరుగైన సేవలందిస్తారు' అని తెలిపారు.

ఏపీ భవిష్యత్తుకు బలమైన పునాది

'రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. కొత్త ఫ్రైట్ కారిడార్లు, జాతీయ జల మార్గాల విస్తరణ, సముద్ర విమానాలకు ప్రోత్సాహం వంటి నిర్ణయాలు ఏపీ లాజిస్టిక్స్, పోర్టు ఆధారిత ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయి. ఈ బడ్జెట్ ఏపీ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది.'

- పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ

దేశ నిర్మాణానికి అంకితం

'భారతదేశ అభివృద్ధిని వేగంగా నడిపించేందుకు మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దూరదృష్టికి తాజా బడ్జెట్ నిదర్శనం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇది బలమైన బడ్జెట్. వేగవంతమైన ఆర్థిక వృద్ధి, భారీ మౌలిక పెట్టుబడులు, ప్రజల సామర్థ్య వృద్ధి, పన్నుల సంస్కరణలపై మోదీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది.'

- పీవీఎన్ మాధవ్, రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ

దేశాన్ని ఆత్మనిర్భరత దిశగా నడిపే బడ్జెట్

'చిత్తశుద్ధి, దృఢ సంకల్పం, ఆలోచనల్లో స్పష్టత, సవాళ్లను ఎదుర్కొనే ధైర్యంతో దేశాన్ని ఆత్మనిర్భరత దిశగా నడిపించేందుకు ఈ బడ్జెట్ మరో ముందడుగు. 2047 నాటికి నిర్దేశించుకున్న వికసిత భారతదేశ సాధనకు ఈ బడ్జెట్ ఉపకరిస్తుంది. ఆర్థిక స్థోమత లేనివారికి మానసిక వైద్య సేవలు, ట్రామాకేర్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు క్యాన్సర్ సహా ప్రాణ రక్షణ ఔషధాలపై దిగుమంతి సుంకాల రాయితీ, అలాగే 7 అరుదైన వ్యాధులకు సంబంధించిన మందుల దిగుమతిపై రాయితీలు కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం.'

- సత్యకుమార్, మంత్రి

పోలవరం, అమరావతికి నిధులు

'వికసిత్ భారత్ లక్ష్యాన్ని వేగంగా చేరుకునేందుకు కేంద్ర బడ్జెట్ తోడ్పడుతుంది. ఈస్ట్‌కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుతో రాష్ట్రం పారిశ్రామికంగా మరింత పురోగతి సాధిస్తుంది. బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు రూ.3,320 కోట్లు, అమరావతి అభివృద్ధికి ఏడీబీ నిధులు రూ.1,128.91 కోట్లు, అమరావతి సమీకృత పట్టణాభివృద్ధికి జపాన్ నిధులు రూ.432 కోట్లు కేటాయించడం హర్షణీయం. అర్హులందరికీ 2029 నాటికి ఇళ్లు కట్టించే కార్యక్రమాన్ని పూర్తి చేస్తాం.'

- కొలుసు పార్థసారథి, మంత్రి

కేంద్ర బడ్జెట్‌తో ఏపీ అభివృద్ధికి ఊతం

'కేంద్ర బడ్జెట్‌లో వివిధ పథకాలపై చేసిన కేటాయింపులతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన వేగవంతమవుతుంది. ఈ బడ్జెట్‌తో ఏపీ అభివృద్ధి ఊపందుకుంటుంది. ఏపీలో నగరపాలిక సంస్థలకు రూ.1,000 కోట్ల మేరకు బాండ్ల ద్వారా నిధుల సమీకరణకు అవకాశం ఉంది. అందులో రూ.100 కోట్లు కేంద్రం ప్రోత్సాహకంగా ఇస్తుంది'

- లంకా దినకర్, చైర్మన్, 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ

ఈసారి కూడా కేంద్రం దగా: షర్మిల

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) కేంద్రంలోని ఎన్డీఏలో సీఎం చంద్రబాబు కీలక భాగస్వామిగా ఉన్నప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు గుండు సున్నా అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అసహనం వ్యక్తంచేశారు. ప్రతి ఏడాదీ బడ్జెట్‌లో రాష్ట్రానికి మోదీ దగా చేస్తున్నారని విమర్శించారు. ఈసారి కూడా ఏపీకి మొండిచేయే చూపారన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర ప్రయోజనాలకు అణాపైసా విలువ కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఐదు కోట్ల మంది ఆంధ్రులను ఊరించి ఉసూరనిపించారని, అమరావతికి అప్పులు తప్ప ఆపన్న హస్తం అందించలేదని విమర్శించారు. ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామంటూ లక్ష కోట్ల రూపాయలు ఖర్చయ్యే అమరావతికి 15వేల కోట్ల అప్పును ఇచ్చి కేంద్రం చేతులు దులిపేసుకుందని తెలిపారు. పోలవరానికి రూ.3000 కోట్లు మాత్రమే ఇచ్చి 41.15 మీటర్ల కాంటూరుకే పరిమితం చేసేందుకు సిద్ధమైందన్నారు. కూటమికి పెద్దన్నగా చెప్పుకునే చంద్రబాబు నోరు విప్పకపోవడం ఆయన పాలనా దక్షతకు నిదర్శనమని షర్మిల ఎద్దేవా చేశారు.



నూతన సంవత్సరం, సంక్రాంతి జోష్‌తోనే

గత ఏడాది కంటే 6.72% పెరుగుదల

రాష్ట్రంలో జనవరిలో జీఎస్టీ వసూలు 3,073 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనవరిలో రూ.3,073 కోట్ల నికర జీఎస్టీ వసూలైందని ప్రభుత్వం ప్రకటించింది. నిరుటి జనవరితో పోలిస్తే 6.72 శాతం పెరిగినట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 2017లో జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి జనవరి నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం ఇదే మొదటిసారని పేర్కొంది. నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకల కారణంగా పన్ను వసూళ్లు పెరిగాయి. జాతీయ స్థాయిలో జీఎస్టీ వృద్ధిరేటు 5.8 శాతం ఉండగా, ఏపీలో అంతకంటే మెరుగైన ప్రదర్శన కనిపించిందని పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ ఎ.బాబు ఆ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జీఎస్టీ రూ.1,284 కోట్లు నమోదు కాగా.. గత ఏడాది కంటే 8.37 శాతం ఎక్కువన్నారు. పెట్రోలియం ఉత్పత్తుల అమ్మకం ద్వారా రూ.1,490 కోట్లు, వృత్తిపన్ను ద్వారా రూ.38 కోట్లు వసూళ్లయ్యాయని.. ఐజీఎస్టీ నిధులు రూ.1,789 కోట్లు వచ్చాయని వెల్లడించారు. ఐజీఎస్టీ సెటిల్‌మెంట్లలో ఉన్న అడ్డంకులను తొలగించడం, తప్పుడు క్లెయిమ్‌లను గుర్తించడం వల్ల రాష్ట్ర ఆదాయం పెరిగిందని ఆయన వివరించారు.


వికసిత సంకల్ప బడ్జెట్

- ఏపీ అభివృద్ధికి ఊతం ఇస్తుంది: డిప్యూటీ సీఎం పవన్



అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలపాలన్న బలమైన సంకల్పం ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో ప్రస్ఫుటమవుతోందని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. వికసిత భారత్ లక్ష్యాలు సాధించే లక్ష్యం వైపు ప్రజలను ఎలా అడుగులు వేయించాలనే దృక్పథం కేంద్ర బడ్జెట్‌లో కనపడిందన్నారు. కేంద్రం ఎంపిక చేసిన రేర్ ఎర్త్ కారిడార్లలో ఏపీ కూడా ఉండడం విలువైన ఖనిజాల వెలికితీత, తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. తీరప్రాంత మత్స్యకార సర్క్యూట్ బలోపేతం చేయడం, మహిళలు చేపలు పెంచుకునే అవకాశం, సుంకం లేకుండా చేపల పెంపకం వంటి నిర్ణయాలు మత్స్యకారులకు మేలు చేస్తాయన్నారు. ఉప్పాడ 100 రోజుల ప్రణాళికకు ఈ బడ్జెట్ ఊతం ఇస్తుందని, కొబ్బరి, జీడిపప్పు, కోకో రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక పథకాల కోనసీమ ప్రాంతంలోని కొబ్బరి రైతులకు ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని జీడి రైతులకు ఊరటనిస్తుందన్నారు.

అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేలా: లోకేశ్



అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'భారతదేశ వేగవంతమైన ప్రగతి, అభివృద్ధి లక్ష్యాలను సాధించేలా, దీర్ఘకాలిక ప్రణాళికా లక్ష్యాలను అందుకునేలా కేంద్ర బడ్జెట్ ఉంది. దీనిని ప్రవేశపెట్టిన ప్రధానిమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కృతజ్ఞతలు' అని మంత్రి లోకేశ్ అన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఈ బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి గణనీయమైన ప్రయోజనాలు దక్కుతాయి. క్రిటికల్ మినరల్స్ కారిడార్, హైస్పీడ్ రైల్ అనుసంధానం, డేటా సెంటర్లకు పన్ను ప్రోత్సాహం, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి రాయితీలు ప్రకటించారు. పర్యాటక రంగంపై కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి పెట్టారు.' అని లోకేశ్ పేర్కొన్నారు..

రాష్ట్రంలో ప్రకృతి సేద్యానికి ఊతం

- వ్యవసాయ మంత్రి అచ్చెన్న హర్షం



అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర వ్యవసాయానికి ప్రాధాన్యం లభించింది. ఏపీ వ్యవసాయ రంగాన్ని పరిపుష్టం చేసేలా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల భూసారం వృద్ధి చెందడంతో పాటు రైతుల ఆదాయం పెరుగుతుందని కేంద్రం భావిస్తోంది. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు రూ.155.32 కోట్లను కేంద్రం కేటాయించింది. రిజర్వాయర్లలో చేపల పెంపకం ద్వారా మత్స్య రంగ అభివృద్ధికి ఊతమివ్వడంతో గ్రామీణ ప్రాంతాల్లో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడే అవకాశం ఉంటుందని మత్స్యకార సంఘాల నేతలు భావిస్తున్నారు. పశుసంవర్ధకశాఖకు ప్రోత్సాహకాలు పెంచడం ద్వారా పాడి రైతులకు ఆర్థికభరోసా లభిస్తుందని డెయిరీ రంగ ప్రముఖులు తెలిపారు.

రైతుకు ఊతమిచ్చిన బడ్జెట్

కేంద్ర బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయానికి పెద్ద పీట వేయడం ద్వారా ఏపీ అభివృద్ధికి బలమైన పునాది పడుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.155.32కోట్లు కేటాయించడం కేంద్రప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమని, దీని వల్ల భూసారం, రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు.

సామాన్యుడికి రక్షణ కవచం

'2026-27 వార్షిక బడ్జెట్ దేశాభివృద్ధికి దిక్సూచిలా, సామాన్యుడికి రక్షణ కవచంలా ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక తోడ్పాటులో భాగంగా ఏపీకి నిధుల కేటాయింపులో సింహభాగం దక్కడం సంతోషకరం. ప్రపంచవ్యాప్తంగా అస్థిరతలు ఉన్నప్పటికీ గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.12.2 లక్షల కోట్ల మూలధన పెట్టుబడులు పెట్టడం మోదీ సర్కార్ దార్శనికతకు నిదర్శనం.'

- రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి

ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చింది మీరేనా?

- మావోయిస్టుల పేరిట ఫోన్లను ట్యాపింగ్ చేయించారా?
- ఎన్నికల్లో గెలుపునకు ఆయుధంగా మార్చుకున్నారా?
- తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌పై సిట్ అధికారుల ప్రశ్నల వర్షం



హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అనధికార, అక్రమ టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు ఆదివారం విచారించారు. నందినగర్‌లోని ఆయన నివాసంలో నాలుగున్నర గంటలకుపైగా ఈ విచారణ కొనసాగింది. కేసీఆర్ విచారణను ఆసాంతం.. ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యుడిగా ఆయన కుమారుడు కేటీఆర్‌ను విచారణ సమయంలో ఉండటానికి సిట్ అధికారులు అనుమతి ఇచ్చారు. ఇంట్లో ఉన్న హరీశ్‌రావు తదితర నేతలను బయటకు పంపివేశారు. న్యాయవాద బృందంలోని రామచంద్రరావును మాత్రం కేటీఆర్‌తో కలిసి ఉండటానికి అనుమతించారు. అనధికార, అక్రమ ఫోన్ ట్యాపింగ్‌లో కీలకపాత్ర పోషించిన అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఆయన బృందంలోని ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న ఇచ్చిన వాంగ్మూలాలతోపాటు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు వాంగ్మూలం ఆధారంగా కేసీఆర్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ వల్ల వచ్చిన సమాచారం ఆధారంగా బెదిరింపులకు పాల్పడటంతోనే బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్లు పెద్ద మొత్తంలో వచ్చాయా? అన్న ప్రశ్నకు.. ఆ విషయాలు తనకు తెలియని, పార్టీకి కోశాధికారి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉంటారని కేసీఆర్ చెప్పినట్లు సమాచారం. మావోయిస్టుల పేరిట కొన్నివేల మంది ఫోన్లను ట్యాపింగ్ చేయించారా? అంటూ సిట్ అధికారులు ప్రశ్నించగా.. అనుమతులు ఇచ్చేది తాను కాదని, ట్యాపింగ్‌కు సంబంధించి చట్టబద్ధమైన వ్యవస్థ పనిచేస్తుందని కేసీఆర్ చెప్పినట్లు, రివ్యూ కమిటీ అనుమతులు ఇస్తుందన్న విషయం మీకూ తెలుసు కదా! అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.